PRAJASAKTI Regd.No. 15795/68

సిటీ◆

ప్రజాశక్తి

ప్రతి అక్షరం ప్రజల పక్షం

Published from Vijayawada, Visakhapatnam, Kurnool, Tirupathi, Rajahmundry, Srikakulam, Ongole and Ananthapuramu

సంపుటి : 43 సంచిక : 92 | విజయవాడ, గురువారం 02 నవంబర్ 2023 | 6 + 8 పేజీలు వెల : 5.50

Vol No | Vijayawada, Thursday 02 November 2023 | Rs

సెమీస్‌కు దక్షిణాఫ్రికా

- న్యూజిలాండ్‌పై 190పరుగుల తేడాతో గెలుపు
- డికాక్, డుస్సెన్ సెంచరీలు
- మహరాజ్‌కు నాలుగు వికెట్లు

కరువుకూ కోతలు!

- వాస్తవ పరిస్థితులకు దూరంగా సర్కారు ప్రకటన
- 300 మండలాలకు 103 గుర్తింపు
- చివరి క్షణం వరకు నాన్చుడు
- డెడ్‌లైన్ రోజు అర్థరాత్రి హడావుడిగా గెజిట్
- విమర్శల నుంచి తప్పించుకునేందుకే..
- ప్రతిపక్షాలు, రైతుల తీవ్ర ఆగ్రహం

ప్రజాశక్తి ప్రత్యేక ప్రతినిధి- అమరావతి

రాష్ట్రాన్ని కరువు రక్కసి పీడిస్తుండగా కరువు మండలాలను ప్రకటించే విషయంలో ప్రభుత్వం పిసినారితనం ప్రదర్శించింది. కరువుకూ కోతలు పెట్టింది. సెప్టెంబర్‌తో ఖరీఫ్ ముగియగా, వెనువెంటనే కరువు మండలాల ప్రకటనపై కసరత్తు నిర్వహించాల్సిన సర్కారు కేంద్ర కరువు మాన్యువల్ ప్రకారం డెడ్‌లైన్ ముగిసే వరకు మీనమేషాలు లెక్కించింది. సమాచార సేకరణ, అంచనాలు రూపొందించడంలో ఆచితూచి వ్యవహరించింది. తీరా గడువు ముగిసే రోజు చివరి క్షణాన మంగళవారం అర్థరాత్రి ఏడు జిల్లాల్లోని 103 మండలాలను హడావుడిగా ప్రకటించి గెజిట్ నోటిఫికేషన్ జారీ చేసింది. ఆయా జిల్లాల్లో గుర్తించిందే తక్కువకాగా వాటిలో కూడా తీవ్ర స్థాయి 80, మధ్యస్త స్థాయి 23 కింద వర్గీకరించింది. క్షేత్ర స్థాయిలో నెలకొన్న వాస్తవ పరిస్థితులకు, జిల్లా అడ్మినిస్ట్రేషన్ పంపిన నివేదికలకు, ప్రభుత్వ కరువు మండలాల ప్రకటనకు అస్సలు పొంతన లేదు. చివరి వరకు సమయం గడిపి, ముప్పేటా కరువు మండలాల గుర్తింపుపై ఆందోళనలు అధికమవడంతో హడావుడిగా ప్రకటన చేసినట్లు సమాచారం. కరువు ప్రకటనపై ప్రతిపక్షాలు, రైతు సంఘాల ఆగ్రహంతో పాటు అధికారపార్టీ మంత్రులు, ఎంఎల్‌ఎలు, నేతల నుంచి సైతం అసంతృప్తి నెలకొంది. దాంతో మరో విడత కరువు మండలాలు ప్రకటిస్తారని ప్రభుత్వంలో చర్చ సాగుతోంది.

గడువు వరకు తాత్సారం

ఖరీఫ్‌పై ఎల్‌నినో ప్రభావం పడుతుందని, ఈ తడవ తక్కువ వర్షపాతం నమోదవుతుందని సీజన్ ప్రారంభం నుంచీ సంకేతాలున్నాయి. జులైలో 164 మండలాల్లో డ్రైస్పెల్ నెలకొందని అధికారిక నివేదికలు చెబుతున్నాయి. ఆగస్టులో వర్షాభావ సమస్య తీవ్రమైంది. ఆ నెలలో ఏకంగా 407 మండలాల్లో డ్రైస్పెల్స్ ఏర్పడ్డాయి. అప్పటికీ ప్రభుత్వంలో చలనం లేదు. ఇక సెప్టెంబర్‌లో 300 వరకు మండలాల్లో డ్రైస్పెల్స్ నెలకొన్నాయి. అక్టోబర్‌లో ఇంకా సమస్య తీవ్రమైంది. వ్యవసాయ, ఉద్యానవన పంటల సాధారణ సాగు విస్తీర్ణంలో 30 లక్షల ఎకరాలకు పైన సాగు లేక బీడు పడ్డాయి. వేసిన పంటల్లో చాలా మట్టుకు ఎండిపోయాయి. సాగునీటికి గ్యారంటీ ఉన్న కృష్ణా, పెన్నా డెల్టాలలో నీటి కొరతతో పంటలు ఎండాయి. నాగార్జునసాగర్ కాల్వల కింద కూడా అదే పరిస్థితి. విద్యుత్ కోతలు సరేసరి. అయినా ప్రభుత్వం వర్షాలు కురుస్తాయని, సగటు గణాంకాలతో సాధారణ పరిస్థితి నెలకొంటుందని ఆశగా ఎదురు చూసింది. వైసిపి వచ్చాక మొదటి రెండేళ్లు ఒకింత వానలు బానే పడ్డాయి. నిరుడు మూడవ ఏట సుమారు 275 మండలాల్లో కరువు ప్రటించాలని జిల్లాల నుంచి అభ్యర్థనలొచ్చినా ప్రకటించలేదు. ఈ సంవత్సరం కూడా అలానే చేద్దామనుకున్నారు. రైతు భరోసా, పంటలు నష్టపోయిన రైతులకు ఇన్‌పుట్ సబ్సిడీ, బీమా, పంట రుణాలపై సున్నా వడ్డీ ఇస్తున్నప్పుడు కరువు ప్రకటన ఎందుకని వాదిస్తూ వచ్చారు. కరువు ప్రకటిస్తే అదేదో తమ సర్కారుకు ఓటమి, నామర్దా అన్నట్లు భావించింది. తమ పాలనలో పుష్కలంగా వానలు పడ్డాయని చెప్పి, ఎన్నికల ఏడాదిలో కరువును ప్రకటిస్తే రాజకీయంగా ఆత్మరక్షణలో పడతామని ఒకింత ప్రభుత్వం భయపడింది. సిపిఎం, వామపక్షాల, రైతు సంఘాల ఆందోళనలు, చివరి నిమిషంలో టిడిపి కరువుపై ప్రచారానికి పిలుపునివ్వడం, బెయిల్‌పై చంద్రబాబు విడుదల, ఈ కారణాలతో మంగళవారం అర్థరాత్రి హడావుడిగా గెజిట్ విడుదల చేసినట్లు తెలుస్తోంది.

శాస్త్రీయతపై అనుమానాలు

కరువు మండలాల గుర్తింపు విషయంలో ప్రభుత్వం పాటించిన నిబంధనలు, కొలబద్దల శాస్త్రీయతపై అనుమానాలు రేకెత్తుతున్నాయి. వాస్తవ పరిస్థితులను ప్రతిబింబించట్లేదని విమర్శలు మిన్నంటాయి. సిఎం సొంత జిల్లా కడపలో మొత్తం 36 మండలాలుండగా ఆగస్టులో 18 మండలాల్లో తీవ్ర డ్రైస్పెల్ ఉంది. సెప్టెంబర్‌లోనూ అదే పరిస్థితి కొనసాగింది. అయినా జిల్లాలో ఒక్క మండలం కూడా ప్రకటించలేదు. ఆది నుంచీ తిరుపతిలో దుర్భిక్షం ఉంది. మొత్తం 34 మండలాలుండగా డ్రైస్పెల్ మండలాలు 27 వరకు ఉన్నాయి. అక్కడా ఒక్క మండలమూ గుర్తించలేదు. రాష్ట్రంలోనే నెల్లూరులో తీవ్ర కరువుంది. నేడు కూడా 61 శాతం లోటు వర్షపాతం ఉంది. జిల్లాలో 38 మండలాలుండగా 31 డ్రైస్పెల్ మండలాలు. అక్కడా ఒక్క మండలం కూడా గుర్తించలేదు. ప్రకాశం, పల్నాడులోనూ మిగతా 2లో

300 మండలాల్లో కరువు : సిపిఎం

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

రాష్ట్రంలో సుమారు 300 మండలాల్లో కరువు పరిస్థితులుంటే రాష్ట్ర ప్రభుత్వం కేవలం 103 మండలాలను మాత్రమే కరువు మండలాలుగా ప్రకటించడం పట్ల సిపిఎం రాష్ట్ర కమిటీ తీవ్ర అభ్యంతరం తెలిపింది. ఈ మేరకు బుధవారం పార్టీ రాష్ట్ర కార్యదర్శి వి శ్రీనివాసరావు ప్రకటన విడుదల చేశారు. కరువుకు గురైన అన్ని మండలాలనూ కరువు మండలాలుగా ప్రకటించి, సహాయక చర్యలు చేపట్టాలని, కేంద్రం కరువు పరిశీలనా బృందాలను పంపి, ప్రకృతి వైపరీత్యాల నిధిని విడుదల చేయాలని డిమాండ్ చేశారు.

ముఖ్యమంత్రి సొంత జిల్లా కడపలో 17 కరువు మండలాలు ఉంటే ఒక్క మండలాన్ని కూడా ప్రకటించలేదని తెలిపారు. ప్రకాశం జిల్లాలో 38 మండలాల్లో 30 మండలాలు కరువులో ఉన్నాయని, అయినా ఒక్క మండలాన్నీ ప్రకటించలేదని తెలిపారు. బాపట్ల జిల్లా అద్దంకి, కొరిశపాడు, బల్లికురవ, సంతమావులూరు, పంగులూరు, మార్టూరు వంటి ఆరు మండలాల్లో తీవ్ర వర్షాభావ పరిస్థితులు ఉంటే ఒక్క మండలాన్నీ కరువు మండలంగా ప్రకటించలేదని విమర్శించారు. ఏలూరు జిల్లాలో చింతలపూడి, చాట్రాయి, వేలేరుపాడు, కుక్కునూరు వంటి నాలుగు మండలాల్లో తీవ్ర కరువు పరిస్థితులు ఉన్నాయని పేర్కొన్నారు. మరొక ఏడు మండలాలు కరువు బారినపడ్డాయని తెలిపారు. అయినా గుర్తించలేదని విమర్శించారు. సత్యసాయి జిల్లాలో 31 మండలాల్లో కరువు ఉంటే 21 మండలాలనే ప్రకటించి 11 మండలాలను విస్మరించారని పేర్కొన్నారు. నెల్లూరులో 30 మండలాల్లో 20 మండలాల్లో కరువు ఉందని వివరించారు. పరిస్థితులు ఇంత దారుణంగా ఉంటే కరువు మండలాల ప్రకటనకు రాష్ట్ర ప్రభుత్వం ఏం కొలబద్ద తీసుకుందో చెప్పాలని డిమాండ్ చేశారు. ప్రస్తుతం విస్మరించిన అన్ని మండలాలనూ కరువు మండలాలుగా ప్రకటించి తక్షణమే కరువు సహాయక చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు.

ఈ నెలలోనే గ్రూప్ పోస్టులకు నోటిఫికేషన్లు

- డిసెంబరులో అసిస్టెంట్ ప్రొఫెసర్ పరీక్షలు
- ఎపిపిఎస్‌సి వెల్లడి

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

వివిధ ప్రభుత్వ శాఖల్లో ఖాళీగా ఉన్న గ్రూప్-1, 2 పోస్టుల భర్తీకి ఈ నెలలోనే నోటిఫికేషన్ విడుదల చేస్తామని ఆంధ్రప్రదేశ్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ (ఎపిపిఎస్‌సి) వెల్లడించింది. ఈ మేరకు ఎపిపిఎస్‌సి కార్యదర్శి ప్రదీప్ కుమార్ బుధవారం ఒక ప్రకటన విడుదల చేశారు. 89కు పైగా గ్రూప్-1, 900 గ్రూప్-2 పోస్టులతోపాటు వివిధ శాఖల్లో ఖాళీగా ఉన్న 614 పోస్టుల భర్తీకి కూడా నోటిఫికేషన్లు విడుదల చేస్తామని వివరించారు. వివిధ యూనివర్సిటీల్లో ఖాళీగా ఉన్న అసిస్టెంట్ ప్రొఫెసర్ల పోస్టులకు డిసెంబరులో నిర్వహించే పరీక్షకు కూడా నిరుద్యోగులు సంసిద్ధంగా ఉండాలని తెలిపారు. కచ్చితమైన నిర్ణీత కాలంలో నియామకాలు పూర్తిచేస్తామని వివరించారు. గ్రూప్-2 స్కీం, సిలబస్‌లో హేతుబద్ధమైన మార్పులు తీసుకొచ్చామని పేర్కొన్నారు. ప్రభుత్వం 900 పోస్టుల భర్తీకి అనుమతులు జారీ చేసిందని, జిఒ 77కు అనుగుణంగా ఆయా శాఖలతో సంప్రదింపులు జరుపుతున్నామని పేర్కొన్నారు. భవిష్యత్తులో ఎటువంటి న్యాయ వివాదాలకు తావు లేకుండా ఈ నెలలోనే నోటిఫికేషన్ విడుదల చేస్తామని తెలిపారు. గ్రూప్-1 పరీక్షలు, మూల్యాంకనం, అభ్యర్థుల ఎంపిక శాస్త్రీయంగా, సమర్థవంతంగా, హేతుబద్ధంగా, అభ్యర్థుల వాస్తవిక నైపుణ్యాన్ని అంచనా వేసి పూర్తి సమర్థులైన వారిని ఎంపిక చేసేలా కొత్త విధానాన్ని రూపొందిస్తామని పేర్కొన్నారు. ఐఐటి, హెచ్‌సియు, రిక్రూటింగ్ ఏజెన్సీలు, మేధావి వర్గాలు, వివిధ యూనివర్సిటీల్లో నిష్ణాతులైన సీనియర్ ప్రొఫెసర్ల, ఇతర పబ్లిక్ సర్వీస్ కమిషన్ నిపుణులు, నిరుద్యోగులతో చర్చిస్తామన్నారు. వారి సలహాలతో స్కీం, సిలబస్‌లలో సమూల మార్పులు తీసుకొస్తామని పేర్కొన్నారు. ఈ ప్రక్రియ పూర్తయిన వెంటనే నోటిఫికేషన్ విడుదల చేస్తామని వివరించారు. గతేడాది సెప్టెంబరులో విడుదల చేసిన గ్రూప్-1 నోటిఫికేషన్‌కు కేవలం 11 నెలల్లో నియామకాలు పూర్తి చేశామని తెలిపారు.

పేదల ఇళ్లు కూల్చివేత

- కులం పేరుతో దూషణ
- అడ్డుకోబోయిన నేతలపై లాఠీఛార్జి
- రాంభూపాల్‌పై చేయిచేసుకున్న సిఐ
- తీవ్రంగా ఖండించిన సిపిఎం

ప్రజాశక్తి - అనంతపురం ప్రతినిధి

నిరుపేదలందరికీ ఊర్లను, కాలనీలను నిర్మిస్తున్నామంటూ నిత్యం గొప్పలు చెప్పుకునే రాష్ట్ర ప్రభుత్వం అదే నిరుపేదలపై దౌర్జన్యకాండకు పాల్పడింది. కాయకష్టం చేసి తలదాచుకోవడానికి కాస్తంత చోటులో నాలుగేళ్ల కిందట నిర్మించుకున్న ఇళ్లను, గుడిసెలను అమానవీయంగా పెకిలించివేసింది. అనంతపురం జిల్లా గార్లదిన్నె మండలం కల్లూరు గ్రామ పరిధిలో బుధవారం తెల్లవారుజామున చోటుచేసుకున్న ఈ దురాగతం కారణంగా గిరిజన, దళిత సామాజిక తరగతులకు చెందిన 150 నిరుపేద కుటుంబాలు వీధినపడ్డాయి. ఈ స్థలాల్లో పేదల ఇళ్లను తొలగించరాదని హైకోర్టు స్టే ఇచ్చిన విషయాన్ని గుర్తు చేసి.. కూల్చివేతలను అడ్డుకోబోయిన పేదలపైనా, సిపిఎం నాయకులపైనా పోలీసులు దాడికి పాల్పడ్డారు. విచక్షణారాహిత్యంగా లాఠీఛార్జి చేయడంతోపాటు సిపిఎం అనంతపురం జిల్లా కార్యదర్శి రాంభూపాల్‌పై ఇటుకలపల్లి సిఐ వై నరేంద్రరెడ్డి చేయిచేసుకున్నారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రావతరణ వేడుకలు జరుపుకుంటున్న రోజే నిరుపేద దళిత, గిరిజనులపై పోలీసులు సాగించిన ఈ దౌర్జన్యకాండపై సర్వత్రా ఆగ్రహం వ్యక్తమవుతోంది. ప్రభుత్వ దాష్టీక చర్యను సిపిఎం రాష్ట్ర కమిటీ తీవ్రంగా ఖండించింది. దాడికి పాల్పడిన సిఐపైనా, ఇతర అధికారులపైనా తక్షణమే చర్యలు తీసుకోవాలని, పేదలందరికీ కూల్చివేసినచోటే ప్రభుత్వమే ఇళ్లను నిర్మించి ఇవ్వాలని డిమాండ్ చేసింది. పూర్తి కథనం 2లో

బిజెపి అవకాశవాద రాజకీయాలను తిప్పికొట్టాలి

- కృష్ణా జలాల కేటాయింపుల్లో అన్యాయం చేస్తే సహించం : గఫూర్
- అనంతపురం, వైఎస్ఆర్ జిల్లాల్లో కొనసాగిన ప్రజారక్షణ భేరి

బద్వేలు బహిరంగ సభలో మాట్లాడుతున్న ఎంఎ.గఫూర్

ప్రజాశక్తి- కడప ప్రతినిధి, తాడిపత్రి, గుత్తి

బిజెపి అవకాశవాద రాజకీయాలను తిప్పికొట్టాలని సిపిఎం కేంద్ర కమిటీ సభ్యులు ఎంఎ.గఫూర్ పిలుపునిచ్చారు. కార్పొరేట్ అనుకూల పాలన సాగిస్తోన్న ఆ పార్టీతో దేశానికి అత్యంత ప్రమాదమని అన్నారు. కోటిమంది స్కీమ్ వర్కర్లను విధుల నుంచి తొలగించే కుట్రకు కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం పూనుకుంటోందని విమర్శించారు. విజయనగరం జిల్లాలో రైలు ప్రమాదం జరిగి 13 మంది మరణించినా మోడీకి చీమకుట్టినట్లుగా కూడా లేదన్నారు. బిజెపి అధికారంలో కొనసాగితే దేశం అధోగతిపాలవుతుందని ఆందోళన వ్యక్తం చేశారు. సిపిఎం ఆధ్వర్యంలో చేపట్టిన ప్రజా రక్షణభేరి బస్సు యాత్ర బుధవారం వైఎస్ఆర్, అనంతపురం జిల్లాల్లో కొనసాగింది. బద్వేలు నుంచి కడప, తాడిపత్రి మీదుగా గుత్తి చేరుకుంది. ఈ యాత్రకు సిపిఎం శ్రేణులు, ప్రజల నుంచి ఎక్కడికక్కడే ఘన స్వాగతం లభించింది. ఈ సందర్భంగా ఆయా ప్రాంతాల్లో జరిగిన బహిరంగ సభల్లో గఫూర్ మాట్లాడుతూ ప్రత్యేక హోదా, వెనుక బడిన రాయలసీమ, ఉత్తరాంధ్రలకు బుందేల్‌ఖండ్ తరహా ప్యాకేజీ, కడపలో ఉక్కు పరిశ్రమ ఏర్పాటు, రైల్వే జోన్, పోలవరం వంటి విభజన హామీలను కేంద్ర ప్రభుత్వం అమలు చేయకపోవడం, రాష్ట్ర ప్రభుత్వం ప్రశ్నించకపోవడం శోచనీయమన్నారు. కడపలో స్టీల్ ప్లాంటు ఏర్పాటైతే వేలాది మందికి ఉద్యోగాలొస్తాయని, ఫలితంగా వైఎస్ఆర్ జిల్లా నుంచి వలసలు తగ్గుతాయని తెలిపారు. చంద్రబాబు హయాంలో ఉక్కు పరిశ్రమ ఏర్పాటుకు ఓ బండరాయిని వేశారని, ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డి మరో బండరాయిని వేశారని విమర్శించారు. కృష్ణా జలాల పంపిణీలో రాష్ట్రానికి కేంద్రం అన్యాయం చేస్తే సహించబోమన్నారు. సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు ప్రభాకర్‌రెడ్డి, రమాదేవి, రాష్ట్ర కమిటీ సభ్యులు కృష్ణయ్య, శివనాగరాణి, ఉమామహేశ్వర రావు, భాస్కరయ్య మాట్లాడుతూ బిజెపి విధానాల వల్ల కోట్లాది మంది కార్మికుల, కర్షకుల సంపద కొద్దిమంది దగ్గరే పోగుపడుతోందన్నారు. దేశంలో పేదరికం పెరుగుతోందని తెలిపారు. రాష్ట్రంలో అధికారంలో ఉన్న వైసిపి సర్కారు కొత్తగా ఒక్క ప్రాజెక్టునుగానీ, పరిశ్రమనుగానీ ఎందుకు తీసుకురాకపోయిందని ప్రశ్నించారు. రాష్ట్రంలోని 440 మండలాల్లో కరువు పరిస్థితులు నెలకొనగా, కేవలం 103 మండలాలనే కరువు మండలాలుగా ప్రకటించడం శోచనీయమన్నారు. గత తొమ్మిన్నరేళ్లలో మహిళలకు, పసిపిల్లలకు రక్షణ కల్పించడంలో విఫలమైన బిజెపి ప్రభుత్వం... మహిళా రిజర్వేషన్ బిల్లును ఓట్ల కోసమే ఇప్పుడు తెచ్చిందని విమర్శించారు.

రూ.1.72 లక్షల కోట్ల జిఎస్‌టి వసూళ్లు

న్యూఢిల్లీ : ప్రజలు, కంపెనీల నుంచి కేంద్ర ప్రభుత్వం భారీ మొత్తంలో పన్ను వసూళ్లను రాబడుతోంది. ప్రస్తుత ఏడాది అక్టోబర్‌లో వస్తు సేవల పన్నులు (జిఎస్‌టి) రికార్డ్ స్థాయిలో రూ.1.72 లక్షల కోట్లు వసూళ్లయ్యాయి. దీంతో జిఎస్‌టి అమల్లోకి వచ్చిన తర్వాత రెండో సారి అత్యధిక వసూళ్ల చోటు చేసుకున్నట్లయ్యింది. ఇంతక్రితం 2023 ఏప్రిల్‌లో అత్యధికంగా రూ.1.87 లక్షల కోట్ల రాబడి చోటు చేసుకుంది. గతేడాది అక్టోబర్‌లోని రూ.1.66 లక్షల కోట్లతో పోలిస్తే క్రితం నెల వసూళ్లలో 13 శాతం వృద్ధి చోటు చేసుకుంది. సిజిఎస్‌టి రూపంలో 30,062 కోట్లు, ఎస్‌జిఎస్‌టి కింద రూ.38,171 కోట్లు, ఐజిఎస్‌టి కింద రూ.91,315 కోట్లు, సెస్ రూపేనా రూ.12,456 కోట్లు చొప్పున పన్నులు వసూళ్లయ్యాయని ఆర్థిక మంత్రిత్వ శాఖ వెల్లడించింది. గడిచిన నెలలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో 11 శాతం వృద్ధితో 8,127 కోట్ల జిఎస్‌టి వసూళ్లయ్యింది. తెలంగాణలో 19 శాతం పెరిగి రూ.11,377 కోట్లుగా నమోదయ్యాయి.

ఘనంగా రాష్ట్రావతరణ వేడుకలు

- క్యాంపు కార్యాలయంలో సిఎం జెండావిష్కరణ
- పొట్టి శ్రీరాములుకు నివాళి

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

ఆంధ్రప్రదేశ్ రాష్ట్రావతరణ వేడుకలు రాష్ట్రవ్యాప్తంగా ఘనంగా జరిగాయి. బుధవారం తాడేపల్లిలోని క్యాంపు కార్యాలయంలో రాష్ట్రావతరణ వేడుకల్లో భాగంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి జాతీయ జెండాను ఆవిష్కరించారు. జాతీయోద్యమ కాలంలో భాషాప్రయుక్త రాష్ట్రాలు ఏర్పాటు చేసిన పోరాటాల ఫలితంగా దేశంలో మద్రాస్ ప్రెసిడెన్సీ నుంచి విడిపోయి 13 జిల్లాలతో 1953లో అక్టోబరు 1 ఆంధ్ర రాష్ట్రం ఏర్పాటు కావడం ఆ తర్వాత హైదరాబాద్‌లోని 11 జిల్లాలతో 1956 నవంబరు 1న ఆంధ్రప్రదేశ్ ఏర్పాటైన తర్వాత 2014 వరకు నవంబరు 1నే రాష్ట్రావతరణ వేడుకలు జరిగేవి. ప్రతియేటా నవంబరు 1న జరుపుకునే ఆంధ్రప్రదేశ్ రాష్ట్రావతరణ దినోత్సవ వేడుకలను తెలంగాణ విడిపోయాక గత ప్రభుత్వం ఈ వేడుకలకు దూరంగా ఉంది. మద్రాస్ ప్రెసిడెన్సీ నుంచి 13 జిల్లాలతో విడిపోయిన అక్టోబరు 1న జరుపుకోవాలా, 2014 జూన్ 2న తెలంగాణ నుంచి విడిపోయిన రోజున మిగతా 2లో

వ్యవసాయ రంగంలో సేవలకు గాను పంగి వినీతకు వైఎస్ఆర్ అచీవ్‌మెంట్ అవార్డు ప్రదానం చేస్తున్న గవర్నర్ జస్టిస్ అబ్దుల్ నజీర్, సిఎం జగన్‌మోహన్‌రెడ్డి

వైఎస్ఆర్ అవార్డులు ప్రదానం

- 27 మందికి సన్మానం

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

వివిధ రంగాల్లో విశేష సేవలందిస్తున్న వారికి ప్రతియేటా ఇస్తున్న వైఎస్ఆర్ లైఫ్‌టైం అచీవ్‌మెంటు అవార్డులు తెలుగువారి గొప్పదనానికి నిలువెత్తు నిదర్శనమని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అన్నారు. విజయవాడలో జరిగిన వైఎస్ఆర్ లైఫ్‌టైమ్ అచీవ్‌మెంటు అవార్డులను రాష్ట్ర గవర్నరు జస్టిస్ అబ్దుల్ నజీర్, సిఎం తల్లి వైఎస్ విజయమ్మ, ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చేతులమీదుగా అవార్డు గ్రహీతలకు అందజేశారు. ఈ సందర్భంగా గవర్నరు మిగతా 2లో

మళ్లీ జిల్లాల పునర్విభజన !

- రాష్ట్ర సర్కారు కసరత్తు
- కేబినెట్‌లో నిర్ణయం?

ప్రజాశక్తి - యంత్రాంగం

జిల్లాల పునర్ విభజన అంశం మళ్లీ తెరపైకి వచ్చింది. విశ్వసనీయ సమాచారం ప్రకారం రాష్ట్ర ప్రభుత్వం ఈ విషయమై గుట్టుచప్పుడు కాకుండా కసరత్తు చేస్తోంది. అక్కడక్కడ ప్రజల స్పందన తెలుసుకునే ప్రయత్నాలు కూడా చేస్తోంది. ప్రస్తుతమున్న 26 జిల్లాల సంఖ్యను పార్లమెంటు స్థానాలకు సమానంగా 25కు తగ్గించడం ఈ కసరత్తు సారాంశమని తెలిసింది. దీనిలో భాగంలో రాష్ట్రంలో కొన్ని ప్రాంతాల్లో జిల్లాల సంఖ్య తగ్గనుండగా, మరికొన్ని చోట్ల పెరిగే అవకాశం ఉందని తెలిసింది. అయితే, ఖచ్చితంగా 25 జిల్లాలకు పరిమితం చేస్తారా, అంతకన్నా తగ్గిస్తారా అన్న విషయమై స్పష్టత లేదు. త్వరలో జరగనున్న రాష్ట్ర మంత్రివర్గ సమావేశంలో ఈ విషయమై ఒక నిర్ణయం తీసుకునే అవకాశం ఉందని సమాచారం. మూడవ తేది (శుక్రవారం) జరగనున్న మంత్రివర్గ సమావేశంలోనే ఈ విషయం చర్చకు వచ్చే అవకాశం ఉందని భావిస్తున్నారు. రాష్ట్రంలో పార్లమెంటు స్థానాల కన్నా జిల్లాల సంఖ్య ఎక్కువగా ఉండటంతో, తగ్గించాలంటూ చేసిన సూచన మేరకు ఈ కసరత్తు జరుగుతోందని తెలిసింది. పనిలో పనిగా ఎన్నికల ప్రయోజనాలను కూడా పరిగణలోకి తీసుకుంటున్నట్లు సమాచారం. అయితే, ఈ కసరత్తును అధికారులు ధృవీకరించలేదు. వివరణ తీసుకోవడానికి ప్రజాశక్తి ప్రయత్నించగా 'మాకు తెలియదు' అన్న జవాబు వారి దగ్గర నుండి వచ్చింది.

'అన్నమయ్య' అంతర్ధానం..

అన్నమయ్య జిల్లా ఏర్పాటు వల్ల వైఎస్ఆర్ కాంగ్రెస్ కంచుకోటగా ఉన్న కడప జిల్లా చేజారిపోతుందన్న అభిప్రాయం అక్కడి నాయకుల్లో వ్యక్తమవుతోంది. దీనిని దృష్టిలో ఉంచుకుని అన్నమయ్య జిల్లా ఏర్పాటును రద్దు చేసి పాత కడప జిల్లాను పునరుద్ధరించాలని వారు కోరుతున్నారు. కడప జిల్లాను అలానే ఉంచి, మదనపల్లి, పీలేరు, తంబళ్లపల్లి నియోజక వర్గాలను చిత్తూరు జిల్లాలో కలపాలని భావిస్తున్నట్లు తెలిసింది. కోడూరు అసెంబ్లీ నియోజకవర్గాన్ని తిరుపతి జిల్లాలో కలిపే అవకాశం ఉందని సమాచారం. ఈ ప్రతిపాదనపై ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి సైతం ఒకరిద్దరు మంత్రులతో చర్చించినట్లు తెలిసింది.

పూర్వస్థాయికే అనంతపురం...

అనంతపురం జిల్లాను తిరిగి పూర్వస్థాయికి తీసుకురావాలని భావిస్తున్నట్లు తెలిసింది. దీనిలో భాగంగా కొత్తగా ఏర్పాటు చేసిన సత్యసాయి జిల్లాను రద్దు చేసే అవకాశం ఉందని సమాచారం. పాలనపరంగా వీలుకాకపోవడంతో పాటు, విభజన తరువాత మారిన రాజకీయ పరిస్థితులు కూడా దీనికి కారణం. ఉమ్మడి జిల్లాకు సంబంధించిన ప్రజాప్రతినిధుల వద్ద ఈ విషయమై అభిప్రాయ సేకరణ చేసినట్లు తెలిసింది.

'మన్యం'మాయం?

గిరిజన ప్రాంతాలతో ఏర్పాటైన పార్వతీపురం మన్యం జిల్లా ఏర్పాటు నుండి కూడా ప్రభుత్వం వెనక్కి తగ్గనున్నట్లు సమాచారం. విజయనగరం, శ్రీకాకుళం జిల్లాలోని గిరిజన ప్రాంతాలతో ఈ జిల్లాను ఏర్పాటు చేసిన సంగతి తెలిసిందే. అయితే, చిన్న జిల్లా కావడం, పాలనాపరంగా అసౌకర్యంగా ఉండటం వంటి కారణాలతో పార్వతీపురం మన్యం జిల్లాను రద్దు చేయాలని భావిస్తున్నట్లు తెలిసింది.

కొత్తగా పోలవరం ?

పోలవరం కేంద్రంగా కొత్తగా మరో గిరిజన జిల్లాను ఏర్పాటు చేయాలని ప్రభుత్వం భావిస్తున్నట్లు తెలిసింది. ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డి ఈ ప్రతిపాదనకు గ్రీన్‌సిగ్నల్ ఇచ్చినట్లు సమాచారం. ఇప్పటి వరకు పోలవరం ప్రాంతం ఏలూరు జిల్లా పరిధిలో ఉండగా, మరో గిరిజన ప్రాంతమైన రంపచోడవరం నియోజకవర్గం అల్లూరి సీతారామరాజు జిల్లాలో ఉంది. ఆయా ప్రాంత గిరిజనులు ప్రస్తుతం జిల్లా కేంద్రమైన పాడేరుకు కార్యాలయ పనుల కోసం రావాలంటే కనీసం 200 కిలో మీటర్లకు పైగా ప్రయాణించాల్సి రావడం కష్టమవుతోంది. దీనిపై పలు విజ్ఞప్తులు అందడంతో నూతన జిల్లా ఏర్పాటు ఆలోచన చేస్తున్నట్లు సమాచారం. దీనితో పాటు పోలవరం ప్రాజెక్టు కారణంగా నిర్వాసితులవుతున్న వారికి పునరావాస పనులకు పరిపాలన సౌలభ్యం సులభమవుతుందని భావిస్తున్నట్లు తెలిసింది. మన్యం జిల్లాను రద్దు చేసినా పోలవరం జిల్లా ఏర్పాటు ద్వారా గిరిజన జిల్లాల సంఖ్యలో మాత్రం ఎటువంటి మార్పు ఉండదు.

రామ్‌సింగ్‌కు ఎమ్మెల్సీ సాబ్జి పరామర్శ

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

కావలిలో దాడికి గురై విజయవాడలోని విద్యాధరపురంలోని ఆర్‌టిసి ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న డ్రైవరు రామ్‌సింగ్‌ను పిడిఎఫ్ ఎమ్మెల్సీ షేక్ సాబ్జి పరామర్శించారు. బుధవారం ఎపిపిటిడి స్టాఫ్ అండ్ వర్కర్స్ ఫెడరేషన్ రీజనల్ కార్యదర్శి భాస్కర్‌రావు, నాయకులు కె శ్రీనివాసరావుతో కలిసి డ్రైవరు రామ్‌సింగ్‌ను పరామర్శించారు. రామ్‌సింగ్‌ను ఆరోగ్య పరిస్థితి, అందుతున్న వైద్య సేవలను గురించి సాబ్జి అడిగి తెలుసుకున్నారు. విధి నిర్వహణలో వున్న ఉద్యోగులపై దాడి చేయడం సరైంది కాదని, తక్షణం ఈ కేసులో ప్రమేయం వున్న వారందరినీ అరెస్టు చేసి కఠినంగా శిక్షించాలని ఆయన డిమాండ్ చేశారు.

ప్రజాశక్తిపై స్పందన ఫోన్ : 9490099006

ప్రజల పత్రికకు ప్రజలే మార్గదర్శకులు. ప్రజాశక్తిలో మీకు నచ్చిన నచ్చని అంశాలను ఎప్పటికప్పుడు మా దృష్టికి తీసుకువస్తే మరింత పదును పెట్టుకోవడానికి వీలవుతుంది.

94900 99006 ఫోన్ నెంబర్‌కు ఆదివారం మినహా ప్రతి రోజూ మధ్యాహ్నం 12 నుంచి సాయంత్రం 6 గంటల మధ్య మీ అభిప్రాయాలు తెలియజేయవచ్చు. మీరు చెప్పేది క్లుప్తంగా సూటిగా పద్ధతిగా వుండాలి. ఇప్పటికే చాలా మంది పంపుతున్న విమర్శలు, సూచనలు మాకు బాగా ఉపయోగపడుతున్నాయి. వారందరికీ కృతజ్ఞతలు.

అభిప్రాయాలు పంపదలిస్తే..
**స్పందన, ప్రజాశక్తి తెలుగు డైలీ,
ప్రజాశక్తి భవనం-అమరరెడ్డి కాలనీ,
అరవింద హైస్కూల్ దగ్గర, తాడేపల్లి,
గుంటూరు జిల్లా - 522 501**కు కానీ
editorprajasakthi@gmail.comకు పంపవచ్చు.

ఎఎస్‌పి అనిల్‌కుమార్‌కు కఠిన సేవాపథకం

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

రాష్ట్రంలో మావోయిస్టు కార్యకలాపాలను నియంత్రించడంలో సమర్థవంతంగా పనిచేశారని అల్లూరి సీతారామరాజు జిల్లా అడిషనల్ ఎస్‌పి పులిపాటి అనిల్‌కుమార్‌కు కఠిన సేవా పథకాన్ని రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించింది. ఈ మేరకు డిజిపి కెవి రాజేంద్రనాథ్‌రెడ్డి కఠిన సేవా పథకాన్ని సాధించిన పులిపాటి అనిల్‌కుమార్‌ను అభినందిస్తూ బుధవారం ఒక ప్రకటన విడుదల చేశారు.

1న పెన్షన్ చెల్లించేలా చూడాలి

- సిఎస్, సజ్జలకు ఎపిజెఎసి అమరావతి వినతి

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

రాష్ట్రంలో పింఛనుదారులకు ప్రతినెలా ఒకటిన పెన్షన్ చెల్లించేలా చూడాలని ఎపిజెఎసి అమరావతి ఛైర్మన్ బొప్పరాజు వెంకటేశ్వర్లు, ఎపి గవర్నమెంటు రిటైర్డ్ ఎంప్లాయీస్ అసోసియేషన్ అధ్యక్షులు శాస్త్రి ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు బుధవారం సిఎస్ కెఎస్ జవహర్‌రెడ్డి, ప్రభుత్వ సలహాదారు సజ్జల రామకృష్ణారెడ్డిని కలిసి వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా శాస్త్రి మాట్లాడుతూ.. ప్రస్తుతం రిటైర్డు ఉద్యోగులు సకాలంలో పెన్షన్లు రావాల్సిన పిఆర్‌సి, డిఎ బకాయిలు ప్రభుత్వం నేటికీ చెల్లించకపోవడంతో తీవ్ర ఆర్థిక ఇబ్బందులు పడుతున్నారని పేర్కొన్నారు. ఎంప్లాయీస్ హెల్త్ స్కీమ్ ద్వారా ఎవరికీ ఎలాంటి మెరుగైన సౌకర్యాలు అందడం లేదని, ప్రతినెలా రిటైర్డు ఉద్యోగి పెన్షన్ నుంచి డబ్బులు చెల్లిస్తున్నప్పటికీ కనీసం ఆరోగ్యశ్రీలో ఉన్న కొన్ని వైద్య సౌకర్యాలు కూడా ఇహెచ్‌ఎస్‌లో లేకపోవడం సరికాదన్నారు. బొప్పరాజు వెంకటేశ్వర్లు మాట్లాడుతూ.. పిఆర్‌సి 2022 బకాయిలు ప్రభుత్వ ఉద్యోగులతోపాటు 2027 నాటికి వాయిదాల రూపంలో చెల్లిస్తామని ప్రభుత్వం చెప్పడం పెన్షనర్లకు బాధాకరమన్నారు. వాయిదాలతో సంబంధం లేకుండా తక్షణమే పిఆర్‌సి 2022 బకాయిలు చెల్లించాలని ఆయన విజ్ఞప్తి చేశారు. అనంతరం డిప్యూటీ కలెక్టర్లుగా ఉద్యోగోన్నతులు పొందిన పలువురు తహశీల్దార్లు సిఎస్, సజ్జలను సన్మానించారు.

పేదల ఇళ్లు కూల్చివేత

- అడ్డుకోబోయిన సిపిఎం నాయకులపై సిఐ దౌర్జన్యం, అనుచిత ప్రవర్తన
- లాఠీఛార్జి, అరెస్టు, దళితులను కులం పేరుతో దూషణ

ప్రజాశక్తి- గార్లదిన్నె, అనంతపురం కలెక్టరేట్, అమరావతి బ్యూరో

అధికారులు కూల్చివేసిన ఇళ్లను పరిశీలిస్తున్న సిపిఎం కేంద్ర కమిటీ సభ్యులు ఎం.ఎ.గఫూర్

అనంతపురం జిల్లా గార్లదిన్నె మండలం కల్లూరు గ్రామంలో పేదల ఇళ్లు, గుడిసెలను రెవెన్యూ, పోలీసు అధికారులు బుధవారం వేకువజామున జెసిబితో తొలగించేశారు. దీనిని అడ్డుకోబోయిన సిపిఎం నాయకులపై పోలీసులు లాఠీఛార్జి చేశారు. సిఐ అనుచితంగా ప్రవర్తించారు. నాయకులను బలవంతంగా అరెస్టు చేసి స్టేషన్‌కు తరలించారు. గార్లదిన్నె మండలం కల్లూరు గ్రామ పంచాయతీ సర్వే నెంబర్ 165లోగల ప్రభుత్వ భూమిలో నాలుగేళ్ల క్రితం 150 దళిత, గిరిజన కుటుంబాలు ఇళ్లు నిర్మించుకొని, గుడిసెలు వేసుకుని నివాసం ఉంటున్నాయి. అక్కడే తమకు నివాస స్థల పట్టాలు ఇవ్వాలని పేదలు పలుమార్లు అధికారులను, ప్రజాప్రతినిధులను కోరారు. అయినా, ప్రయోజనం లేకపోయింది. దీంతో, పేదలు న్యాయం కోరుతూ కోర్టును ఆశ్రయించారు. కోర్టు స్టే అమలులో ఉన్నప్పటికీ ఎలాంటి ముందస్తు నోటీసులూ ఇవ్వకుండా నాలుగు జెసిబిలతో గుడిసెల కూల్చివేతకు పెద్ద సంఖ్యలో ప్రభుత్వ అధికారులు, పోలీసులు బుధవారం వేకువజామున వచ్చారు. రూరల్ డిఎస్‌పి ఆధ్వర్యాన ఐదుగురు సిఐలు, ఎనిమిది మంది ఎస్‌ఐలు, పదుల సంఖ్యలో పోలీసులు, అధికారులు, అధికార పార్టీ నాయకులు, వారి అనుచరులు తీవ్ర భయభ్రాంతులకు గురిచేశారు. ఏమి జరుగుతుందో తెలియక నిద్రలో ఉన్న పేదలు ఒక్కసారిగా ఉలిక్కిపడి లేచి ఆందోళనకు గురయ్యారు. గుడిసెల్లో నిత్యావసర వస్తువులు, ఇతర సామగ్రి ఉన్నాయని, తొలగించొద్దని ప్రాధేయపడినా కనికరం లేకుండా వ్యవహరించారు. గుడిసెలను దౌర్జన్యంగా జెసిబిలతో కూల్చివేయించారు. విషయం తెలిసి అక్కడికి వెళ్లి అడ్డుకోబోయిన సిపిఎం జిల్లా కార్యదర్శి వి.రాంభూపాల్, గార్లదిన్నె మండల కార్యదర్శి చెన్నారెడ్డి, రైతు సంఘం నాయకులు నాగరాజు పట్ల ఇటుకలపల్లి సిఐ వై.నరేంద్రరెడ్డి దురుసుగా ప్రవర్తించారు. రాంభూపాల్‌ను కొట్టారు. షర్ట్ కాలర్ పట్టి లాగుతూ 'ముందు ఈ నా కొడుకును లోపలెయ్యండి' అంటూ దూర్భాషలాడుతూ లాక్కెళ్లారు. సిపిఎం నాయకులపై లాఠీఛార్జి సైతం చేశారు. ఈ దౌర్జాన్యాన్ని మహిళలు అడ్డుకోగా వారిలో లక్ష్మీదేవి అనే మహిళను సిఐ జుట్టు పట్టి లాగేశారు. పేదలను నానా దుర్భాషలాడుతూ 'మాదిగ నా కొడుకులు ఎక్కడ స్థలం ఉంటే అక్కడేసుకుంటారు' అంటూ కులం పేరుతో దూషించారు. అడ్డుకున్న పేదలనూ కొట్టారు. ఈ దౌర్జన్యాన్ని ప్రశ్నించిన వారిపైనా సిఐ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. డ్రెస్ విప్పుతూ 'రండిరా చూసుకుందాం నా కొడకల్లారా' అంటూ అసభ్యంగా ప్రవర్తించారు. సిపిఎం నాయకులను బుక్కరాయసముద్రం పోలీస్ స్టేషన్‌కు తరలించారు. మధ్యాహ్నం వరకూ అక్కడే ఉంచి ఆ తర్వాత విడుదల చేశారు.

పేదల కన్నీటి రోదన

కష్టపడి నిర్మించుకున్న గుడిసెలను కళ్లెదుటే కూల్చివేయడాన్ని చూసి పేదలు కుంగిపోయారు. నిత్యావసర సరుకులు, సామగ్రి ధ్వంసం కావడంతో కట్టుబట్టలతో రోడ్డున పడ్డారు. బాలింతను అప్పుడే పుట్టిన పసికందుతోసహా అధికారులు రోడ్డుపైకి నెట్టేశారు.

తహశీల్దార్, ఆర్‌డిఒ కార్యాలయాల వద్ద ధర్నా

పేదల ఇళ్లు, గుడిసెల కూల్చివేత వేయడమేగాక, నాయకులపై సిఐ అనుచిత ప్రవర్తనను నిరసిస్తూ సిపిఎం ఆధ్వర్యంలో పేదలు గార్లదిన్నె తహశీల్దార్ కార్యాలయం, అనంతపురం ఆర్‌డిఒ కార్యాలయం వద్ద ధర్నా చేశారు. ఆర్‌డిఒను కార్యాలయం లోపలికి వెళ్లనీయకుండా ఘెరావ్ చేశారు. దీంతో, సిపిఎం నాయకులతో ఆర్‌డిఒ చర్చలు జరిపారు. పేదలకు యథాస్థానంలో పట్టాలు ఇవ్వాలని, సిఐ నరేందర్‌రెడ్డిని సస్పెండ్ చేయాలని నాయకులు డిమాండ్ చేశారు. పేదలకు న్యాయం చేస్తామని ఆర్‌డిఒ హామీ ఇవ్వడంతో ఆందోళన విరమింపజేశారు.

ఎమ్మెల్యే హస్తం : ఎం.ఎ.గఫూర్

పేదల గుడిసెలు, ఇళ్ల కూల్చివేతలో స్థానిక ఎమ్మెల్యే జొన్నలగడ్డ పద్మావతి హస్తం ఉందని సిపిఎం కేంద్ర కమిటీ సభ్యుడు ఎం.ఎం.గఫూర్ విమర్శించారు. రెవెన్యూ, పోలీసు అధికారులు కూల్చి వేసిన ఇళ్లను బుధవారం సాయంత్రం సిపిఎం రాష్ట్ర కమిటీ సభ్యుడు జి.ఓబులు తదితరులతో కలిసి ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా బాధితులతో గఫూర్ మాట్లాడారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ పేదలకు ప్రత్యామ్నాయ స్థలం చూపేంత వరకు నివాసాలను తొలగించరాదని కోర్టు స్పష్టమైన ఆదేశాలు ఇచ్చిందని, అయినా అధికారులు కోర్టు ధిక్కారానికి పాల్పడ్డారని విమర్శించారు. నిజంగా ప్రభుత్వానికి దేవాదాయ శాఖ భూములు కాపాడాలనే ఉద్దేశమే ఉంటే ప్రస్తుతం పేదల ఇళ్లు కూల్చివేసిన స్థలానికి ఆనుకుని వైసిపి నాయకుడు ఆక్రమించుకున్న 90 ఎకరాల భూమిని స్వాధీనం చేసుకోవాలని డిమాండ్ చేశారు.

సిఐపై చర్యలు తీసుకోవాలి - పేదలకు న్యాయం చేయాలి

డిజిపికి సిపిఎం రాష్ట్ర కార్యదర్శి శ్రీనివాసరావు లేఖ

పేదల గుడిసెలను అక్రమంగా కూలగొట్టడమే కాకుండా అడ్డుకునేందుకు వెళ్లిన సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు వి.రాంభూపాల్‌పై చేయిచేసుకుని అసభ్యంగా దూషించిన ఇటుకలపల్లి సిఐ వై.నరేంద్రరెడ్డిపై తక్షణమే చర్యలు తీసుకోవాలని సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి శ్రీనివాసరావు డిమాండ్ చేశారు. ఈ మేరకు బుధవారం డిజిపి కెవి రాజేంద్రనాథ్‌రెడ్డికి లేఖ రాశారు. ఈ భూమి నుంచి పేదలను ఖాళీ చేయించకుండా హైకోర్టులో డబ్ల్యుపి రిట్ పిటిషన్ నెంబర్ 39328/2022 రిజిస్ట్రేషన్ నెంబర్ 29532/ 2022 దాఖలైందని తెలిపారు. ఆ స్థలాల్లో పేదలను తొలగించరాదని కోర్టు కూడా స్టే ఇచ్చిందని పేర్కొన్నారు. అయినా, గుడిసెలను కూల్చివేయడం, సిపిఎం నాయకులను అసభ్యకరంగా దూషించడం, దౌర్జన్యానికి పాల్పడడం దారుణమని పేర్కొన్నారు. ఈ ఘటనకు కారణమైన సిఐపై చర్య తీసుకోవాలని, అరెస్టు చేసిన రాంభూపాల్‌ను, ఇతర నాయకులను వెంటనే భేషరతుగా విడుదల చేయాలని, కూలగొట్టిన గుడిసెలను పునరుద్ధరించాలని ఈ లేఖలో డిమాండ్ చేశారు.

పోలీసులపై చర్యలు తీసుకోవాలి : కెవిపిఎస్

ప్రభుత్వ స్థలంలోని పేదల గుడిసెలను కూల్చివేయడం, కులం పేరుతో దూషించడంపై సమగ్ర విచారణ జరిపించి పోలీసులపై చర్యలు తీసుకోవాలని కుల వివక్ష వ్యతిరేక పోరాట సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అండ్ర మాల్యాద్రి రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

చంద్రబాబు బెయిల్‌పై షరతులు విధించాలి

- సిఐడి పిటిషన్‌పై 3న హైకోర్టు తీర్పు

ప్రజాశక్తి-అమరావతి

స్కిల్ కేసులో నిందితుడైన టిడిపి అధినేత నారా చంద్రబాబు నాయుడు కంటికి ఆపరేషన్ పేరుతో మధ్యంతర బెయిల్‌పై విడుదలయ్యాక బెయిల్ షరతులను ఉల్లంఘించారంటూ హైకోర్టులో సిఐడి దాఖలు చేసిన అనుబంధ పిటిషన్‌పై బుధవారం వాదనలు ముగిశాయి. చంద్రబాబుకు పలు షరతులు విధించాలన్న పిటిషన్‌పై ఈ నెల 3న తుది ఉత్తర్వులు జారీ చేస్తామని న్యాయమూర్తి జస్టిస్ తల్లాప్రగడ మల్లికార్జునరావు ప్రకటించారు. రాజమండ్రి జైలు నుంచి చంద్రబాబు విడుదలైన వెంటనే బెయిల్ షరతులను ఉల్లంఘించారని అదనపు ఎజి పొన్నవోలు సుధాకర్‌రెడ్డి వాదించారు. ఆనారోగ్యంతో బెయిల్‌పై బయటకు వచ్చిన వెంటనే రాజకీయ ర్యాలీ నిర్వహించారని చెప్పారు. మీడియాతో కూడా మాట్లాడారని, కోర్టు ఆదేశాల్ని ఉల్లంఘించారని చెప్పారు. చంద్రబాబు వెంట ఇద్దరు డిఎస్‌పిలు ఉండేలా ఉత్తర్వులు ఇవ్వాలని కోరారు. ప్రభుత్వానికి నిఘా విభాగం ఉండగా, ఇద్దరు పోలీసు అధికారులను చంద్రబాబు వెంట ఉంచాల్సిన అవసరం ఉందా? అని హైకోర్టు ప్రశ్నించింది. నిఘా వేరు, నేరుగా అధికారులు ఉండే సమర్పించే నివేదిక వేరని అదనపు ఎజి జవాబు చెప్పారు. చంద్రబాబు తరపున సీనియర్ న్యాయవాది దమ్మాలపాటి శ్రీనివాస్ ప్రతివాదన చేస్తూ.. సిఐడి విధించాలని కోరుతున్న షరతులు వ్యక్తి స్వేచ్ఛను హరించేలా ఉన్నాయన్నారు. చంద్రబాబు ప్రాథమిక హక్కులకు భంగం కలిగిస్తాయని తెలిపారు. ముద్దాయిలకు కూడా హక్కులు ఉంటాయని, ఇక్కడ చంద్రబాబు నిందితుడు మాత్రమేనని చెప్పారు. కేసు వివరాలను మీడియాకు చెప్పరాదనే షరతు ఉందన్నారు. జైలు నుంచి వచ్చాక ర్యాలీలో పాల్గొనలేదని అన్నారు. మద్దతుదారులే సంఘీభావం తెలిపారన్నారు. వాదనల తర్వాత హైకోర్టు తీర్పును ఈ నెల 3న వెలువరిస్తామని ప్రకటించింది.

విద్యా వ్యవస్థలో మార్పునకు కృషి

- పాఠశాల విద్యాశాఖ కమిషనరు సురేష్‌కుమార్

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

విద్యా వ్యవస్థలో మార్పు తీసుకురావడానికి ప్రతి ఒక్కరూ చేయిచేయి కలపాలని, అప్పుడే మరింత అభివృద్ధి సాధ్యమవుతుందని పాఠశాల విద్యాశాఖ కమిషనరు ఎస్ సురేష్ కుమార్ అన్నారు. నెదర్లాండ్స్‌లో జరిగిన గ్లోబల్ సోషల్ అండ్ ఫైనాన్షియల్ స్కిల్స్-2023 కాన్ఫరెన్స్‌కు భారతదేశ ప్రతినిధిగా ఆయన హాజరై బుధవారం ప్రసంగించారు. విద్యారంగంలో విశేషమైన సంస్కరణలకు కేంద్రంగా ఆంధ్రప్రదేశ్ నిలిచిందన్నారు. పిల్లలను ప్రపంచ స్థాయి విద్యార్థులుగా చేయడానికి ప్రభుత్వ పాఠశాలల్లో వివిధ కార్యక్రమాలను విద్యాశాఖ, సమగ్ర శిక్ష చేపట్టిందని వివరించారు.

ఉన్నత స్థాయికి కెజిబివి బాలికలు : సమగ్ర శిక్ష ఎస్‌పిడి

కెజిబివిల్లో చదువుతున్న బాలికలను అన్ని రంగాల్లో ప్రోత్సహిస్తూ.. ఉన్నత స్థాయికి తీసుకెళ్లే బాధ్యత అందరిపై ఉందని సమగ్ర శిక్ష ఎస్‌పిడి బి శ్రీనివాసరావు అన్నారు. కెజిబివిల్లో కొత్తగా నియామకం పొందిన సిఆర్‌టి, పిజిటి, పిఇటిల శిక్షణ కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు.

విద్యార్థులను సొంత పిల్లలుగా భావించి చదువుతోపాటు ఆటలు, సైన్స్ ప్రయోగాలు వంటి వాటిల్లో ప్రావీణ్యం పొందేలా తర్ఫీదునిస్తూ నైతిక విలువలు, నైపుణ్యాభివృద్ధికి కృషి చేయాలని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఎఎస్‌పిడి కెవి శ్రీనివాసులు రెడ్డి, కెజిబివి కార్యదర్శి మధుసూదనరావు తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రంలో 103 కరువు మండలాలు ప్రకటించిన ప్రభుత్వం

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

ఖరీఫ్‌లో ఏడు జిల్లాల్లో 103 మండలాల్లో కరువు పరిస్థితులు నెలకొన్నాయని సిసిఎల్ఏ సాయిప్రసాదు మంగళవారం అర్ధరాత్రి ఉత్తర్వులు జారీచేశారు. వీటిల్లో 101 మండలాలు రాయలసీమ జిల్లాల పరిధిలోనే ఉండగా ఎన్‌టిఆర్ జిల్లాలో రెండు మండలాలు ఉన్నాయి. ప్రకటించిన వాటిల్లో తీవ్రమైన కరువు మండలాలు కర్నూలులో 22, నంద్యాలలో ఐదు, అనంతపురంలో 28, శ్రీసత్యసాయిలో ఏడు, అన్నమయ్యలో 16, చిత్తూరులో రెండు ఉన్నాయి. మధ్యస్తంగా ఉన్న జిల్లాల్లో ఎన్‌టిఆర్, కర్నూలు, అన్నమయ్య, చిత్తూరులో రెండేసి మండలాల చొప్పున ఉన్నాయి. నంద్యాలలో ఒకటి, శ్రీసత్యసాయిలో 14 మండలాలను పేర్కొన్నారు.

మీడియాతో మాట్లాడకూడదని ఎక్కడుంది?

- పిటిషనరును ప్రశ్నించిన హైకోర్టు

ప్రజాశక్తి-అమరావతి

స్కిల్ డెవలప్‌మెంట్ కేసు విషయాలను అదనపు అడ్వకేట్ జనరల్ పొన్నవోలు సుధాకర్‌రెడ్డి మీడియా సమావేశంలో చెబితే తప్పేమిటని పిటిషనర్లను హైకోర్టు ప్రశ్నించింది. అదనపు ఎజి మీడియా సమావేశం నిర్వహించకూడదని చట్టంలో ఎక్కడైనా ఉందా? అని ప్రశ్నించింది. దీనిపై స్పందించిన పిటిషనరు తరపున న్యాయవాది జగన్ కోసమే పనిచేస్తున్నట్లుగా అదనపు ఎజి చెప్పారన్నారు. అయితే, మీడియా సమావేశంలో అదనపు ఎజి చెప్పిన విషయాలను ఇంగ్లీషులో తర్జుమా చేసి అందజేయాలని పిటిషనరును హైకోర్టు ఆదేశించింది. విచారణను ఈ నెల 8కి వాయిదా వేస్తూ చీఫ్ జస్టిస్ ధీరజ్ సింగ్ ఠాకూర్, జస్టిస్ రావు రఘునందన్‌రావుతో కూడిన డివిజన్ బెంచ్ బుధవారం ఉత్తర్వులు జారీ చేసింది.

హైదరాబాద్‌లో చంద్రబాబుకు ఘనస్వాగతం

- పరీక్షించిన ఎఐజి బృందం

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

స్కిల్ డెవలప్‌మెంట్ కేసులో అరెస్టయి బెయిల్‌పై విడుదలైన తర్వాత తొలిసారిగా హైదరాబాద్ వచ్చిన టిడిపి అధినేత చంద్రబాబుకు హైదరాబాద్‌లో ఘన స్వాగతం లభించింది. గన్నవరం విమానాశ్రయం నుంచి ప్రత్యేక విమానంలో కుటుంబ సభ్యులతో కలిసి బయల్దేరిన ఆయన సాయంత్రం ఐదు గంటల సమయంలో బేగంపేట విమానాశ్రయానికి చేరుకున్నారు. అక్కడ తెలంగాణ టిడిపి నాయకులు, పలువురు కుటుంబ సభ్యులు స్వాగతం పలికారు. చంద్రబాబును చూసేందుకు వందల సంఖ్యలో ఆయన అభిమానులు విమానాశ్రయానికి తరలివచ్చారు. చంద్రబాబు ప్రయాణిస్తున్న కారుపై దారి పొడవునా పూల వర్షం కురిపిస్తూ.."మీ వల్లే మాకు ఉద్యోగాలు" ప్లకార్డులు ప్రదర్శిస్తూ కార్లు, మోటర్‌సైకిళ్లతో భారీ ర్యాలీతో చంద్రబాబు కాన్వాయ్‌ను అనుకరించారు. బేగంపేట నుంచి జూబ్లిహిల్స్ వరకూ సుమారు మూడుగంటల సమయం పట్టింది. టిడిపి శ్రేణుల ర్యాలీతో బేగంపేట - పంజాగుట్ట రహదారిలో ట్రాఫిక్‌కు తీవ్ర అంతరాయం కలిగింది. గచ్చిబౌలి ఎఐజి డాక్టర్ల బృందం బుధవారం రాత్రి చంద్రబాబు నివాసానికి వెళ్లి ఆయన్ను కలిసింది. చంద్రబాబు ఆరోగ్య పరిస్థితి, సమస్యలు అడిగి తెలుసుకున్నారు. వైద్యుల సూచన మేరకు గురువారం ఉదయం పది గంటలకు ఎఐజి ఆస్పత్రికి చంద్రబాబు వెళ్లనున్నారు. మరో రెండు రోజుల్లో ఎల్‌వి ప్రసాద్ ఆస్పత్రిలో చంద్రబాబు కంటి పరీక్షలు చేయించుకోనున్నారు.

ఢిల్లీలో లోకేష్

టిడిపి ప్రధాన కార్యాదర్శి నారా లోకేష్ బుధవారం ఢిల్లీ వెళ్లారు. చంద్రబాబు కోర్టు కేసులకు సంబంధించి అక్కడ న్యాయ నిపుణులు, న్యాయవాదులతో చర్చించనున్నారు. స్కిల్ డెవలప్‌మెంటు కేసు, ఇతర కేసుల గురించి సీనియర్ న్యాయవాదులతో చర్చించనున్నారు.

కరువుకూ కోతలు!

(మొదటి పేజీ తరువాయి)

అదే పరిస్థితి. పల్నాడులో మొత్తం మండలాలు ప్రకటించాలని జిల్లా యంత్రాంగం నివేదించగా ఒక్కటి కూడా గుర్తించలేదు. శ్రీకాకుళం, విజయనగరం, విశాఖ, అనకాపల్లి, తూర్పుగోదావరి, పశ్చిమగోదావరి, ఏలూరు, ఎన్‌టిఆర్ జిల్లాల్లోని పలు మెట్ట మండలాల్లో తీవ్ర కరువుంది. కాగా సర్కారు గుర్తించిన వాటిలో అనంతపురం, కర్నూలు మాత్రమే కాస్తంత వాస్తవాలకు దగ్గరగా ఉన్నాయి. శ్రీసత్యసాయి జిల్లా మొత్తం తీవ్ర కరువుండగా 32 మండలాలకుగాను 21 మండలాలను గుర్తించగా, వాటిలో 14 మధ్యస్త స్థాయిగా పేర్కొన్నారు. నంద్యాలలో తక్కువ మండలాలు ప్రకటించారని విమర్శలొస్తున్నాయి.

కరువు మండలాలపై పున:పరిశీలన చేయాలి
రైతు, కౌలురైతు, వ్యవసాయ కార్మిక సంఘాలు

రాష్ట్ర వ్యాప్తంగా కరువు మండలాల ప్రకటనపై ప్రభుత్వం పున:పరిశీలన చేయాలని ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం డిమాండ్ చేసింది. ఈ మేరకు సంఘం రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు వి కృష్ణయ్య, కె ప్రభాకరరెడ్డి బుధవారం ప్రకటన విడుదల చేశారు. ప్రస్తుతం విస్మరించిన అన్ని మండలాలనూ కరువు మండలాలుగా ప్రకటించి తక్షణమే కరువు సహాయక చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. అలాగే కౌలు రైతు సంఘం రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు రాధాకృష్ణ, ఎం హరిబాబు, వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు డి సుబ్బారావు, వి వెంకటేశ్వర్లు వేర్వేరు ప్రకటనలు విడుదల చేశారు. కరువు మండలాల ప్రకటనపై పున:పరిశీలన చేయాలని కోరారు.

ఘనంగా రాష్ట్రావతరణ వేడుకలు

(మొదటి పేజీ తరువాయి)

జరుపుకోవాలా అనే అంశాన్ని తేల్చుకోలేక టిడిపి ప్రభుత్వం రాష్ట్రావతరణ దినోత్సవ వేడుకలను జరపకుండా జూన్ 2న నవనిర్మాణ దీక్షలు చేపట్టేది. 2019 తర్వాత రాష్ట్రంలో వైసిపి ప్రభుత్వం ఏర్పాటయ్యాక అధికారికంగా నవంబరు 1వ తేదీనే రాష్ట్రావతరణ దినోత్సవ వేడుకలు జరపాలని నిర్ణయించింది. ఈ మేరకు ఈ ఏడాది కూడా రాష్ట్ర వ్యాప్తంగా రాష్ట్రావతరణ దినోత్సవ వేడుకలు జరిగాయి. రాష్ట్రావతరణ కోసం ప్రాణత్యాగం చేసిన పొట్టి శ్రీరాములు విగ్రహానికి క్యాంపు కార్యాలయంలో పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం పోలీసుల గౌరవవందనాన్ని ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి స్వీకరించారు. భాషా, సాంస్కృతికశాఖ సంచాలకులు ఆర్ మల్లికార్జునరావు రచించిన స్వాతంత్ర్య ఉద్యమంలో ఆంధ్రులు అన్న పుస్తకాన్ని సిఎం జగన్ ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో మంత్రులు ఆర్‌కె రోజా, ఉషశ్రీ చరణ్, రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కెఎస్ జవహర్‌రెడ్డి, డిజిపి కెవి రాజేంద్రనాథ్‌రెడ్డి, సాంస్కృతిక పర్యాటకశాఖ స్పెషల్ సిఎస్ రజత్ భార్గవ తదితరులు పాల్గొన్నారు. అలాగే ఆంధ్రప్రదేశ్ రాష్ట్రావతరణ దినోత్సవం నేపథ్యంలో గవర్నర్ జస్టిస్ అబ్దుల్ నజీర్ రాష్ట్ర ప్రజలనుద్దేశించి మీడియా మాధ్యమాల ద్వారా మాట్లాడారు.

వైఎస్ఆర్ అవార్డులు ప్రదానం

(మొదటి పేజీ తరువాయి)

అబ్దుల్ నజీర్ మాట్లాడుతూ.. రాష్ట్రంలో సంక్షేమ పథకాలు ప్రజలకు అందుతున్నాయని తెలిపారు. నవరత్నాలు ప్రజలకు ఉపయోగపడుతున్నాయని పేర్కొన్నారు. ప్రతియేటా ప్రతిభావంతులను గుర్తించి అవార్డులు ఇచ్చి ప్రోత్సహించడం మంచి కార్యక్రమమని తెలిపారు. సిఎం జగన్‌మోహన్‌రెడ్డి మాట్లాడుతూ.. రాష్ట్రాన్ని వివిధ రంగాల్లో సుసంపన్నం చేసిన వారిని మూడేళ్లుగా గౌరవిస్తున్నామని చెప్పారు. ఆకాశమంత ఎదిగినా సామాన్యులుగానే ఒదిగి ఉన్నవారికి ఇస్తున్న అవార్డులని పేర్కొన్నారు. తెలుగు తనానికి, తెలుగుమాటకు, తెలుగువాడి గుండెకు, ధైర్యానికి, రైతుల మమకారానికి, సంస్కృతికి, సంప్రదాయాలకు వైఎస్ రాజశేఖర్‌రెడ్డి నిలువెత్తు నిదర్శనమని అన్నారు. ఆయన పేరుతో ఈ అవార్డులు ఇవ్వడం గర్వంగా ఉందని పేర్కొన్నారు. గతంలో వైఎస్ రాజశేఖర్‌రెడ్డి హయాంలో వ్యవసాయం, విద్య, వైద్యం, గృహ నిర్మాణం ఇలా ఏ రంగాన్ని తీసుకున్నా అంతకు ముందున్న పరిస్థితులను మార్చేలా రాష్ట్రాన్ని ముందుకు తీసుకెళ్లారని అన్నారు. ఆయా రంగాల్లోనే సేవలు చేస్తున్న వారిని అవార్డుకు ఎంపిక చేస్తున్నామని పేర్కొన్నారు. అవార్డులు అందుకున్న వారందరూ ఆయా రంగాల్లో వారి జీవితాన్ని అర్పించిన వారని, వారి వారసత్వాన్ని భుజాన వేసుకుని మోశారని పేర్కొన్నారు. వారంతా జాతి సంపదని, వారికి సమాజం ఇచ్చిన గుర్తింపుగా ఈ అవార్డులను చూడాలని తెలిపారు. ఈ ఏడాది 27 మందికి ఈ అవార్డులు ఇస్తున్నామని చెప్పారు. ఈ కార్యక్రమానికి సమాచారశాఖ కమిషనర్ తుమ్మా విజయకుమార్‌రెడ్డి అధ్యక్షత వహించారు. కమ్యూనికేషన్స్ సలహాదారులు జివిడి కృష్ణమోహన్ అవార్డుల ప్రాధాన్యత వివరించారు. మొత్తం 27 మందిలో 23 మందికి లైఫ్‌టైం అచీవ్‌మెంటు అవార్డులు, నలుగురికి అచీవ్‌మెంటు అవార్డులు అందజేశారు. క్రీడల విభాగంలో కరణం మల్లేశ్వరి, పుల్లెల గోపీచంద్, కళలు, సంస్కృతి విభాగంలో తల్లావజ్ఝుల శివాజి, రావు బాలసరస్వతి, చిగిచర్ల కృష్ణారెడ్డి, కలీషాబీ, సుభానీ తదితరులు అవార్డులు అందుకున్న వారిలో వున్నారు.

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ విధానాలతో విద్యా వ్యవస్థ నాశనం

- నాడు -నేడు, బైజూస్ పేరిట కుంభకోణాలు
- విశాఖలో ఐటి పరిశ్రమల ఏర్పాటులో వైసిపి, టిడిపి విఫలం
- ప్రజా రక్షణ భేరీలో సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు

ప్రజాశక్తి - యంత్రాంగం

గజపతినగరం సభలో మాట్లాడుతున్న సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తోన్న విధానాల వల్ల విద్యా వ్యవస్థ నాశనమవుతోందని సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు అన్నారు. రాష్ట్రంలో 40 వేల ఉపాధ్యాయ, 4 వేల లెక్చరర్ పోస్టులు ఖాళీగా ఉన్నా భర్తీ చేయడం లేదని తెలిపారు. రాజకీయ ప్రయోజనాలకు అనుగుణంగా వైస్ ఛాన్సలర్‌లను నియమించడం వల్ల విద్యా వ్యవస్థ, విద్యార్థుల భవిష్యత్తు నాశనమవుతోందని అన్నారు. ప్రజా రక్షణ భేరి యాత్ర మూడో రోజు బుధవారం విజయనగరం జిల్లా గజపతినగరం, బొండపల్లి, బుడతనాపల్లి, తామరాపల్లి, ఎస్.కోట మండలం బొడ్డవర బొడ్డవరం జంక్షన్ మీదుగా అల్లూరి సీతారామరాజు జిల్లా అనంతగిరికి చేరుకుంది. బుడతనాపల్లిలో వర్షాభావంతో ఎండిపోయిన వరి పొలాలను, బొడ్డవర వద్ద 17 ఏళ్ల క్రితం జిందాల్ అల్యూమినియం కంపెనీకి కేటాయించి, ప్రస్తుతం నిరూపయోగంగా ఉన్న భూములను శ్రీనివాసరావు పరిశీలించారు.

ఈ సందర్భంగా ఆయా చోట్ల ఏర్పాటు చేసిన సభల్లో ఆయన మాట్లాడారు. నాడు - నేడు, బైజూస్ కార్యక్రమాలు వెనుక కుంభకోణాలు ఉన్నాయని విమర్శించారు. విచారణ చేపడితే ప్రభుత్వ బండారం బయట పడుతుందన్నారు. ఇప్పటికీ చాలా గ్రామాల్లో పాఠశాలలకు భవనాలు లేవని, ఉన్న అరకొర భవనాలు శిథిలావస్థలో ఉన్నాయని తెలిపారు. విజయనగరం జిల్లాలో గిరిజన యూనివర్సిటీ మంజూరు చేసినప్పటికీ భవనాలు నిర్మించలేదని, అధ్యాపకులనూ నియమించలేదని చెప్పారు. కెజీ నుంచి పిజి వరకు ఉచితంగా నాణ్యమైన విద్య అందించాలని డిమాండ్ చేశారు. దోపిడీ శక్తులకు పాలకులే కొమ్ముకాయడంతో రాష్ట్రంలోని ఐటి ఉద్యోగులు కూడా శ్రమదోపిడీకి గురవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. హైదరాబాద్‌ను హైటెక్ సిటీగా తయారు చేశానని చెప్పుకుంటున్న మాజీ సిఎం చంద్రబాబుగానీ, ఐటి రాగాలు పలుకుతున్న సిఎం జగన్‌గానీ విశాఖలో ఐటి రంగాన్ని ఎందుకు అభివద్ధి చేయలేదో చెప్పాలని డిమాండ్ చేశారు. మరోవైపు రాష్ట్రానికి వెన్నుపోటు పొడిచిన బిజెపికి వైసిపి, టిడిపి, జనసేన పార్టీలు వంతపాడుతున్నాయని విమర్శించారు. విశాఖ మినహా ఉత్తరాంధ్రలో ఒక్క పరిశ్రమ కూడా ఏర్పాటు చేయలేదని తెలిపారు. ఈజ్ ఆఫ్ డూయింగ్ పేరిట భూములు, నీరు, కరెంట్ ఉచితంగా కట్టపెట్టారని విమర్శించారు. సుజల స్రవంతి పేరిట సారవంతమైన వ్యవసాయ భూములు గుంజుకున్నప్పటికీ పోలవరం పూర్తి కాకపోవడం వల్ల నీరు అందడం లేదన్నారు. రాష్ట్రంలో జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం మద్యం ధరలు పెంచడంతోపాటు, ప్రజల ఆరోగ్యంతో చలగాటమాడుతోందని విమర్శించారు.

'హైడ్రో' ఒప్పందంలో మోడీ, జగన్ వాటా ఎంత ?

అనంతగిరి మండలంలోని పెదకోటలో హైడ్రో పవర్ ప్రాజెక్ట్ పేరిట వేలాది ఎకరాల అటవీ భూమిని అదానీకి అప్పగించడాన్ని సిపిఎం తీవ్రంగా వ్యతిరేకిస్తోందని వి.శ్రీనివాసరావు తెలిపారు. అదానీతో మోడీ, జగన్‌లు చేసుకున్న చీకటి ఒప్పందాన్ని బహిర్గతం చేయాలని డిమాండ్ చేశారు. ఆదివాసీ ప్రాంతాల్లో ఐదో షెడ్యూల్ ప్రకారం గిరిజనుల సాగు భూమిని ఇతరులకు కేటాయించడం రాజ్యాంగ విరుద్ధమని తెలిపారు. ఇక్కడి ఆదివాసీల భూములను కార్పొరేట్ కంపెనీలకు అమ్ముతుంటే స్థానిక ప్రజాప్రతినిధులు తమ రాజకీయ అవసరాల కోసం, వచ్చే ఎన్నికల్లో సీట్ల కోసం ఏజెన్సీ ప్రాంతాన్ని తాకట్టు పెట్టడం దారుణమన్నారు. హైడ్రో పవర్ ప్రాజెక్టు ఒప్పందం రద్దయ్యే వరకూ ఆదివాసీల పోరాటానికి సిపిఎం అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. టోకూరు పంచాయతీ చిట్టెంపాడు, గుమ్మకోట పంచాయతీ గుజ్జెలి వద్ద హైడ్రో ప్రాజెక్టు సిపిఎం పోరాట ఫలితంగా తాత్కాలికంగా ఆగిందని తెలిపారు. మోడీ ప్రభుత్వం అటవీ సంరక్షణ చట్ట సవరణ చేపట్టిందని, దీనికి పార్లమెంట్‌లో వైసిపి, టిడిపి ఎందుకు మద్దతునిచ్చాయో చెప్పాలని ప్రశ్నించారు. అటవీ చట్టాలను నిర్వీర్యపరచడం దారుణమన్నారు. నేటికీ ఆదివాసీలకు కనీస మౌలిక సదుపాయాలు కరువయ్యాయన్నారు.

సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు వై.వెంకటేశ్వరరావు మాట్లాడుతూ ప్రభుత్వరంగ సంస్థల ప్రయివేటీకరణ వల్ల ఉన్న ఉద్యోగాలు పోతున్నాయని, నిరుద్యోగుల భవిష్యత్తు అంధకారంగా మారుతోందని అన్నారు. పార్టీ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు కిల్లో సురేంద్ర మాట్లాడుతూ.. బొడ్డవరలో బాక్సైట్ శుద్ధి కర్మాగారం పేరిట వందలాది మంది గిరిజనుల నుంచి 2006లో అప్పటి ప్రభుత్వం బలవంతంగా భూములు లాగేసుకుందని గుర్తుచేశారు. ఆ ఫ్యాక్టరీ నిర్మాణం చేపట్టనందున ఆ భూములను తిరిగి రైతులకు అప్పగించాలని డిమాండ్ చేశారు. పార్టీ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు కె.సుబ్బరావమ్మ మాట్లాడుతూ ఉత్తరాంధ్ర ప్రజలు పనుల్లేక ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. నిత్యావసర సరుకుల ధరలు విపరీతంగా పెంచడంతో ప్రజలు కడుపునిండా తినలేని పరిస్థితి ఏర్పడుతోందన్నారు. అందువల్లే ఎక్కువ మంది మహిళలు రక్తహీనతతో బాధపడుతున్నారని తెలిపారు. కార్యక్రమంలో సిపిఎం రాష్ట్ర కమిటీ సభ్యులు ఎ.అశోక్, రైతు సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు మర్రాపు సూర్యనారాయణ పాల్గొన్నారు.

బిజెపికి చంద్రబాబు అభినందనలా?

అవినీతి, అక్రమాలు అంటగట్టి వైసిపి ప్రభుత్వంతో అరెస్టు చేయించి, జైలుకు పంపిన బిజెపికి టిడిపి అధినేత చంద్రబాబు ధన్యవాదాలు తెలపడం విడ్డూరంగా ఉందని సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు అన్నారు. వైసిపికి కూడా ధన్యవాదాలు తెలియజేస్తే బాగుండేదని ఎద్దేవా చేశారు. జైలు నుంచి బెయిల్‌పై బయటకువచ్చిన చంద్రబాబు బిజెపికి ధన్యవాదాలు తెలియజేయడంపై విజయనగరం జిల్లా పర్యటనలో ఉన్న శ్రీనివాసరావు స్పందించారు. మోడీ, జగన్ కలిసే చంద్రబాబును అరెస్ట్ చేయించారని తెలిపారు. మోడీకి భయపడి బిజెపి వద్ద మోకరిల్లుతున్నారని విమర్శించారు. న్యాయం కోసం పోరాడుతున్నామంటున్న చంద్రబాబు ప్రజా పోరాటాల సందర్భంగా వామపక్ష నాయకుల అరెస్టులను ఎందుకు ప్రశ్నించలేదన్నారు.

డెడ్ ఇంజనే చంపేసిందా?

- రైల్వేలో లోపించిన పారదర్శకత
- రాయగడ ఎక్స్‌ప్రెస్‌కు వెనక గూడ్స్ ఇంజన్ దేనికి?
- వాకీటాకీలు మొరాయించినా ఎందుకు పట్టలేదు?
- రైలు ప్రమాదంపై సమాధానం దొరకని ప్రశ్నలు ఎన్నో!

ప్రజాశక్తి - గ్రేటర్ విశాఖ బ్యూరో

ఇద్దరు పైలెట్లు, ఒక గార్డు సహా 14 మంది ప్రయాణికుల మృత్యువాత వెనక గూడ్స్‌కు వాడాల్సిన అదే పనిచేయని 'డెడ్ ఇంజన్' కారణమా? అంటే... అవుననే సమాధానమే వస్తోంది. గత నెల 29న విజయనగరం జిల్లా అలమండ వద్ద జరిగిన రైలు ప్రమాదానికి... రాయగడ పాసింజర్‌కు వెనక పాత గూడ్స్ ఇంజన్ అమర్చడమే కారణమని తేలినట్టు సమాచారం. పాత గూడ్స్ ఇంజన్ విశాఖ నుంచి రాయగడ వెళ్లే రైలుకు వెనుక ఉండడాన్ని పలువురు స్థానికులు గుర్తించారు. దాన్ని రాయగడ రైలుకు అవసరం లేకపోయినా ఎందుకు అమర్చారన్న విషయం ఇప్పుడు చర్చనీయాంశమవుతోంది. ఇది పాతది, అత్యంత బరువైనది కావడంతో పలాస పాసింజర్‌ను బలంగా వెనక నుంచి ఢీకొట్టడంతో బోగీలపై భారీ ఒత్తిడి పెరిగి 14 మంది ప్రయాణికుల మృతికి కారణమైందనే వాదన వినిపిస్తోంది. 'పనిచేయని ఇంజన్‌ను, గూడ్స్‌కు వాడాల్సిన దాన్ని దీనికి తగిలించడం తీవ్ర నేరం' అని రైల్వే ఉద్యోగుల్లోనూ చర్చ నడుస్తోంది. అధికారులు ఆ రోజు పొద్దున్నుంచీ డిస్కెట్ సిగ్నల్ అని తెలిసినా ఎటువంటి మరమ్మతులూ చేపట్టకపోవడంపై విస్మయం వ్యక్తం చేస్తున్నారు. ప్రమాదం జరిగాక ఎలా సరిచేశారు? ఈ పని ముందే చేసివుంటే 14 మంది ప్రాణాలు నిలబడేవి కదా? అంటూ రైల్వే ఉద్యోగులు చర్చించుకుంటున్నారు. పైగా, కంటకాపల్లి నుంచి మరో ఐదు నిమిషాల్లో అలమండకు వెళ్లే క్రమంలో చిన్న డౌన్ ఉండటంతో రాయగడ వేగంగా వచ్చి గుద్దడంతో బోగీలో జనం చనిపోయారని స్పష్టమవుతోంది. కంటకాపల్లి-అలమండ మధ్య రైలు ప్రమాదం జరిగిన కొద్ది గంటల వ్యవధిలోనే సిగ్నలింగ్ సిస్టంను రైల్వే అధికారులు సరిచేశారు. అంతకు ముందు డ్యూటీకి వెళ్లిన వారంతా సిగ్నలింగ్ వ్యవస్థ దెబ్బతిన్న విషయాన్ని సంబంధిత ఉన్నతాధికారులకు చెప్పినా పట్టించుకోలేదని, వ్యవహరించారనే విమర్శలు వెల్లువెత్తున్నాయి. లోకో పైలెట్లు, అసిస్టెంట్ లోకో పైలెట్ల వద్దగల వాకీటాకీలు సైతం ప్రమాద రోజు మొరాయించాయి. ఆ రోజు డ్యూటీలో ఉన్న అసిస్టెంట్ లోకో పైలెట్లు, లోకో పైలెట్లు ఎలాంటి రాతపూర్వక జాగ్రత్తలూ రైల్వే నుంచి లేవని కొంతమంది ఉన్నతోద్యోగులే చెబుతున్నారు. ఆ రోజు ఉదయం నుంచి సుమారు పది రైళ్ల వరకూ ఆ ట్రాక్‌పై వెళ్లినా వాకీటాకీలే పనిచేయలేదు. ఆ విషయాన్ని రైలు రెగ్యులర్ బుక్‌లో రాసినా అసిస్టెంట్ లోకో పైలెట్లు, లోకో పైలెట్లు మాత్రం చెప్పలేదు.

తప్పుడు నివేదికలు సిద్ధమవుతున్నాయా?

ఈ దుర్ఘటనపై బుధవారం వాల్తేరు రైల్వే డిఆర్‌ఎం కార్యాలయంలో విచారణ సాగింది. సిగ్నలింగ్ సిస్టం, ట్రాక్ బ్రిడ్జ్ ఇతరత్రా సిబ్బంది పాల్గొన్నారు. రైల్వే ఉన్నతాధికారులు ఈ సందర్భంగా ప్రమాదానికి కారణం 'పైలెట్ ఎలాగూ చనిపోయారు కదా! మానవ తప్పిదంగా నివేదిక సిద్ధం చేయాలని హుకుం జారీ చేసినట్టు తెలిసింది. పొద్దున్నుంచీ సిగ్నల్ సిస్టంపై సమాచారం ఉన్నా స్పందించలేదు. రాయగడ లోకో పైలెట్ పడుకుని ఉండొచ్చని కూడా అధికారులు నెపం నెట్టే అవకాశం ఉందని ప్రచారం జరుగుతోంది. విశాఖ నుంచి రైలు బయల్దేరిన రెండు గంటల్లోనే నిద్రలోకి వెళ్లిపోతారా ఎక్కడైనా? లేదా ఓవర్ టైం ఏమైనా ఒత్తిడా? రైల్వే అధికారులు దేన్ని నివేదించనున్నారన్నది ప్రశ్నార్థకంగా మారింది. ఆటో సిగ్నలింగ్ ఈ మధ్యనే ఈ రూట్‌లో పెట్టినందున అనుభవం ఉన్న లోకో పైలెట్లతో పంపాల్సి ఉండగా, రాయగడ లోకో పైలెట్‌కి ఎలాంటి లెర్నింగ్ ట్రిప్ ఇచ్చిన దాఖలాలు లేవని పైలెట్ వర్గాల్లో చర్చ నడుస్తోంది. ఒకవేళ సిగ్నల్ పనిచేయడం లేదు కాబట్టి రాయగడ లోకో పైలెట్ అలమండకు సమీపంలో వచ్చినప్పుడు రెడ్ సిగ్నల్ ఉంది అనుకుందాం... ఎలాగూ సిగ్నల్ల సిస్టం పనిచేయడం లేదు కాబట్టి ముందుకెళ్లిపోయాడా? అన్న ప్రశ్న కూడా ఉద్భవిస్తోంది.

రైలంతా ఊగిపోయింది

- అలమండకు చెందిన ప్రత్యక్ష సాక్షి లక్ష్మి

లక్ష్మి

ప్రజాశక్తి - గ్రేటర్ విశాఖ బ్యూరో

'మరణం ఆ క్షణం కళ్లముందే కనిపించింది. అక్కడికక్కడే కుప్ప కూలిపోయాను. నెమ్మదిగా తెలివొచ్చి లేచి చూసేసరికి రైలు బోగీల నుంచి శవాలు బయటకు తీస్తున్నారు. మరోవైపు తోటి ప్యాసింజర్లంతా హాహాకారాలు చేస్తున్నారు. ఒక్కసారిగా నా గుండె ఆగిపోయినంత పనైంది. ఎప్పుడూ పోయిందని పైకి లేవాలనుకుంటున్నా కాని కాలు కదపడం లేదు. కన్నీళ్లను ఆపుకోలేకపోయాను. పక్కనే మా వదిన కూడా గాయపడి ఓ పక్కనపడిపోయింది' అంటూ అలమండకు చెందిన ప్రత్యక్ష సాక్షి సిరిపల్లి లక్ష్మి చెప్పుకొచ్చింది. ఆమె విశాఖలో వడ్లమాను సీపార్ట్ పనిచేస్తోంది. పలువురు ఇక్కడ పనిచేసి రోజూ అలమండకు వెళ్లిపోతారు. ఎప్పటిలాగే తన పని ముగించుకుని పలాస పాసింజర్ రైలు ఎక్కి అలమండకు వెళ్లేలోపే ఈ భారీ ప్రమాదం జరిగింది. ఆ వివరాలను ఆమె ఇలా చెప్పుకొచ్చింది. రైలు ఆఖరి బోగీలో ప్రయాణిస్తున్న మా పిన్ని కొడుకు పాలికా రవి (26) మృత్యువాతపడ్డాడు. నా భర్త ఎస్.ఎర్రినాయుడు బస్సులో అలమండకు రావడంతో ప్రమాదం బారిన పడలేదని లక్ష్మి చెప్పుకొచ్చింది.

దక్షిణమధ్య రైల్వే
మమ్మల్ని @SCRailwayindia ద్వారా అనుసరించవచ్చు, ద.మ రైల్వేలోని టెండరు ప్రకటనల వివరాలు మా వెబ్‌సైట్ www.scr.indianrailways.gov.in లో చూడవచ్చు.

తేది : 30.10.2023, ఇ-టెండర్ నోటీసు నం.417/డిఆర్‌ఎమ్/డబ్ల్యు/జిఎన్‌టి

PUB/1199

23.11.2023, 15.30 గం. వరకు దిగువసంతకందారుడు ద్వారా క్రింది విధమైన పనుల కొరకు ఇ టెండర్లను ఆహ్వానించడమైనది.

క్ర.సం.:01, టెండర్ ఐడి : 2616 ఎస్ఆర్ డిఇఎన్/డిఇఎన్ : నార్త్, **పని వివరణ :** 1 సంవత్సరం వ్యవధి కొరకు డిఇఎన్/నార్త్/సెక్షన్ లో ఆటో పిఐఎన్ సిస్టమ్ మరియు స్మార్ట్ రియల్ టైమ్ పొజీషన్ నిర్వహణ. **సుమారు విలువ:** రూ.30,49,932/-, **బిడ్ సెక్యూరిటీ :** రూ.61,000/-

క్ర.సం.2 : టెండర్ ఐడి : 2617 ఎస్ఆర్ డిఇఎన్/డిఇఎన్ : నార్త్, **పని వివరణ :** ఎస్‌డబ్ల్యు (1) : డిఇఎన్/నార్త్/జిఎన్‌టి క్రింద ఎడిఇఎన్/ఎన్ఎల్‌డిఎ అధికార పరిధిలో ఆర్‌యుబిల వద్ద డ్రైనేజి సిస్టమ్, పంపింగ్ మరియు డిసిల్టింగ్ మరమత్తులు. ఎస్‌డబ్ల్యు (2): 12 నెలల వ్యవధి కొరకు డిఇఎన్/నార్త్/జిఎన్‌టి క్రింద ఎడిఇఎన్/ఎన్ఎల్‌డిఎ అధికార పరిధిలో రైల్వే స్టాఫ్ క్వార్టర్స్, స్టేషన్లు, ఎల్‌సిలు, ట్రాక్ మిషన్లు మరియు గూడ్స్ షెడ్‌లకు తాగునీటి సరఫరా కొరకు ప్రతిపాదన. **సుమారు విలువ :** రూ.5973960/-, **బిడ్ సెక్యూరిటీ :** రూ.119500/-

క్ర.సం.: 3 టెండర్ ఐడి : 2618 ఎస్ఆర్ డిఇఎన్/డిఇఎన్ : నార్త్, పని వివరణ : ఎస్‌డబ్ల్యు (1) : డిఇఎన్/నార్త్/జిఎన్‌టి క్రింద ఎడిఇఎన్/నార్త్/జిఎన్‌టి అధికార పరిధిలో ఆర్‌యుబిల వద్ద డ్రైనేజి సిస్టమ్, పంపింగ్ మరియు డిసిల్టింగ్ మరమత్తులు. ఎస్‌డబ్ల్యు (2): 12 నెలల వ్యవధి కొరకు డిఇఎన్/నార్త్/జిఎన్‌టి సెక్షన్ క్రింద ఎడిఇఎన్/నార్త్/జిఎన్‌టి అధికార పరిధిలో రైల్వే స్టాఫ్ క్వార్టర్స్, స్టేషన్లు, ఎల్‌సిలు, ట్రాక్ మిషన్లు మరియు గూడ్స్ షెడ్‌లకు తాగునీటి సరఫరా కొరకు ప్రతిపాదన. **సుమారు విలువ :** రూ.5378254/-, **బిడ్ సెక్యూరిటీ :** రూ.107600/-.

క్ర.సం.: 4, టెండర్ ఐడి : 2619 ఎస్ఆర్ డిఇఎన్/డిఇఎన్ : నార్త్, పని వివరణ : జిఎన్‌టి-ఎన్‌డికెడి సెక్షన్ లో ఎల్‌సి నం.19 వద్ద మనుషుల లెవెల్ క్రాసింగ్‌కి బదులుగా సబ్‌వే (ఆర్‌యుబి) ఏర్పాటు. **సుమారు విలువ :** రూ.66470098/-, **బిడ్ సెక్యూరిటీ :** రూ.482400/-

1. ఇ బిడ్స్ ఆన్‌లైన్ సమర్పణ కొరకు చివరి తేది 23.11.2023, 15.00 గం. వరకు. వివరణాత్మక సమాచారం కొరకు వెబ్‌సైట్‌ని www.ireps.gov.in లాగిన్ అవ్వండి.
2. ఏదైనా తదుపరి కమ్యూనికేషన్/సవరణ కొరకు ఇ పోర్టల్ www.ireps.gov.in ద్వారా సమాచారం ఇవ్వబడుతుంది.

డివిజనల్ రైల్వే మేనేజర్ (వర్క్స్), గుంటూరు
A1653

తదుపరి టెండర్ నియమాలు/వివరాలు మరియు టెండర్ డాక్యుమెంట్ల డౌన్‌లోడ్ కోసం దయచేసి వెబ్‌సైట్ https:www.ireps.gov.in లేదా www.scr.indianrailways.gov.inని సందర్శించండి.

వైసిపికి వణుకు పుడుతోంది

- అచ్చెన్నాయుడు

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

మధ్యంతర బెయిల్‌పై విడుదలైన తమ పార్టీ అధినేత చంద్రబాబు నాయుడుకు మద్దతు తెలిపేందుకు వచ్చిన జనసందోహాన్ని చూసి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌తో సహా వైసిపి నేతలు వణికిపోతున్నారని టిడిపి రాష్ట్ర అధ్యక్షులు కె అచ్చెన్నాయుడు బుధవారం ఒక ప్రకటనలో విమర్శించారు. కోర్టు నిబంధనలు ఉన్నా మద్దతు తెలిపేందుకు వేలాది మంది జనం వచ్చారని, అందుకే రాజమండ్రి నుంచి విజయవాడ రావటానికి 16 గంటలు పట్టిందని వివరించారు. కోర్టు నిబంధనలు లేకుంటే అంతకు నాలుగు రెట్లు జనం వచ్చేవారని తెలిపారు. మరో ఐదు నెలలు తరువాత వైసిపి నేతల్ని ప్రజలు రాష్ట్రం నుంచి తరిమికొట్టడం ఖాయమని పేర్కొన్నారు.

- మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుపై కేసు పెట్టించడానికే తెలంగాణ కేడర్‌కు చెందిన ఐఆర్‌టిఎస్ అధికారి వాసుదేవరెడ్డిని బేవరేజస్ కార్పొరేషన్ ఎమ్‌డిగా తీసుకొచ్చారని పర్చూరు ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు విమర్శించారు. బుధవారం టిడిపి జాతీయ కార్యాలయంలో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు.
- ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మంత్రివర్గంలోని మంత్రులు, ఎమ్మెల్యేల్లో ఉన్న 'దోపిడి' కళను కూడా గుర్తించి అవార్డులివ్వాలని టిడిపి అధికార ప్రతినిధి మద్దిపట్ల సూర్యప్రకాష్ ఎద్దేవా చేశారు.
- రాష్ట్ర అవతరణ దినోత్సవ వేడుకలు టిడిపి కార్యాలయంలో బుధవారం జరిగాయి. ఆ పార్టీ వాణిజ్య విభాగం అధ్యక్షులు దుండి రాకేష్ అధ్యక్షతన ఈ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ఆ పార్టీ ఎమ్మెల్సీ పి అశోక్‌బాబు మాట్లాడుతూ.. రాష్ట్ర అవతరణ కోసం పొట్టి శ్రీరాములు ప్రాణాలు అర్పించారని, ఇటువంటి మహనీయుల చరిత్రను గుర్తుచేసుకోవడం గర్వకారణం అని అన్నారు. ఈ కార్యక్రమంలో ఆ పార్టీ ఎమ్మెల్యేలు అనగాని సత్యప్రసాద్, ఏలూరి సాంబశివరావు తదితరులు పాల్గొన్నారు. ముందుగా శ్రీరాములు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

రైలు ప్రమాదాలకు కేంద్ర నిర్లక్ష్యమే కారణం

- ఈ నెల రెండో వారంలో రైల్వే స్టేషన్ల వద్ద నిరసన
- సిఐటియు అఖిల భారత అధ్యక్షులు కె. హేమలత

మీడియా సమావేశంలో మాట్లాడుతున్న హేమలత

ప్రజాశక్తి - గ్రేటర్ విశాఖ బ్యూరో

రైల్వేపై కేంద్ర ప్రభుత్వం తీవ్ర నిర్లక్ష్యం వహిస్తోందని సిఐటియు అఖిల భారత అధ్యక్షులు కె.హేమలత అన్నారు. ప్రయివేటీకరణ విధానం కారణంగా దేశంలో ఎన్నడూలేని రీతిలో రైలు ప్రమాదాలు జరుగుతున్నాయని, రైల్వే భద్రతకు సరిగా నిధులు కేటాయించడం లేదని విమర్శించారు. బుధవారం ఉదయం విశాఖలోని ఎన్‌పిఆర్ భవన్‌లో సిఐటియు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సిహెచ్.నర్సింగరావు, విశాఖ జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్‌కెఎస్‌వి.కుమార్‌లతో కలిసి ఆమె మీడియా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా హేమలత మాట్లాడుతూ.. విజయనగరం జిల్లా కంటకాపల్లి వద్ద జరిగిన రైలు ప్రమాదంపై విచారం వ్యక్తం చేశారు. ఈ ప్రమాదంలో మరణించిన లోకో పైలట్, ఇతర సిబ్బందిపై నెపం నెట్టేసి తాను తప్పించుకోవాలని రైల్వే శాఖ చూస్తున్నట్టు తమ దృష్టికొచ్చిందన్నారు. రైల్వేల భద్రతకు నిధులను సరిగా కేంద్రం కేటాయించడం లేదన్న విషయాన్ని కాగ్ ప్రస్తావిస్తూ తప్పుబట్టిన విషయాన్ని ఆమె ఉటంకించారు. అంతర్జాతీయ స్థాయిలో రైల్వే స్టేషన్లను అభివృద్ధి చేస్తామని కేంద్రం చెబుతూనే కోవిడ్-19 ముసుగులో సీనియర్ సిటిజన్లు, కిడ్నీ బాధితులు, పిల్లలు, వికలాంగులకు సంబంధించిన రాయితీలన్నిటినీ తొలగించిందని మండిపడ్డారు. మరోవైపు రైల్వేలను ప్రయివేట్ కంపెనీలకు అప్పగించే కుట్ర సాగుతోందన్నారు. ప్రపంచంలో ప్రయివేట్ రైళ్లతో ప్రమాదాలు పెరిగాయని పలు దేశాల అనుభవాలు చెబుతున్నాయని, అర్జెంటీనా, బ్రిటన్ వంటి దేశాల్లో రైళ్లను మరలా జాతీయకరణ చేశారని గుర్తుచేశారు. భద్రతా వైఫల్యాలపై కేంద్రం దృష్టిసారించడం లేదని, ట్రాక్‌ల రిపేర్లు జరగడం లేదని, రైల్వే శాఖ విభాగాల్లో 2.7 లక్షల పర్మినెంట్ ఉద్యోగాలు ఖాళీగా ఉన్నా నింపడం లేదని అన్నారు.

ఈ విధానాలకు వ్యతిరేకంగా అన్ని రైల్వే స్టేషన్ల వద్ద ఈ నెల రెండో వారంలో నిరసన ప్రదర్శనలను చేపట్టనున్నామని చెప్పారు. సిఐటియు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సిహెచ్.నర్సింగరావు మాట్లాడుతూ.. దేశంలో 400 స్టేషన్లలో ఇప్పటికే 40 స్టేషన్లను అభివృద్ధి పేరుతో దేశీయ పెట్టుబడిదార్లకు, ప్రయివేట్ కంపెనీలకు మోడీ ప్రభుత్వం ధారాదత్తం చేసిందని విమర్శించారు. విశాఖలోని ఎల్‌ఐసి కార్యాలయం నుంచి రైల్వే స్టేషన్, కంచరపాలెం నుంచి అక్కయ్యపాలెం వరకూ ఉన్న స్థలాలను విక్రయించే కుట్రలు సాగుతున్నాయని తెలిపారు.

IDBI BANK
CIN: L65190MH2004GOI148838
ఐడిబిఐ బ్యాంక్ లిమిటెడ్
సిరిపురం, ఫైడా ఛాంబర్స్, 1వ అంతస్తు, 9-14-15, వి.ఐ.పి.రోడ్, సిరిపురం, విశాఖపట్నం, పిన్ : 530003, ఆంధ్రప్రదేశ్.

ముందస్తు అమ్మకం - ప్రకటన

ఋణగ్రహీత, హామీదారు & తనఖాదారు : 1) మెస్సర్స్ విజయ్ కిరణ్ ఆటోమొబైల్ ఇంజనీరింగ్ వర్క్స్ ("ది ఫరమ్") ఇంటి. నెం.17/10/8, గుంటూరు రోడ్, క్రిష్టియన్ పాలెం, నరసరావుపేట, ఆంధ్రప్రదేశ్-522601.
2) (ప్రొప్రైటర్): శ్రీ కొనతం శ్రీనివాస రెడ్డి, తండ్రి : చిన్న సోమిరెడ్డి, ఇంటి నెం.1-127, రంగారెడ్డి పాలెం, జొన్నలగడ్డ, గుంటూరు జిల్లా, ఆంధ్రప్రదేశ్-522601.
3) (తనఖాదారు): శ్రీమతి కొనతం లలిత కుమారి, భర్త : కొనతం శ్రీనివాస రెడ్డి, ఇంటి నెం.1-127, రంగారెడ్డి పాలెం, జొన్నలగడ్డ, గుంటూరు జిల్లా, ఆంధ్రప్రదేశ్-522601.

1) పైన తెలిపిన రుణగ్రహీత మరియు తనఖాదారులు మరియు/లేదా హామీదారులు ఇందుమూలముగా తెలియజేయునది ఏమనగా **ఐడిబిఐ బ్యాంకు**కు తనఖా పెట్టబడిన దిగువ వివరించిన స్థిరాస్తికి సంబంధించి సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్స్, 2002 ("రూల్స్")తో చదవబడు విధంగా సెక్యూరిటైజేషన్ అండ్ రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అస్సెట్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ యాక్ట్, 2002 ("చట్టము") సంక్రమించిన అధికారములను వినియోగించుకొనుచూ **ఐడిబిఐ బ్యాంక్ లిమిటెడ్ ("ఐడిబిఐ బ్యాంక్")** యొక్క అధీకృత అధికారి (ఎఓ) చర్యలు తీసుకున్నారు.
తనఖాదారు పేరు : శ్రీమతి కొనతం లలిత కుమారి.
గుంటూరు జిల్లా, నరసరావుపేట ఎస్ఆర్ఓ, నరసరావుపేట మండలం, జొన్నలగడ్డ గ్రామం, సర్వే నెం.497లో, ఎ.0-92 సెంట్లు యావత్తు ఆస్తి **శ్రీమతి కొనతం లలిత కుమారి** గారి పేరున ఉన్నది.
హద్దులు : తూర్పు వైపుగా : ఏరువ వెంకటేశ్వర రెడ్డి, **పడమర వైపుగా :** బి. జగన్నాథ రెడ్డి, **ఉత్తరం వైపు గా :** పొన్నపాటి ఓబుల్ రెడ్డి, **దక్షిణం వైపుగా :** ఏరువ నాగి రెడ్డి.
దానిపై ఉన్న అన్ని నిర్మాణాలు మరియు భూమికి అనుసంధానించబడిన అన్ని వస్తువులు లేదా భూమికి అనుసంధానించబడిన ఏదైనా శాశ్వతంగా కట్టివేయబడతాయి.
2) దిగువ సంతకముదారు పైన తెలిపిన స్థిరాస్తిని విక్రయించాలని ప్రతిపాదించినారు మరియు ఆ ప్రకారం రూల్స్ లోని రూల్స్ 8(6) మరియు 9(1) నిబంధన ప్రకారం **తేది: 13.10.2023** గల అమ్మకము ప్రకటన రిజిస్టర్ పోస్టు ద్వారా రుణగ్రహీత, హామీదారు మరియు తనఖాదారులకు పంపబడింది. అయితే సదరు నోటీసు గ్రహీతలందరికి అందజేయబడలేదు. అందువలన రూల్స్ లోని 8(5)ని అనుసరిస్తూ ఈ బహిరంగ ప్రకటన జారీ చేయడమైనది.
3) రూల్స్ లోని రూల్ 8(5)లో పేర్కొన్న ఏవేని విధానాలను అనుసరించడం ద్వారా ఈ నోటీసు తేది నుండి 15 రోజుల తరువాత పైన తెలిపిన స్థిరాస్తి అమ్మబడుతుందని గమనించగలరు.
4) అయితే రుణగ్రహీత, హామీదారు మరియు తనఖాదారులకు **ఐడిబిఐ బ్యాంక్** నుంచి రుణగ్రహీతచే వినియోగించుకోబడిన రుణముల నిమిత్తం చెల్లించవలసిన బకాయి మొత్తాలు **తేది.12.10.2023 నాటికి రూ.34,49,894.57/- (అక్షరాల ముప్పై నాలుగు లక్షల నలభై తొమ్మిది వేల ఎనిమిది వందల తొంభై నాలుగు రూపాయల యాభై ఏడు పైసలు మాత్రమే)** ఏవేని వ్యయములు ఉంటే వాటితో సహా మరియు చెల్లింపు/వసూలు తేదీ వరకు చక్రవడ్డీతో ఒప్పంద రేట్ల వంతున **తేది: 13.10.2023** నుంచి వర్తింపుతో దానిపై తదుపరి వడ్డీ చెల్లించి పైన తెలిపిన కాలవ్యవధిలోగా పైన తెలిపిన స్థిరాస్తిని తిరిగి స్వాధీనము చేసుకోవలసిందిగా కోరడమైనది.
5) ఒక వేళ రుణగ్రహీత, హామీదారు మరియు తనఖాదారులు ఈ నోటీసు తేదీ నుంచి 15 రోజులలోగా చెల్లించవలసిన బకాయి మొత్తాలను తిరిగి చెల్లించుటలో విఫలమైతే, దిగువ సంతకముదారు పైన తెలిపిన స్థిరాస్తి అమ్మకముతో ముందుకుసాగె స్వేచ్ఛ కలిగి ఉంటారు.

ప్రదేశం: విశాఖపట్నం, తేది: 01.11.2023 సం/- అధీకృత అధికారి, ఐడిబిఐ బ్యాంక్ లిమిటెడ్

రైలు ప్రమాద బాధితులకు రూ.1.73 కోట్లు ఎక్స్‌గ్రేషియా చెల్లింపులు

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ (విశాఖపట్నం)

విజయనగరం జిల్లా కంటకాపల్లి - అలమండ సెక్షన్‌లో గత నెల 29న జరిగిన రైలు ప్రమాదంలో బాధితులకు రైల్వే శాఖ రూ.1.73 కోట్లు ఎక్స్‌గ్రేషియా చెల్లించినట్టు వాల్తేరు డివిజన్ రైల్వే సీనియర్ డివిజనల్ కమర్షియల్ మేనేజర్ ఎకె.త్రిపాఠి తెలిపారు. ఈ మేరకు ఆయన బుధవారం ఒక ప్రకటన విడుదల చేశారు. మంగళవారం సాయంత్రం నాటికి మరణించిన వారిలో ఒకరికి మినహా అందరికీ ఎక్స్‌గ్రేషియా చెల్లించినట్లు వెల్లడించారు. క్షతగాత్రుల ఆరోగ్యంపైనా ప్రమాదం జరిగిన వెంటనే అప్రమత్తమయ్యామని తెలిపారు.

పాత పద్ధతిలోనే ఉద్యోగోన్నతులు

ఆర్‌టిసి ఎంప్లాయీస్ యూనియన్ డిమాండ్

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

ఎపిఎస్‌ఆర్‌టిసిలో పాత పద్ధతుల్లోనే ఉద్యోగులకు ఉద్యోగోన్నతులకు అవకాశం కల్పించాలని ఎపిపిటిడి ఎంప్లాయీస్ యూనియన్ కోరింది. ఈ మేరకు ఆర్‌టిసి ఉద్యోగులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని కోరుతూ ఎంప్లాయీస్ యూనియన్ రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు పలిశెట్టి దామోదరరావు, జివి నర్సయ్య ఆర్‌టిసి ఎమ్‌డి ద్వారకా తిరుమలరావుకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు ఆర్‌టిసి ఉద్యోగులు ఎదుర్కొంటున్న ఉద్యోగోన్నతులు, ఉద్యోగులపై పెండింగ్‌లో వున్న కేసుల పరిష్కారానికి చొరవ తీసుకోవాలని వారు కోరారు. పాతపద్ధతిలో ఉద్యోగోన్నతులు ఇచ్చేందుకు ప్రభుత్వం అంగీకరించిందని త్వరలో విధివిధానాలను రూపొందిస్తామని ఎమ్‌డి ద్వారకా తిరుమలరావు హామీ ఇచ్చారు. అలాగే కేసుల్లో వున్న ఉద్యోగుల సమస్యలను పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు.

కాఫీ రైతులతో మాట్లాడుతున్న విజూ కృష్ణన్

కాఫీ, మిరియాలకు గిట్టుబాటు ధర కల్పించాలి

- ఎఐకెఎస్ జాతీయ ప్రధాన కార్యదర్శి విజూ కృష్ణన్

ప్రజాశక్తి - అరకులోయ రూరల్

కాఫీ, మిరియాలకు ప్రభుత్వం గిట్టుబాటు ధర కల్పించి రైతులను ఆదుకోవాలని ఆల్ ఇండియా కిషన్ సభ (ఎఐకెఎస్) జాతీయ ప్రధాన కార్యదర్శి విజూ కృష్ణన్ డిమాండ్ చేశారు. అల్లూరి సీతారామరాజు జిల్లా అరకులోయలోని సుంకరమెట్ట పంచాయతీ పెదగంగుడి గ్రామ సమీప ప్రాంతాల్లో ఆయన బుధవారం పర్యటించారు. గిరిజన రైతులు సాగు చేస్తున్న కాఫీ తోటలను పరిశీలించారు. ఈ సందర్భంగా సుంకరమెట్ట సర్పంచ్ గెమ్మెలి చిన్నబాబు.. కాఫీని సాగు చేసే విధానాన్ని వివరించారు. కాఫీ రైతులకు గిట్టుబాటు ధర కల్పించడం లేదని, దీంతో దళారుల చేతుల్లో మోసపోతున్నారని తెలిపారు. పార్చ్‌మెంట్ కాఫీ కిలోను రూ.500కు, చెర్రీ కాఫీ కిలో రూ.250, పండు కాఫీ కిలో రూ.100, మంచి మిరియాలు కిలో వెయ్యి రూపాయలకు ప్రభుత్వమే కొనుగోలు చేయాలని తాము అడుగుతున్నా ప్రభుత్వంగానీ, ఐటిడిఎగానీ పట్టించుకోవడంలేదని వాపోయారు. మిరియాల పంట సేకరణకు నిచ్చెనలు, కాఫీ పంట ఆరబెట్టుకునేందుకు ప్లాట్‌ఫారాలు, ఫల్పర్ మిషన్లు, టార్పాలిన్లను ప్రతి రైతుకూ పంపిణీ చేయాలని కోరుతున్నా ఫలితంలేదని ఆవేదన వ్యక్తం చేశారు. అనంతరం విజూ కృష్ణన్ మాట్లాడుతూ అరకు ఆర్గానిక్ కాఫీకి దేశ, విదేశాల్లో మంచి పేరుందని తెలిపారు. కష్టపడి పండించే రైతుకు గిట్టుబాటు ధరను ప్రభుత్వం కల్పించకపోవడం దుర్మార్గమన్నారు. అరకు కాఫీని జి 20 సమ్మిట్‌లో గొప్పగా ప్రచారం చేసిన కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఎందుకు గిట్టుబాటు ధర కల్పించి కొనుగోలు చేయడం లేదని ప్రశ్నించారు. 2019-23 మధ్య రైతులకు రావాల్సిన రూ.60 కోట్ల బకాయిలను తక్షణమే విడుదల చేసి రైతుల ఖాతాలో జమ చేయాలని కోరారు. రైతుల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తామని తెలిపారు. సమస్యలను పరిష్కరించకుంటే కాఫీ రైతు సంఘం ఆధ్వర్యాన పోరాటాన్ని ఉధృతం చేయాలని రైతులను కోరారు.

పాఠశాలల విలీన ప్రక్రియను పున:సమీక్షించాలి : యుటిఎఫ్

ప్రజాశక్తి-తగరపువలస, పద్మనాభం (విశాఖపట్నం)

విద్యారంగ సంస్కరణల పేరుతో రాష్ట్ర ప్రభుత్వం గతేడాది ప్రాథమిక పాఠశాలల్లోని 3, 4, 5 తరగతులను ఉన్నత పాఠశాలల్లో విలీనం చేసిందని, ఆ ప్రక్రియపై పున: సమీక్ష చేయాలని యుటిఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు ఎన్.వెంకటేశ్వర్లు డిమాండ్ చేశారు. పద్మనాభం, భీమిలి మండలంలో బుధవారం ఆయన పర్యటించారు. ముందుగా భీమిలి మజ్జిపేట మండల పరిషత్ విలీన ప్రాథమిక పాఠశాలను సంఘం జిల్లా కార్యదర్శి ఉప్పాడ రాము, మండల అధ్యక్షులు రాజ్‌కుమార్, నాయకులు పి.వెంకటరమణ, ఆర్.సూరిబాబుతో కలిసి సందర్శించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. ప్రాథమిక పాఠశాలల బలోపేతానికి చర్యలు తీసుకోవాల్సిన ప్రభుత్వం అందుకు విరుద్ధంగా వ్యవహరిస్తుండడం అన్యాయమన్నారు. రాష్ట్రంలో 14 వేల పైచిలుకు ప్రాథమిక పాఠశాలలు నేడు ఏకోపాధ్యాయ పాఠశాలలుగా మారిపోయాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఉద్యోగ, ఉపాధ్యాయులకు రావాల్సిన వివిధ రకాల బకాయిలను సెప్టెంబర్ 30లోగా చెల్లిస్తామని ప్రభుత్వం ఇచ్చిన హామీ నేటికీ నెరవేరలేదన్నారు. పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఆయన వెంట సంఘం మండల నాయకులు నారాయణరావు, కె.సన్యాసిరావు, బోని చిన్నారావు, వెంకటరమణ ఉన్నారు.

రిలయన్స్ కమర్షియల్ ఫైనాన్స్ లిమిటెడ్.
నమోదిత కార్యాలయం : 11వ అంతస్తు, ది రూబీ, ప్లాట్ నం.-29, రూబీ మిల్స్ కాంపౌండ్, సేనాపతి బాపత్ మార్గ్, దాదర్ పశ్చిమం, ముంబై-400028
శాఖా కార్యాలయం : రిలయన్స్ కమర్షియల్ ఫైనాన్స్ లిమిటెడ్, 3వ అంతస్తు, ధృవ్ ఆర్కేడ్, బేరింగ్ నం.6-3-248/బి/1, నవీన్ నగర్, రోడ్డు నం.1, బంజారా హిల్స్, హైదరాబాద్-500034

సర్ఫేసీ యాక్ట్ 2002 క్రింద ఇ వేలం విక్రయ నోటీసు

దిగువసంతకందారు అయిన రిలయన్స్ కమర్షియల్ ఫైనాన్స్ లిమిటెడ్ గతంలో రిలయన్స్ హోమ్ ఫైనాన్స్ లిమిటెడ్ యొక్క అధీకృత అధికారి, సెక్యూరిటైజేషన్ అండ్ రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అసెట్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంట్రస్ట్ యాక్ట్ 2002 యొక్క సెక్షన్ 13(2) క్రింద దిగువ పేర్కొన్న ఆస్తిని స్వాధీనం చేసుకున్నారని నోటీసు జారీ చేయబడినది. బ్యాంక్ బకాయిల రియలైజేషన్ కొరకు క్రింది రుణ ఖాతాలలో "ఆధారం ఉన్నట్లే" మరియు "ఆధారం ప్రకారంగా" విక్రయించడానికి హక్కు ఉంది.

క్ర. సం	1. రుణగ్రహీత/లు మరియు హామీదారు/ల పేరు మరియు చిరునామా 2. మొత్తం బకాయి+ నుండి వడ్డీ	ఆస్తి వివరణ	1.ఇ వేలం తేది మరియు సమయం 2. ఇఎమ్‌డి సమర్పణ చివరి తేది 3. ఆస్తి తనిఖీ తేది మరియు సమయం	1. రిజర్వు ధర 2. ఆస్తి ఇఎమ్‌డి
1.	1. సాతులూరి సుష్మ, చిరునామా : ఫ్లాట్ నం.8, 4వ అంతస్తు, విజేత అపార్ట్‌మెంట్స్ ఆచార్య రంగా వీధి, గాయత్రి నగర్, విజయవాడ-520008. 2. సాతులూరి ఆనందబాబు, చిరునామా : ఆర్.ఎస్.నం.25/6, 25/7, స్టోర్ రోడ్డు కానూరు వద్ద మురళి నగర్ రోడ్డు కానూరు, పెనమలూరు విజయవాడ-520007. లోన్ ఎకౌంట్ నం.: **RHHLVIJ000066920** బకాయి మొత్తం : రూ.51,17,249.03/- (యాభై ఒక లక్షల పదిహేడు వేల రెండు వందల నలభై తొమ్మిది రూపాయల మూడు పైసలు మాత్రమే) 06.10.2023 నాటికి ప్లస్ వడ్డీ మరియు ఖర్చులు మొదలైనవి. 07.10.2023 నుండి సంవత్సరానికి ఆర్‌సిఎఫ్ఐ, అన్నీ ఖర్చులతో పాటు, ఛార్జీలు మరియు మొత్తం చెల్లింపు వరకు ఖర్చులు.	ఆంధ్రప్రదేశ్-520007, విజయవాడ, పెనమలూరు మండలం, కానూరు గ్రామం మరియు గ్రామ పంచాయతీ, మురళీ నగర్ రోడ్డు, కానూరు వద్ద, స్టోర్ రోడ్డు, ఆర్.ఎస్.నం.25/6, 25/7 వద్ద ఉన్న రెసిడెన్షియల్ ఆస్తి మొత్తం ఆ ముక్క మరియు పార్సిల్. క్రింది విధమైన హద్దులు : తూర్పు: పరమి రజనికి చెందిన స్థలం మరియు ఇతరుల స్థలం, దక్షిణం: బండి గోపాల కృష్ణ కి చెందిన స్థలం మరియు ఇతరుల స్థలం, పడమర : 33 అ.లు. వెడల్పు గ్రామ పంచాయతీ రోడ్డు, ఉత్తరం: వేమూరి కోటేశ్వరరావు స్థలానికి చెందిన స్థలం. స్వాధీనతా తేది : 17.08.2023	**1. ఇ వేలం తేది : 13 డిసెంబర్, 2023 ఉ.10.00 గం. నుండి మ.4.00 గం. మధ్య 5 నిమిషముల పొడిగింపుతో. 2. వేలం వేదిక :** రిలయన్స్ కమర్షియల్ ఫైనాన్స్ లిమిటెడ్, 3వ అంతస్తు, ధృవ్ ఆర్కేడ్, బేరింగ్ నం.6-3-248/బి/1, నవీన్ నగర్, రోడ్డు నం.1, బంజారా హిల్స్, హైదరాబాద్-500034. **3. కెవైసి తో ఇఎమ్‌డి సమర్పణ చివరి తేది : 12 డిసెంబర్, 2023 సా.5.00 గం. వరకు (ఐఎస్‌టి)** రిలయన్స్ కమర్షియల్ ఫైనాన్స్ లిమిటెడ్, 3వ అంతస్తు, ధృవ్ ఆర్కేడ్, బేరింగ్ నం.6-3-248/బి/1, నవీన్ నగర్, రోడ్డు నం.**1, బంజారా హిల్స్, హైదరాబాద్-500034. 4. తనిఖీ తేది : 11 డిసెంబర్, 2023 ఉ.11.00 గం. నుండి మ.3.00 గం. మధ్య**	**రిజర్వు ధర : రూ.40,00,000/-** (నలభై లక్షల రూపాయలు మాత్రమే) **ధరావత్తు డిపాజిట్ మొత్తం :** రూ.4,00,000/- (నాలుగు లక్షల రూపాయలు మాత్రమే)

వేలంలో ఉంచబడిన శాఖ మరియు ఆస్తులను సందర్శించాలని మరియు ఛార్జీలు, భారాలకు సంబంధించి అవసరమైన సమాచారాన్ని పొందాలని ఉద్దేశించిన బిడ్డర్లు సూచించబడ్డారు. కొనుగోలుదారు తన స్వంత విచారణ చేసి అదనపు ఛార్జీలు, భారాలు మరియు ఏదైనా మూడవ పక్షం ఆసక్తులను నిర్ధారించుకోవాలి మరియు అన్ని అంశాలలో తనను/ఆమెను/తాను సంతృప్తి పరచుకోవాలి. ఆస్తి పన్నులు, విద్యుత్తు బకాయిలు మరియు ఏదైనా ఇతర బకాయిలు వంటి అన్ని చట్టబద్ధమైన బకాయిలు, ఏదైనా ఉంటే, ఆస్తికి జోడించబడితే వాటిని విజయవంతమైన బిడ్డర్(లు)/కాబోయే కొనుగోలుదారు(లు) నిర్ధారించి చెల్లించాలి. బిడ్డర్(లు)/కాబోయే కొనుగోలుదారు(లు) సమర్పించే ముందు, పైన పేర్కొన్న వాటికి సంబంధించి మరియు పైన వివరించిన ఆస్తి/ఆస్తులకు సంబంధించిన ఇతర సంబంధిత వివరాలకు సంబంధించి తమ స్వంత ఆసక్తితో తనను/ఆమెను/తాను సంతృప్తి పరచాలని అభ్యర్థించబడ్డారు.

షరతులు మరియు నిబంధనలు:

1. అధీకృత అధికారి యొక్క ఉత్తమ జ్ఞానం మరియు సమాచారం మేరకు, ఏ ఆస్తిపై ఎటువంటి భారం లేదు. అయితే, బిడ్‌ను సమర్పించే ముందు, వేలం వేయబడిన ఆస్తి/ఆస్తి యొక్క శీర్షిక మరియు క్లెయిములు/ హక్కులు/ బకాయిలు/ ఆస్తిపై ప్రభావం చూపే భారాలు, వాటి గురించిన వారి స్వంత స్వతంత్ర మరియు విచక్షణాపరమైన విచారణలను ఉద్దేశించిన బిడ్డర్లు చేయాలి. ఇ వేలం ప్రకటన ఆర్‌సిఎఫ్ఎల్ యొక్క ఏదైనా నిబద్ధత లేదా ఏదైనా ప్రాతినిధ్యాన్ని ఏర్పరచదు మరియు పరిగణించబడదు. బ్యాంక్‌కు తెలిసినా లేదా తెలియకపోయినా ప్రస్తుతం ఉన్న మరియు భవిష్యత్తులో ఉన్న అన్నీ భారాలతో ఆస్తి విక్రయించబడుతుంది. అధీకృత అధికారి/సెక్యూర్డ్ క్రెడిటర్ ఏదైనా థర్డ్ పార్టీ క్లెయిమ్‌లు/ హక్కులు/ బకాయిలకు ఏ విధంగానూ బాధ్యత వహించరు. ఆర్‌సిఎఫ్ఎల్ కేవియట్ ఎంప్టర్ సూత్రాన్ని సేవలోకి ప్రెస్ చేయబడుతుంది.
2. బిడ్‌ను సమర్పించే ముందు ఆస్తి మరియు స్పెసిఫికేషన్‌ను పరిశీలించడం మరియు సంతృప్తి చెందడం బిడ్డర్ల బాధ్యత. 11 డిసెంబర్, 2023న ఉ. 11 గం. నుండి మ. 3 గం.ల మధ్య సైట్‌లలో ఆసక్తి గల బిడ్డర్‌లకు వేలం వేయబడిన ఆస్తుల తనిఖీ అనుమతించబడుతుంది (వేలం తేదీ ఆధారంగా నిర్ణయించబడుతుంది).
3. ఆసక్తి గల బిడ్డర్లు వెబ్ పోర్టల్ : **https://www.bankeauctions.com** ద్వారా వారి ఇఎమ్‌డి సమర్పించవచ్చు. (లాగిన్ ఐడి మరియు పాస్‌వర్డ్ ద్వారా **https://www.bankeauctions.com** తో పేరు నమోదు చేసుకోవడం ద్వారా వినియోగదారు ఐడి మరియు పాస్‌వర్డ్‌ను ఉచితంగా పొందవచ్చు. (10%) పైన పేర్కొన్న ఇఎమ్‌డిని హైదరాబాద్‌లో చెల్లించవలసిన పే ఆర్డర్ / డిమాండ్ డ్రాఫ్ట్ ద్వారా జమ చేయాలి మరియు పైన పేర్కొన్న తేదీ మరియు సమయానికి ముందు ఏదైనా జాతీయం చేయబడిన లేదా షెడ్యూల్ చేయబడిన బ్యాంక్‌లో డ్రా చేయబడిన "రిలయన్స్ కమర్షియల్ ఫైనాన్స్ లిమిటెడ్"కు అనుకూలంగా ఇఎమ్‌డి చెల్లించవలసి ఉంటుంది. (పై టేబుల్‌లో వివరించిన వివరాలను దయచేసి చూడండి) లేదా ఎకౌంట్ నం.29100200000442, ఐఎఫ్ఎస్‌సి కోడ్ నం. **BARB0MIDBDR**
4. పైన పేర్కొన్న ఆస్తి రిజర్వు ధర కంటే తక్కువగా విక్రయించబడదు.
5. అధీకృత అధికారి ప్రకటనకు లోబడి అత్యధిక బిడ్డర్‌కు ఆస్తి విక్రయించబడుతుంది. కొనుగోలుదారు అమ్మకం ధరలో 25 శాతం (ఇఎమ్‌డితో సహా) అతనికి/ఆమెకు అనుకూలంగా ధృవీకరించబడిన రోజున వెంటనే ఎకౌంట్ నం.29100200000442, ఐఎఫ్ఎస్‌సి కోడ్ నం. **BARB0MIDBDR** కి చెల్లించాలి. చెప్పిన చెల్లింపు మరియు కెవైసి డాక్యుమెంట్‌లను అసలైనవి (ఫోటో ఐడి మరియు అడ్రస్ ప్రూఫ్ డాక్యుమెంట్‌లు)తో ధృవీకరించిన తర్వాత, అధీకృత అధికారి విజయవంతమైన బిడ్డర్‌కు అనుకూలంగా అమ్మకానికి సంబంధించిన నిర్ధారణను జారీ చేస్తారు.
మిగిలిన మొత్తం అమ్మకం స్థిరాస్తిని నిర్ధారించిన 15వ రోజున లేదా అంతకు ముందు లేదా పార్టీల మధ్య వ్రాతపూర్వకంగా అంగీకరించబడిన పొడిగించిన వ్యవధిలో చెల్లించబడుతుంది. ఏదైనా కారణం చేత అమ్మకపు ధరలో 25 శాతం వెంటనే చెల్లించకపోతే, ఇఎమ్‌డి జప్తు చేయబడుతుంది. అలాగే, మిగిలిన 75 శాతం మొత్తాన్ని 15 రోజులలోపు లేదా పైన పేర్కొన్న విధంగా పొడిగించిన వ్యవధిలోపు చెల్లించకపోతే, అతను/ఆమె ఇప్పటికే చెల్లించిన మొత్తంలో 25 శాతం జప్తు చేయబడుతుంది మరియు మళ్ళీ స్థిరాస్తిని తిరిగి వేలం వేయడానికి ఆర్‌సిఎఫ్ఎల్ స్వేచ్ఛ ఉంటుంది.
6. పూర్తి బిడ్ మొత్తాన్ని స్వీకరించిన తర్వాత, అమ్మకపు అధికారాన్ని వినియోగించే అధీకృత అధికారి, సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్స్, 2002లోని అనుబంధం-4 లో ఇచ్చిన ఫారమ్‌లో కొనుగోలుదారుకు అనుకూలంగా స్థిరాస్తి కోసం విక్రయ ధృవీకరణ పత్రాన్ని జారీ చేస్తారు. అధీకృత అధికారికి ఎటువంటి నోటీసు అవసరం లేకుండా విక్రయానికి సంబంధించిన ఏవైనా నిబంధనలు మరియు షరతులను సవరించడానికి మరియు ఎటువంటి కారణం లేకుండా "ఇ" వేలాన్ని వాయిదా వేయడానికి /వాయిదా వేయడానికి /రద్దు చేయడానికి ఏదైనా బిడ్డర్‌ను అంగీకరించడానికి లేదా తిరస్కరించడానికి సంపూర్ణ హక్కు ఉంది.
7. విక్రయ ధృవీకరణ పత్రం కొనుగోలుదారు (లు)/ దరఖాస్తుదారు (ల) పేరిట మాత్రమే జారీ చేయబడుతుంది మరియు మరే ఇతర పేరు(ల)లో జారీ చేయబడదు.
8. కొనుగోలుదారు ఎక్సైజ్ డిపార్ట్‌మెంట్, వ్యాట్ మరియు ఏదైనా ఇతర చట్టబద్ధమైన బకాయిలు, రిజిస్ట్రేషన్ ఫీజు, స్టాంప్ డ్యూటీ వంటి రవాణా కోసం చెల్లించాల్సిన చార్జీలు/ఫీజులను చట్ట ప్రకారం వర్తించే విధంగా భరించాలి.
9. లాగిన్ ఐడి మరియు పాస్‌వర్డ్‌ని సృష్టించడం, డేటాను అప్‌లోడ్ చేయడం, బిడ్‌ను సమర్పించడం, ఇ-బిడ్డింగ్ ప్రక్రియపై శిక్షణ మొదలైన వాటిలో సహాయం అవసరమయ్యే ఆసక్తిగల బిడ్డర్లు మెసెర్స్. సి1 ఇండియా ప్రైవేట్ లిమిటెడ్ **https://www.bankeauctions.com** ని సంప్రదించవచ్చు. హెల్ప్‌లైన్ నం.7291981124/1125/1126, శ్రీ.ధరణి కృష్ణ, మొబైల్ నం.99481 82222, హెల్ప్‌లైన్ ఇ మెయిల్ ఐడి : **support@bankeauctions.com** మరియు ఏదైనా ఆస్తి కి సంబంధించిన ప్రశ్నలకు రిలయన్స్ కమర్షియల్ ఫైనాన్స్ లిమిటెడ్, శాఖ- హైదరాబాద్, అధీకృత అధికారి : శ్రీ.కోదండ రాములు ఎ, మొబైల్ నం.: +91-9052003980, ఇ మెయిల్ ఐడి : **kodandda.ramulu@relianceada.com,** కార్యాలయం పని వేళలలో సంప్రదించవచ్చును.
10. వెబ్ పోర్టల్ మెసెర్స్. సి1 ఇండియా ప్రైవేట్ లిమిటెడ్ లో అందుబాటులో ఉన్న ఇ-వేలం యొక్క వివరణాత్మక నిబంధనలు మరియు షరతుల ద్వారా వెళ్లాలని బిడ్డర్లు సూచించబడ్డారు. **https://www.bankeauctions.com** ముందు వారి బిడ్‌లను సమర్పించి ఇ-వేలంలో పాల్గొనండి.

ప్రదేశం : విజయవాడ
తేది : 01.11.2023
(అధీకృత అధికారి)
రిలయన్స్ కమర్షియల్ ఫైనాన్స్ లిమిటెడ్., తరఫున

ఉద్యోగుల సమస్యలపై ప్రభుత్వం అలసత్వం

- సహకార ఉద్యోగుల రిలే దీక్షల్లో ఎమ్మెల్సీ సాబ్జి
- ముగిసిన మూడ్రోజుల రిలేదీక్షలు

మాట్లాడుతున్న ఎమ్మెల్సీ సాబ్జి

ప్రజాశక్తి-గుంటూరు

అపరిష్కృతంగా ఉన్న సమస్యల పరిష్కారానికి రాష్ట్ర సహకార సంఘాల ఉద్యోగుల యూనియన్ (సిఐటియు) ఆధ్వర్యంలో మూడ్రోజులుగా ఉద్యోగులు దీక్షలు చేస్తున్నా అధికారులు స్పందించకపోవటం బాధాకరమని పిడిఎఫ్ ఎమ్మెల్సీ షేక్ సాబ్జి అన్నారు. గుంటూరు శ్యామలానగర్‌లోని సహకార శాఖ కమిషనర్ కార్యాలయం వద్ద చేపట్టిన రిలే దీక్షల్లో భాగంగా బుధవారం చివరిరోజు దీక్షలో ఆయన మాట్లాడారు. ప్రభుత్వం తక్షణమే స్పందించాలని, సంఘ నాయకులతో చర్చించి సమస్యలను పరిష్కరించాలని కోరారు. సహకార సంఘాల ప్రయివేటీకరణ, చట్ట సవరణను ఉపసంహరించుకోవాలని, ప్రభుత్వ ఉద్యోగులు మాదిరిగానే విరమణ వయస్సు 62 ఏళ్లకు పెంచాలని, 2019 వేతన సవరణతోపాటు, ఆర్థిక ప్రయోజనాలు, గ్రాట్యుటీ చట్ట ప్రకారం చెల్లించాలని తదితర న్యాయమైన డిమాండ్లతో సహకార ఉద్యోగులు దీక్షలు చేపట్టారని తెలిపారు. ఈ దీక్షలకు పిడిఎఫ్ ఎమ్మెల్సీల తరపున సంపూర్ణ మద్దతు తెలిపారు. సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తామని హామీ ఇచ్చారు. పి విజయ్‌కుమార్, కిరణ్, వెంకటేశ్వరరావు, రామచంద్రరాజు, రామకృష్ణ, నాయక్, శివ, శ్రీను, సుబ్బారావు, చంద్రశేఖర్, శ్రీకాంత్‌రెడ్డి, రామిరెడ్డి, శ్రీనివాస్, సీతారామ శర్మ దీక్షల్లో కూర్చున్నారు. యూనియన్ రాష్ట్ర గౌరవాధ్యక్షులు పి అజయ్‌కుమార్, అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు టి వెంకటరామయ్య, కె సత్యనారాయణ, కోశాధికారి పి సత్యనారాయణ ప్రసంగించారు.

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వము
రహదారులు మరియు భవనముల శాఖ
నెం.16(5)/టి.ఓ/2023-24 **టెండరు షార్ట్ నోటీసు** తేది:28.10.2023
2023-24 సం॥నకు పి.హెచ్.సి భవనాలు మరియు రోడ్స్ మరమ్మత్తులు నిమిత్తం మొత్తం 5 పనులకు గాను అంచనా విలువ: రూ.131.00 లక్షలకు టెండర్లు కోరబడుచున్నవి. టెండరు షెడ్యూల్ డౌన్‌లోడ్ చేసుకొనుటకు తేది: 04.11.2023, సా.3గం. నుండి. ఇతర వివరాలను ఈ కార్యాలయములో పొందవచ్చును.
ఫోన్ నెం.08672-252500
సం/- కార్యనిర్వాహక ఇంజనీరు, (ర.భ) శాఖ, మచిలీపట్నం
DIPRNo.11465/CL/ADVT/1/1/2021-22

సంపాదకీయం

ప్రజాస్వామ్యం విధ్వంసం

ప్రతిపక్ష నేతలతో పాటు, పలువురు పాత్రికేయులపై నిఘా పెట్టడం ద్వారా నరేంద్రమోడీ నేతృత్వంలోని కేంద్ర ప్రభుత్వం ప్రజాస్వామ్య, పౌరహక్కుల విధ్వంసానికి పాల్పడింది. రాజ్యాంగ విలువలను నిలువునా పాతరేసింది. ప్రపంచ ప్రఖ్యాత మొబైల్ ఫోన్ల తయారీ సంస్థ యాపిల్ జారీ చేసిన అలెర్ట్ మెసేజ్‌లతో ఈ వ్యవహారం బట్టబయలైంది. సిపిఎం ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరి, సమాజ్‌వాదీ పార్టీ అధినేత అఖిలేష్ యాదవ్, ది వైర్ వ్యవస్థాపక ఎడిటర్ సిద్ధార్థ వరదరాజన్‌తో పాటు పలువురు ప్రతిపక్ష పార్టీల నాయకులు, పాత్రికేయుల ఫోన్లు 'స్టేట్ స్పాన్సర్డ్ అటాకర్స్' నిఘా జాబితాలో ఉన్నట్లు యాపిల్ మెసేజ్‌ల ద్వారా తేలడంతో దేశ వ్యాప్తంగా గగ్గోలు మొదలైంది. ప్రజాస్వామ్యంపై ఏ మాత్రం నమ్మకం ఉన్నా కేంద్ర ప్రభుత్వం ఈ వ్యవహారాన్ని తీవ్రంగా తీసుకుని ఉండాలి. నిష్పక్షపాత విచారణ ద్వారా వాస్తవాలను వెలికి తీసి, తన నిజాయితీని నిరూపించుకోవడానికి సిద్ధపడాలి. కానీ జరిగింది వేరు. ప్రధానమంత్రి నరేంద్ర మోడీ పెదవి విప్పలేదు. స్పందించిన కేంద్ర ఐటి శాఖ మంత్రి అశ్వనీ వైష్ణవ్ కూడా అలెర్ట్ మెసేజ్‌లు పంపిన యాపిల్ సంస్థపై ఎదురుదాడికి దిగారు. దబాయింపులతో ప్రభుత్వ అనైతిక చర్యలను కప్పి పుచ్చుకోవాలని చూస్తున్నారు. తమ కనుసన్నలలో నడిచే కంప్యూటర్ అత్యవసర స్పందన బృందం (సిఇఆర్‌టి) ద్వారా విచారణ జరిపిస్తామని చెప్పడం కంటితుడుపు చర్యే! సాంకేతిక పొరపాట్ల వల్ల అప్పుడప్పుడు ఇటువంటి మెసేజ్‌లు వస్తుంటాయన్న మరో వాదనను ప్రభుత్వం ముందుకు తెచ్చింది. అదే నిజమైతే ప్రతిపక్ష నాయకుల ఫోన్లకే ఆ మెసేజ్ ఎందుకు వచ్చింది? బిజెపి, దాని మిత్రపక్షాల నాయకులకు ఎందుకు రాలేదు?

నరేంద్రమోడీ ప్రభుత్వం తన ప్రత్యర్థులపై ఈ తరహా చర్యలకు పాల్పడటం ఇదే మొదటిసారి కాదు. గతంలో కూడా అనేక టెక్ కంపెనీలు ఈ తరహా సర్కారు కుట్రలను బట్టబయలు చేశాయి. రెండు సంవత్సరాల క్రితం దేశ వ్యాప్తంగా కలకలం రేపిన ఇజ్రాయిల్‌కు స్పైవేర్ పెగాసెస్ గురించి ప్రత్యేకంగా చెప్పనవసరం లేదు. మీడియా పరిశోధన చేసి స్పైవేర్ వినియోగం గురించి పుంఖానుపుంఖాలుగా కథనాలు ప్రచురించినప్పటికీ కేంద్ర ప్రభుత్వంలో చలనం లేదు. చివరకు అత్యున్నత న్యాయస్థానం జోక్యం చేసుకుని నియమించిన నిపుణుల కమిటీకి సహకరించేందుకు మొండిగా తిరస్కరించింది. ఎన్.రామ్ వంటి ప్రముఖ పాత్రికేయులు తమ ఫోన్ల హ్యాకింగ్‌పై సుప్రీంకోర్టులో పిటిషన్ వేస్తే, ఆ ఆరోపణ తప్పు అని చెప్పలేదంటేనే కేంద్రం తప్పు చేసిందని అర్థమైపోయింది. ఇప్పుడు అదే తప్పును పునరావృతం చేసింది. యాపిల్ తాజాగా పంపిన మెసేజ్‌ల వంటివాటిని 2019లోనే యాహూ సంస్థ కొందరికి పంపింది. 'గవర్నమెంట్ బ్యాక్డ్ యాక్టర్స్ మీ ఖాతాను లక్ష్యంగా చేసుకున్నారు. దీనివల్ల మీ సమాచారం వారికి చేరుతుంది' అని యాహూ అప్పట్లో పేర్కొంది. అదే సంవత్సరం గూగుల్ కూడా 500 మంది దాకా తమ ఖాతాదారులు ప్రభుత్వ బ్యాక్డ్ హ్యాకర్ల బారిన పడ్డారన్న అనుమానాలను వ్యక్తం చేసింది. ఈ అన్ని సందర్భాల్లోనూ కేంద్ర ప్రభుత్వం నుండి మౌనమే సమాధానంగా వచ్చింది.

బీమా కోరెగావ్ కేసులో నిందితులుగా ఉన్న కొందరి కంప్యూటర్లలోకి రిమోట్ పద్ధతిలో చొరబడి తప్పుడు సమాచారాన్ని ఉంచడం ద్వారా వారిపై దోషుల ముద్ర వేశారన్న విషయం తెలిసిందే. ఈ నిర్వాకం వెలుగులోకి వచ్చిన తరువాత కూడా కేంద్ర ప్రభుత్వం స్పందించలేదు. చేయని నేరానికి వారు ఇంకా జైళ్లలోనే మగ్గుతున్నారు. ఎన్నికలు సమీపిస్తున్న ప్రస్తుత తరుణంలో ప్రతిపక్ష నేతలు, పాత్రికేయుల ఫోన్లను హ్యాక్ చేయడం ద్వారా అటువంటి కుట్రకే కేంద్రం తెరలేపిందన్న అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. గత అనుభవాలను దృష్టిలో ఉంచుకున్నప్పుడు వీటిని తోసివేయలేం. ఈ తరహా కుట్రలు, కుతంత్రాలను తిప్పికొట్టక పోతే ప్రజాస్వామ్యం ప్రమాదంలో పడుతుంది. భవిష్యత్తులో ఇటువంటివి పునరావృత్తం కాకుండా చూడాలంటే దీనిపై సమగ్ర దర్యాప్తు జరిపించాలి.

మహనీయుల మాట

చట్టం పేదవాళ్ళను కాల్చుకు తింటుంది. ధనికులు మాత్రం ఆ చట్టాన్నే పాలిస్తారు.

- ఆలివర్ గోల్డ్‌స్మిత్,
ప్రసిద్ధ ఆంగ్లో-ఐరిష్ నవలా రచయిత, నాటక రచయిత, కవి.

సామాజిక న్యాయం - కుల సర్వే

విశ్లేషణ

హరీష్ ఎస్. వాంఖేడ్

బీహార్ సర్వే అక్కడి ప్రభుత్వం కొన్ని పాలనాపరమైన చర్యలకు ఉపక్రమించేలా చేయడమే కాక జాతీయ స్థాయిలో ఒక పెద్ద చర్చకు దారితీస్తుంది. అధిక ఒబిసి జనాభా ఉన్న యు.పి, మహారాష్ట్ర, హర్యానాలో ఇలాంటి సర్వేల కోసం ఆందోళనలు రేగవచ్చు. వాస్తవానికి ఆ రాష్ట్రాల్లో అటువంటి సర్వేలు ఇబిసిల కదలికల్ని వేగవంతం చేసి ఆ రాష్ట్రాల శాసనసభల్లో వారి ప్రాతినిధ్యాన్ని పెంచాలని పెట్టుబడిదారీ వ్యవస్థలో వారి వాటా కోసం డిమాండు ముందుకు రావచ్చు. ప్రస్తుతం నిద్రాణంగా ఉన్న సామాజిక న్యాయం డిమాండును ప్రతిపక్ష పార్టీలు ముందుకు తెచ్చి బిజెపి 'హిందూత్వ' పాలనకు సవాలు విసరొచ్చు.

గత నాలుగు దశాబ్దాల సరళీకరణ విధానాలు కొత్త కొత్త ఉపాధి అవకాశాలను సృష్టించాయి. పట్టణ మధ్య తరగతిని పెంచాయి. అభివృద్ధి చెందిన దేశాల్లో సాంకేతిక నిపుణులుగా అనేక మంది ప్రవాస భారతీయులు కొలువు తీరారు. అయితే ప్రస్తుతం మన దేశం ఎదుర్కొంటున్న ఆర్థిక సంక్షోభాన్ని ఇవి కనపడనీయకుండా చేస్తున్నాయి. దేశంలోని పెద్ద జనాభా అత్యంత వెనుకబడ్డ కులాలకు (ఇబిసి) సంబంధించిన వారుగా ఉన్నారు. దేశ అభివృద్ధి ఫలాలు వీరికి అందటం లేదు. ఇబిసి లలో అత్యధికులు గ్రామాల్లో నివసిస్తున్నారు. చివరికి ఎన్నికల విధానాల అంచున నివసిస్తున్నారు. తక్కువ ఆదాయాల్లో నివసిస్తుంటారు. వర్గ అసమానతలు, విద్యాపరమైన వెనుకబాటుతనాన్ని అంచనా వేసేందుకు, జనాభా గణాంక వివరాల ప్రాతిపదికన వివిధ కులాలు, మతాల లెక్కలు అధ్యయనం చేయడానికి 1955లో కాకా వేల్కర్, 1980లో మండల్, 2006లో సచార్ కమిషన్‌లను ఆనాటి ప్రభుత్వాలు నియమించాయి. వాటి అధ్యయనంపై ఆధారపడే చట్టపరంగా ఎటువంటి చర్యలు తీసుకోవాలో సామాజికంగా వెనుకబడ్డవారికి ఏ విధంగా రక్షణ కల్పించాలో తేలుతుంది.

ఇటీవల బీహార్ ప్రభుత్వం విడుదల చేసిన కుల గణాంక నివేదిక (2023) జనాభాలో వెనుకబాటుకు గురైన ప్రజలు ఎవరు? దానికి కారణాలేంటి? బిసి లలో వెనుకబాటుకు కారణాలేంటి? వాటికి పాలనా పరంగా ఎటువంటి చర్యలు చేపట్టాలి వంటి వాటిని ఆ నివేదిక పేర్కొంది. ఆ నివేదిక ప్రకారం ఒబిసి లు 27.12 శాతం ఉండగా, అత్యంత వెనకబడిన కులాలు (ఇబిసి లు) 36.01 శాతం. మొత్తంగా వెనకబడ్డ కులాలు బీహార్ జనాభాలో 63.13 శాతం. దళితులు, ఒబిసి, ఇబిసి లు తక్కువ ఆదాయాలొచ్చే వ్యవసాయ కార్మికులుగాను, పట్టణ కార్మికులుగాను బతుకులీడుస్తున్నారు.

అంతకుముందు భూ యజమాన్యాల గురించి చేసిన అధ్యయనంలోనూ సామాజికంగా ధనిక కులాలైన బ్రాహ్మణులు, భూమిహార్, రాజ్‌పుత్‌లు బీహార్ లోని అతి పెద్ద భూ యజమానులుగా ఉండగా, సంఖ్యారీత్యా బలంగా వున్న ఒబిసి, ఇబిసి లు భూ యాజమాన్యంలోనూ, ఇతర ఆర్థిక సౌకర్యాలలోనూ చాలా బలహీనంగా ఉన్నారని తేలింది.

బీహార్ సర్వే అక్కడి ప్రభుత్వం కొన్ని పాలనాపరమైన చర్యలకు ఉపక్రమించేలా చేయడమే కాక జాతీయ స్థాయిలో ఒక పెద్ద చర్చకు దారితీస్తుంది. అధిక ఒబిసి జనాభా ఉన్న యు.పి, మహారాష్ట్ర, హర్యానాలో ఇలాంటి సర్వేల కోసం ఆందోళనలు రేగవచ్చు. వాస్తవానికి ఆ రాష్ట్రాల్లో అటువంటి సర్వేలు ఇబిసిల కదలికల్ని వేగవంతం చేసి ఆ రాష్ట్రాల శాసనసభల్లో వారి ప్రాతినిధ్యాన్ని పెంచాలని పెట్టుబడిదారీ వ్యవస్థలో వారి వాటా కోసం డిమాండు ముందుకు రావచ్చు. ప్రస్తుతం నిద్రాణంగా ఉన్న సామాజిక న్యాయం డిమాండును ప్రతిపక్ష పార్టీలు ముందుకు తెచ్చి బిజెపి 'హిందూత్వ' పాలనకు సవాలు విసరొచ్చు. ప్రస్తుతం సామాజిక న్యాయం పేరున జరుగుతున్న రాజకీయాలకు అట్టడుగునున్న ఇబిసి లు నిజమైన వారసులుగా ఉద్యమంతో ముందుకొస్తారు.

సాంస్కృతిక ఎత్తుగడల ద్వారా, శక్తివంతమైన సోషల్ ఇంజనీరింగ్ చర్యల ద్వారా మితవాద బిజెపి గత రెండు దశాబ్దాల్లో ఇబిసి లను బాగా కదిలించగలిగింది. ఉత్తర భారతదేశంలోని అనేక రాష్ట్రాల్లో బిజెపి అధికారంలోకి రావడం వెనుక ఈ ఇబిసి లు వున్నారు. దాంతో బిజెపి అగ్రకులాల రాజకీయ పార్టీ అనే విమర్శను అది వదిలించుకుంది. వివిధ సాంస్కృతిక చర్యలు, సామాజిక ఆచారాలు, ఆయా కులాల్లోని అగ్ర నాయకులను ముందుకు నెట్టి సమగ్ర హిందూత్వ (ఇంక్లూజివ్ హిందూత్వ) ను అది సాధించగలిగింది.

ముఖ్యంగా యాదవులు మిగిలిన వారి పదవులను కూడా దోచుకుని, రాజ్యాన్ని కైవసం చేసుకున్నారన్న బిజెపి విమర్శకు ఇబిసి లు బాగా ఆకర్షితులైనారు. కులాలకతీతంగా బిజెపి గ్రామీణ పేదలకు, పట్టణ కార్మిక వర్గానికి సాయపడిందనే వాదనకు ఆధారాలు లేవని వివిధ ఇబిసి లకు అదిచ్చిన హామీలు అమలుకు నోచుకోక పోవడాన్ని బట్టి చూడవచ్చు. ఇబిసి లు ఒక బలమైన సామాజిక, రాజకీయ శక్తిగా ఆవిర్భవించి సాంప్రదాయక సంస్థలను ప్రజాతంత్రీ కరిస్తుందనేది నిజం కాదని బిజెపి పాలన రుజువు చేసింది.

ప్రభుత్వ రంగ సంస్థల్లో అత్యంత వెనుకబడ్డ కులాల సరైన ప్రాతినిధ్యం బిజెపి పాలనలో రాలేదు. ఒక విషయం మాత్రం స్పష్టం. ఇబిసి ల వంటి వెనకబడ్డ కులాలకు కొద్దిగా నైవేద్యం పెడుతున్న కీలకమైన సంస్థలన్నీ ఆధిపత్య కులాల చేతిలోనే ఉన్నాయి.

ప్రభుత్వ, ప్రైవేటు రంగంలో పైపైన సర్వే చేసినా మనకి కనపడే వాస్తవమేమంటే జ్యుడీషియరీ, దేశంలోని అత్యున్నత స్థాయి అధికార యంత్రాంగం, మీడియా, సాంస్కృతిక రంగాలన్నీ ఆధిపత్య కులాల చేతిలోనే ఉన్నాయి. పేదలు, అత్యంత బలహీన కులాలకు సంబంధించిన బాధలను పట్టించుకోవడంలో ప్రభుత్వ సంస్థలు వైఫల్యం చెందాయి.

బీహార్ కులసర్వే నివేదిక మితవాద శక్తుల గుండెల్లో రైళ్ల పరిగెట్టేలా చేస్తోంది. దానికి ప్రధాన కారణం అత్యంత వెనుకబడ్డ కులాల్లో ఇది చైతన్యాన్ని రగిలిస్తుంది. రాజ్యం తమకు రక్షణగా నిలవాలని వారు డిమాండు తెచ్చేలా చేస్తోంది. ఇబిసి లకు సమాన ప్రాతినిధ్యం, వారి దారుణ వర్గ పరిస్థితులు, రాజకీయంగా నాయకత్వ స్థానాల్లో లేకపోవడం, వంటి వాటిని ప్రతిపక్ష పార్టీలు ముందుకు తేవడం ద్వారా బిజెపి ఇంతకాలం చెప్పుకుంటున్న 'సమ్మిళిత అభివృద్ధి' డొల్లతనం బయటపడుతుంది.

నయా ఉదారవాద ఆర్థిక వ్యవస్థలో ప్రభుత్వ సంస్థలన్నీ పట్టణ ధనిక సామాజిక గ్రూపుల ఆధ్వర్యంలో ఉండటం వల్ల దళిత, బహుజన ప్రజలు అట్టడుగుకు నెట్టివేయబడ్డామనే భావనలో ఉన్నారు. బీహార్ సర్వే విడుదలతో ప్రభుత్వ, ప్రయివేటు సంస్థల అధికార నిర్మాణాల్లో తమకు మరింత సమానమైన వాటా దక్కాలనే డిమాండు ముందుకొస్తుంది. సామాజికంగా పైనుండే వారు అతి పెద్ద భూ యజమానులుగా ఉండటంతో పాటు సాంప్రదాయకంగా ఉండే ఫ్యూడల్ అధికారాలు, మధ్య తరగతి వారికుండే విశేషాధికారాలు తరతరాలుగా సంక్రమించిన శక్తివంతమైన సామాజిక సంబంధాలు వారికి ఉపయోగ పడుతున్నాయి. గతం నుండి ఉంటున్న పద్ధతిలోనే వీరు విధానాలను రూపొందించే అధికార వర్గాన్ని, సిఈఓలను, వ్యాపారవేత్తలను, సామాజిక, సాంస్కృతిక ప్రభావాలను వేసేవారిని ఈ నయా ఉదారవాద విధానాలు సృష్టిస్తున్నాయి. అట్టడుగునున్న ఈ ప్రజా సమూహాలకు ఉపయోగపడే రీతిలో ఉదారవాద విధానాలు నిర్మించిన నిర్మాణాలను ప్రజాస్వామీకరణ చేసే ప్రయత్నాలు చాలా తక్కువగా జరిగాయి.

ఆందోళనకరమైన అంశం ఏమంటే సామాజిక న్యాయం కోసం పోరాడే శక్తులుగా చెప్పుకునే ఆర్‌జెడి యునైటెడ్ బీహార్‌లోనూ, సమాజ్‌వాది పార్టీ యు.పి లోనూ పగ్గాలు చేపట్టిన సందర్భాల్లో కూడా బాగా వెనుకబడ్డ ప్రజలకు విధానాల రూపకల్పనలో గాని, ఆర్థికాభివృద్ధిలో గాని, పెద్ద ఉపయోగం కలుగలేదు. సైద్ధాంతికమైన అంశాలపై తప్ప ఈ అట్టడుగు ప్రజలకు సంబంధించిన కీలకాంశాలను ఈ పార్టీలు పట్టించుకున్నది లేదు. నిరంతర ఆధిపత్యంలో ఉన్న సామాజిక వర్గాలను వ్యతిరేకించేందుకు ప్రజలను తయారు చేసుకున్నదీ లేదు.

సాధారణంగా రాజకీయ చర్చలో ఇబిసి లను పేద, కష్టజీవులతో కలిపి ప్రభుత్వాలు అందించే సంక్షేమ ఫలాలు అందుకునే వారిగా భావిస్తున్నారు. ఇబిసి లు రాజ్యానికి, అంటే ఆధిపత్య కులాల దాతృత్వంపై ఆధారపడే వారిగా మిగలడం ప్రజాస్వామ్య నిర్మాణానికే నష్టం చేస్తుంది. ప్రస్తుతం బీహార్, యు.పి లలో ఇబిసి ల గొంతులు విడివిడిగా చిన్న కుల సంస్థలుగా చీలి ఉన్నాయి. అణగారిన కులాల సమస్యలు పరిష్కారం చేసే దిశలో అవి లేవు. ఈ దశలో సర్వే నివేదిక ఈ కులాలను స్వతంత్ర రాజకీయ వేదికలుగా మారేలా ఒత్తిడి చేస్తుంది. ఇది హిందూత్వ పునాదులను కదిలిస్తుంది. అంతేకాదు, ఇంతకాలం సామాజిక న్యాయం కోసం పోరాడేవారిగా ఫోజులు పెడ్తున్న వారి అసలు రూపాన్ని బహిర్గతం చేస్తుంది. ఇబిసి ల నిజమైన ఆవేదనను అర్థం చేసుకుని వారి సమస్యలకు న్యాయబద్ధమైన పరిష్కారం చూపేలా ఆ సామాజిక న్యాయం కోసం నిలబడ్డామని చెప్పుకునే వారిపై ఒత్తిడి చేస్తుంది. సామాజికంగా ఆధిపత్యంలో ఉన్న వారిపై ఒక ప్రజాస్వామ్యయుతమైన ఉప్పెనను లేవదీస్తుంది. ఆర్‌జెడి, ఎస్.పి, బిఎస్‌పి, డిఎంకె వంటి పార్టీలు తాము సామాజిక న్యాయం కోసం నిలబడ్డామని చెప్పుకుంటూ ఉంటాయి. అవి తమ విశ్వాసాన్ని మరోసారి పునరుద్ఘాటించి వారి మేనిఫెస్టోలో రాజకీయ కార్యకలాపాల్లో ఇబిసి లకు తగు స్థానాన్ని కల్పిస్తాయని ఆశిద్దాం. ఇబిసి ల కోసం నిలబడుతున్న శక్తులతో ఐక్య కార్యాచరణకు పైపార్టీలు తగు చొరవ చూపాలి.

ప్రతిపక్ష పార్టీల వేదిక 'ఇండియా' ఈ విషయ ప్రాధాన్యతను వెంటనే అర్థం చేసుకుని జాతీయ స్థాయిలో తాము కుల సర్వే చేపడతామని ప్రకటించింది. 'ఇండియా' వేదిక...ఇబిసి నాయకులకు సరైన స్థానాలు కల్పించి కొత్త రాజకీయ నిర్ణయాల్లో వారికి సముచిత స్థానం కల్పిస్తే...ఆర్థిక సాధికారత, సామాజిక న్యాయం అందుకోగల్గుతారు. అటువంటి విశ్వాసపాత్రమైన చర్యలు హిందూత్వ రాజకీయాలను, పెట్టుబడిదారీ అనుకూల ఎజెండాను ధ్వంసం చేయగలుగుతాయి.

(వ్యాసకర్త అసిస్టెంట్ ప్రొఫెసర్, జవహర్‌లాల్ నెహ్రూ యూనివర్సిటీ, న్యూఢిల్లీ)
('ఫ్రంట్‌లైన్' సౌజన్యంతో) ★

కవిత్వం

ఆకలి పోరాటం

అంతా బాగుందని ఎవరన్నారు
చీలికలైన పొరల్లోంచి
ఆకలి కేకలు వినిపిస్తూనే వున్నాయి.

అంతా సరిచేశామని
ఏ ఏలికలు చెప్పారు
మడత పడిన పేగుల్లోంచి
కడుపు మంట రాగాలు
ఎల్లవేళలా ఘోషిస్తూనే వున్నాయి.

నాలుగంచులా సవ్యంగా వుందని
ఏ పాలిత పాటలు ఊపందుకున్నాయి
మూల మూలల్లో వదిలేసిన
ఎంగిలి మెతుకుల్తో
కొన్ని ప్రాణాలు నిలుస్తున్నాయి.

అంతా మా కష్టమేనని
ఎవరు నినదిస్తున్నారు
బరువెక్కిన బతుకుల్లోంచి
కొన్ని దేహాలు రాలిపడుతున్నాయి.

అంతా మా సలవేనని
మాటల్ని పూసల్లా పేర్చిందెవరు
గొంతులెండిన శ్వాసల్లోంచి
కొన్ని మాటలు మూగబోయాయి.

ఇక ఆకలి పోరాటం
పిడికిలి బిగించందే
బక్కచిక్కిన శరీరాలకు చలనముండదు
మారుమూల అణచబడిన
అకలి కడుపులకు అన్నం వుండదు.

- నరెద్దుల రాజారెడ్డి
సెల్ : 9666016636

మీ వ్యాసాలు 5000 క్యారెక్టర్లు లేదా 700 పదాలు వుండాలి. పంపాల్సిన మెయిల్ :
editpageps@gmail.com

ధాన్యం రైతు గట్టెక్కేనా...

సమస్య

కె. శ్రీనివాస్

రాష్ట్రంలో ఈ ఖరీఫ్‌లో సుమారుగా 15 లక్షల ఎకరాలలో రైతులు వరి పంట సాగు చేశారు. ఆరుగాలం కష్టపడి పంట పండించడానికేగాక, ఆ పంటను అమ్ముకోవడానికి కూడా రైతు కష్టపడాల్సి వస్తోంది. పంట పండించడానికే కాక, అమ్ముకోవడానికి కూడా రైతు పెట్టుబడి పెట్టవలసి వస్తోంది.

ధాన్యం కొనుగోలు నిబంధనలు రైతుల పాలిట శాపంగా మారాయి. దళారీ వ్యవస్థను పూర్తిగా రద్దు చేశామని ప్రభుత్వం చెబుతోంది. కల్లాల నుండే ధాన్యాన్ని సేకరిస్తున్నామని గొప్పగా ప్రచారం చేసుకుంటున్నారు. మరి రైతులు కల్లాల్లో కన్నీళ్లు పెట్టుకుంటున్నారెందుకు? దీనికి ప్రభుత్వం నుండి సమాధానం లేదు. కల్లాల నుండి ధాన్యం కొనుగోలు జరగడం లేదు. ఆ విధంగా జరిగితే నాణ్యతా ప్రమాణాల పేరుతో రైతుల నుండి మిల్లర్లు డబ్బులు ఎందుకు వసూలు చేస్తున్నారు?

రైతులు మిల్లర్ల దగ్గరకు వెళ్ళనవసరం లేదని ముఖ్యమంత్రి, పౌర సరఫరాల మంత్రి చెబుతున్నారు. ధాన్యం రైస్ మిల్లుకు చేరిన తర్వాత రైతు భరోసా కేంద్రం అధికారి రైతుకు ఫోన్ చేసి మీ ధాన్యం ఫలానా మిల్లు దగ్గర ఉంది. ఆ మిల్లు యజమానితో మాట్లాడుకోమని చెబుతారు. తేమ శాతం, నూక శాతం ఎక్కువ ఉందని, బరువు తక్కువ ఉందని డబ్బులు చెల్లిస్తే గానీ ధాన్యాన్ని అన్‌లోడ్ చేయమని మిల్లర్లు చెప్పడంతో అనివార్యంగా రైతులు డబ్బులు కట్టాల్సి వస్తోంది. లారీ మిల్లుకు చేరే నాటికి కొంత డీజిల్ ఖర్చు అవుతుంది. ఈ తగ్గిన డీజిల్ మేరకు మిల్లు దగ్గర తూకంలో కొంత బరువు తగ్గుతుంది. ఆ పేరుతో కూడా రైతులను మోసగిస్తున్నారు. ఏ రైతైనా ప్రశ్నిస్తే ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ చెప్పులరిగేలా తిరగాల్సిందే. ఒకసారి మిల్లుకు చేరిన ధాన్యం మరలా ఆన్‌లైన్ కావడానికి వారం, పది రోజులు పడుతుంది. చేసేదిలేక గొడవ పడలేక మిల్లర్లకు రైతులు డబ్బులు చెల్లిస్తున్నారు. ప్రభుత్వం మాత్రం రైతుకు మద్దతు ధర చెల్లించామని గొప్పగా చెబుతోంది. రైతు భరోసా కేంద్రం వద్ద తేమ శాతం, నూక శాతం నిర్ణయిస్తున్నారు. ఆర్.బి.కె లకు కేటాయించిన వే బ్రిడ్జి కాటాల దగ్గర తూకం వేసి రైతులకు ట్రక్ షీట్లు ఇస్తున్నారు. ట్రక్ షీట్ ఇచ్చిన తర్వాత రైతు ధాన్యాన్ని కొనుగోలు కేంద్రానికి అప్పగించినట్లే. ప్రభుత్వ నిబంధనల ప్రకారం ధాన్యం రైస్ మిల్లు దగ్గరకు చేరిన తర్వాత రైతుకు ఎటువంటి సంబంధం లేదు. మరి ఆచరణలో ప్రభుత్వ అధికారులు ఈ నిబంధన ఎందుకు అమలు చేయడం లేదు. కల్లాల దగ్గరే ధాన్యం నాణ్యతా ప్రమాణాలు చూసుకోవాలి తప్ప మిల్లుకు చేరిన తర్వాత ఇబ్బందులకు గురిచేయడం తగదని రైతులు గగ్గోలు పెడుతున్నారు. అయినా ప్రభుత్వం పట్టించుకోవడం లేదు. ఆర్.బి.కె లు, రైస్ మిల్లుల దగ్గర ఉన్న తేమ శాతం లెక్కింపు మిషన్లు ఒకేరకమైనవి కావు. ఈ తేడాలు రాకుండా ఆర్‌బికె నిర్ణయించిన తేమ శాతం, నూక శాతం, వే బ్రిడ్జి తూకం ఆధారంగానే మిల్లుల దగ్గర ధాన్యాన్ని అన్‌లోడ్ చేసుకోవాలి.

గన్నీ బ్యాగులు, లోడింగ్, రవాణా (జి.ఎల్.టి) పేరుతో రూ.250 రైతుకు లబ్ధి చేకూరుస్తున్నట్లు ప్రభుత్వం చెబుతున్న దాంట్లో పూర్తి వాస్తవం లేదు. గోనె సంచులు రైస్ మిల్లర్లు రైతు భరోసా కేంద్రాలకు అందిస్తున్నారు. ప్రభుత్వం తమకు ఎటువంటి అద్దె చెల్లించడం లేదని మిల్లర్లు చెబుతున్నారు. రైతులకు ఇస్తున్న గోనె సంచులలో దాదాపు 30 శాతం చినిగినవే. వాటిని మరమ్మతులు కూడా చేయడం లేదు. చినిగిన గోనె సంచులలో పట్టిన ధాన్యం నేలపాలై రైతులు నష్టపోతున్నారు. క్వింటాకు హమాలీ చార్జీ రూ.25 ఇస్తున్నారు. ధాన్యం సొమ్ముతో రైతుల ఖాతాలకు జమ చేస్తామని చెబుతున్నా ఆచరణలో పూర్తిగా రైతులకు చేరడం లేదు. రవాణాకు సంబంధించి క్వింటాకు రూ.50 లోపు ఖర్చవుతుంది. ఏ విధంగా చూసినా క్వింటాకు రూ.100 లోపే జిఎల్‌టి రూపంలో రైతుకు అందుతోంది. జిఎల్‌టి పేరుతో రూ.150 ఎవరికి చేరుతున్నాయో ప్రభుత్వమే సమాధానం చెప్పాల్సి ఉంటుంది.

ధాన్యం కల్లాల దగ్గరకు చేరిన తర్వాత కొనుగోలు కేంద్రాల చుట్టూ రైతులు ప్రదక్షిణలు చేయాల్సి వస్తోంది. గోనెసంచులు అందుబాటులో ఉండవు. సంచులు ఇచ్చినా రవాణాకు లారీలు ఏర్పాటు చేయరు. వర్షాలు పడి ధాన్యం తడిచిపోతే నానా ఇబ్బందులు పడాల్సి వస్తోంది. సామూహిక కల్లాలు లేక రోడ్లపైనే ధాన్యాన్ని ఆరబెడుతున్నారు. సకాలంలో ధాన్యం కొనుగోలు చేయకపోవడంతో ఆ ధాన్యాన్ని కాపాడుకోవడానికి రాత్రింబవళ్లు కాపలా కాయాల్సి వస్తోంది. సరైన టార్పాలిన్లు రైతుకు అందుబాటులో లేవు. ఎరువుల సంచులతో కుట్టిన బరకాలనే వాడుతున్నారు. రైతు ధాన్యం అమ్మిన 21 రోజులలో నగదు బ్యాంకులలో జమ చేస్తామని చెప్తున్నా ఆచరణలో నెల దాటిపోతుంది. ధాన్యం మిల్లుకు చేరి అన్‌లోడ్ అయిన తర్వాత వెంటనే ఆన్‌లైన్ కావడం లేదు. ఫలితంగా నగదు చెల్లించడం ఆలస్యం అవుతోంది. నవంబర్, డిసెంబర్ నెలలు తుఫాన్ల కాలం కావడంతో కొనుగోలు నిబంధన ప్రకారం ధాన్యం 17 శాతం తేమ వచ్చే వరకు ఆరబెట్టడానికి రైతు చాలా ఇబ్బంది పడాల్సి వస్తోంది. తేమ శాతం నిబంధనలు సడలించాలి. ధాన్యం అమ్మకాల సందర్భంగా కౌలు రైతులు మరింతగా నలిగిపోతున్నారు. 80

శాతం ధాన్యం ఉత్పత్తి కౌలు రైతుల కష్టమే. పంట సాగుదారు హక్కు పత్రాలు ఇవ్వకపోవడంతో ఈ-క్రాప్‌లో భూ యజమానుల పేర్లనే నమోదు చేస్తున్నారు. యజమానుల పేరుతో ధాన్యం కొనుగోలు చేసి వారి బ్యాంక్ ఖాతాలకే నగదు జమ చేస్తున్నారు. కష్టపడి పంట పండించిన కౌలు రైతు పేరుతో ధాన్యం కొనుగోలు చేయకపోవడం అన్యాయం. గతంలో మాదిరిగా గ్రామ రెవెన్యూ అధికారి ధ్రువపత్రం ఆధారంగా కౌలు రైతుల నుండి ధాన్యం కొనుగోలు చేయాలి. ధాన్యం కొనుగోలు సమస్యలపై రైతులు, రైతు సంఘాలతో ప్రభుత్వం చర్చించడం లేదు. అధికార పార్టీ నాయకులతో రాష్ట్ర ప్రభుత్వం నియమించిన వ్యవసాయ సలహా మండలి సభ్యులతో మాత్రమే మాట్లాడుతున్నారు. ఫలితంగా వాస్తవ సమస్యలు ప్రభుత్వం, అధికారుల దృష్టికి వెళ్లడం లేదు.

ఖరీఫ్ సాగుకు ఒక ఎకరాకు సుమారుగా రూ.38,700 వరకు ఖర్చవుతుంది. కౌలు 13 నుండి 16 బస్తాల వరకు చెల్లిస్తున్నారు. ఖరీఫ్‌లో సరాసరి దిగుబడి 26 నుండి 28 క్వింటాళ్లు వస్తోంది. కౌలు రైతుకు గడ్డి కూడా మిగలడం లేదు. కౌలుతో కలుపుకుని సరాసరి పెట్టుబడి రూ.63,255 అవుతోంది. 28 క్వింటాళ్ల దిగుబడి వస్తే రూ.61,124 ఆదాయం వస్తుంది. ఖరీఫ్‌లో నష్టాలు వచ్చినా రబీలో కాస్త మిగులుతుందని, అప్పులు పుడతాయని, పాడి పశువులకు కాస్త గడ్డి దొరుకుతుందని ఆశతో ప్రత్యామ్నాయ ఉపాధి లేక కౌలు రైతులు వ్యవసాయం చేస్తున్నారు. నష్టాలపాలై ఆత్మహత్యలు చేసుకుంటున్నారు. కేంద్ర ప్రభుత్వం ప్రకటించిన మద్దతు ధరలు రైతుకు ఏమాత్రం సరిపోవు. వాస్తవ ఖర్చులను పరిగణనలోకి తీసుకోవడం లేదు. 2023-24 ఆర్థిక సంవత్సరానికి ధాన్యం క్వింటాల్‌కు కేంద్ర ప్రభుత్వం ప్రకటించిన మద్దతు ధర సాధారణ రకానికి రూ.2,183 (75 కేజీల బస్తాకు రూ.1637.25) ఎ గ్రేడ్‌కు రూ.2,203 (75 కేజీల బస్తాకు రూ.1652.25)గా ఉంది. సిపిఎం నేతృత్వంలోని కేరళ వామపక్ష ప్రభుత్వం క్వింటాల్ ధాన్యానికి రూ.900 వరకు బోనస్ ఇస్తోంది. మన రాష్ట్ర ప్రభుత్వం ఒక్క పైసా కూడా ఇవ్వడం లేదు. మన రాష్ట్ర బడ్జెట్‌లో ధరల స్థిరీకరణ నిధి పథకం పేరుతో రూ.3 వేల కోట్లు కేటాయిస్తోంది. ఈ పథకం ద్వారా ధాన్యానికి ఎంతో కొంత బోనస్ ఇచ్చి కొనుగోలు చేస్తేనే రైతు గట్టెక్కే పరిస్థితి ఉంటుంది.

/ వ్యాసకర్త ఎ.పి రైతు సంఘం రాష్ట్ర సహాయ కార్యదర్శి,
సెల్:94900 98574 /

జనవాక్యం

నీరు తొలి ప్రాధాన్యం

ముడి పచ్చడిలో కారం, కాసిన్ని నీళ్లు కలిపి అన్నంలో తింటే కూడా రుచిగానే ఉంటుంది. చివరాకరుకు అదీ అడుగంటితే నీటి కూడు కడుపు నిండా తాగి లేచిపోయే జనానికి... ఉప్పు, సప్ప నీరు దిక్కయితే అదెంత విషాదమో కదా. ప్రభుత్వాలకు సిగ్గనిపించకపోయినా ఇది నిజం. నిన్నమొన్నటి వరకు బావి, చెరువు అడుగుల నీరు తేరు పట్టి గొంతు తడుపుకున్న పల్లెలు నేడు రోజువారీ స్నానం, ఇతర ఇంటి అవసరాల కోసం అదే పరిస్థితిని ఎదుర్కొంటున్నాయి. చేలల్లో, పంట కాలవల్లో ఒళ్లు కడుక్కుని వచ్చి బట్టలు మార్చుకుని స్నానాన్ని సరిపుచ్చే అవకాశాన్ని కూడా నేడు మెట్ట సాగు దూరం చేసింది. చౌడు, కుంటలు, డొంకలు పూడ్చి కాలనీలు కడుతున్న ప్రభుత్వాలు అక్కడి భూగర్భ జలాల లభ్యత, నాణ్యతను పట్టించుకోవు. ప్రాణాధారమైన నీటి సౌకర్యం పట్ల చిన్న చూపు వివక్ష కిందకే వస్తుంది. నేడు ఎక్కువ శాతం భూగర్భ జలాలే నీటి అవసరాలు తీర్చు తున్నాయి. అవన్నీ ఉప్పలు, సప్పులు. అక్కడక్కడా చెరువులు, నదులు నీరు అందుబాటులో ఉన్నా శుద్ధి చేయడం మానేసి ముడి నీటి సరఫరానే చేస్తున్నాయి పంచాయితీలు. మట్టి, బురద, ఎరువులు, పురుగు మందుల రంగు, రుచి, వాసనే గ్రామీణ ప్రజల గుర్తింపుగా మారిపోయింది. కొత్తగా భవన నిర్మాణ కూలీలు సిమెంటు, సున్నం, ఇసుక, ఇటుకలు విదిల్చిన దువ్వ కొట్టుకుని రూపు రేఖల్నే మర్చిపోయారు. ప్రతీ రోజు ఒంటిని, ఒంటికి వేసుకునే దుస్తులను శుభ్రం చేయడం దాదాపు మొక్కుబడి వ్యవహారంగా మారిపోయింది. ఈ అసౌకర్యం శారీరక శ్రమ పట్ల గౌరవాన్ని, ఆసక్తిని, సంతృప్తిని చంపేస్తోంది. చమట వాసనను కూడా తొలగించలేని నీరు శ్రమ జీవులను మట్టి, మురికి, మసి మనుషులుగా మార్చి తరతరాలకు వారసత్వంగా అందిస్తోంది. నాణ్యమైన జీవితాన్ని సాకారం చేయడంలో నాణ్యమైన ఆహారం, విద్య, వైద్యం, నీరు ప్రధాన భూమిక పోషిస్తాయని ప్రభుత్వ పెద్దలకు, అధికారులకు తెలియదనుకోలేం. మనిషి అవసరాల్లో నీరే తొలి ప్రాధాన్యం. ప్రభుత్వాలు అందుకు భిన్నంగా ఆలోచించడమే విషాదం.

- ఎన్కే రావు,
బాపట్ల జిల్లా, ఆంధ్రప్రదేశ్

గ్యాస్ బాదుడు

- రూ.2000కు చేరువలో వాణిజ్య సిలిండర్ ధర

న్యూఢిల్లీ : వాణిజ్య అవసరాల కోసం ఎల్‌పిజి గ్యాస్‌ను వినియోగించే వారికి చేదు వార్త. చమురు కంపెనీలు వాణిజ్య ఎల్‌పిజి గ్యాస్ సిలిండర్ల ధరల్ని పెంచేశాయి. వాణిజ్య సిలిండర్ ధర తాజాగా రూ.101.50 పెరిగింది. గత రెండు నెలల్లో వాణిజ్య గ్యాస్ సిలిండర్ ధర పెరగడం ఇది రెండోసారి. కొత్త ధరలు బుధవారం నుంచే అమలులోకి వచ్చాయి. రాజధాని న్యూఢిల్లీలో 19 కిలోల వాణిజ్య గ్యాస్ సిలిండర్ ధర రూ.1731 నుండి రూ.1,833కు పెరిగింది. దేశంలోని నాలుగు మెట్రో నగరాలకు సంబంధించి చెన్నయ్‌లో దీని ధర అత్యధికంగా రూ.1,999.50 ఉండగా ముంబయిలో అతి తక్కువగా రూ.1,785.50కు విక్రయిస్తున్నారు. కొల్‌కతాలో ఈ సిలిండర్ ధర రూ.1,943గా, బెంగళూరులో రూ. 1914.50గా ఉంది. గత నెలలో చమురు కంపెనీలు వాణిజ్య సిలిండర్ ధరను రూ.209 పెంచాయి. సెప్టెంబర్‌లో రూ.158 తగ్గించాయి. ఇజ్రాయిల్-హమాస్ మధ్య జరుగుతున్న యుద్ధం కారణంగా ముడి చమురు ధరలు పెరుగుతున్నాయని, వాటికి అనుగుణంగానే వాణిజ్య సిలిండర్ల ధరల్ని పెంచాల్సి వస్తోందని చమురు కంపెనీలైన ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్, భారత్ పెట్రోలియం కార్పొరేషన్, హిందుస్థాన్ పెట్రోలియం కార్పొరేషన్ చెబుతున్నాయి.

వైఎస్ జగన్ కేసుల విచారణను మరో రాష్ట్రానికి బదిలీ చేయాలి

- సుప్రీంకోర్టులో రఘురామ కృష్ణరాజు పిటిషన్

ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో

ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి కేసులపై ఈనెల 3న సుప్రీంకోర్టులో విచారణ జరగనున్నది. సుప్రీంకోర్టు న్యాయమూర్తులు జస్టిస్ సంజీవ్ ఖన్నా, జస్టిస్ ఎస్వీఎస్ భట్టి ధర్మాసనం విచారణ చేపట్టనున్నది. అయితే జగన్మోహన్ రెడ్డి కేసుల విచారణను మరో రాష్ట్రానికి బదిలీ చేయాలని ఎంపీ రఘురామ సుప్రీంకోర్టులో పిటిషన్ వేశారు. తెలంగాణ సీబీఐ కోర్టులో జగన్ కేసుల విచారణలో జాప్యం జరుగుతోందని ఎంపీ రఘురామ తెలిపారు. 3071 సార్లు జగన్ కేసును సీబీఐ కోర్టు వాయిదా వేసిందని తెలిపారు. జగన్ ప్రత్యక్ష హాజరుకు కూడా సీబీఐ కోర్టు మినహాయింపు ఇచ్చిందన్నారు. వందల కొద్ది డిశ్చార్జి పిటీషన్లు వేశారని, కేసు విచారణ మరింత జాప్యం జరిగే అవకాశం ఉందని ఎంపీ రఘురామ పేర్కొన్నారు.

బిజెపికే అత్యధిక ఎలక్టోరల్ బాండ్లు

- రూ.5,272 కోట్లు (57 శాతం)
- కాంగ్రెస్‌కు కేవలం 10 శాతమే
- ఎడిఆర్ స్పష్టం

ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో

అత్యధిక ఎలక్టోరల్ బాండ్లు బిజెపికే వచ్చాయని అసోసియేషన్ ఆఫ్ డెమోక్రటిక్ రిఫార్మ్స్ (ఎడిఆర్) స్పష్టం చేసింది. ఎడిఆర్ డేటా ప్రకారం, ఎలక్టోరల్ బాండ్లు 2021-22 వరకు అన్ని రాజకీయ పార్టీలకు కలిపి రూ. 9,188 కోట్లకు పైగా విరాళాలుగా అందించాయి. అందులో బిజెపికి 57 శాతం పైగా నిధులు అందగా, కాంగ్రెస్‌కు కేవలం 10 శాతం మాత్రమే అందాయి. 2016-17 నుంచి 2021-22 మధ్య, డేటా అందుబాటులో ఉన్న చివరి సంవత్సరం వరకు ఏడు జాతీయ పార్టీలు, 24 ప్రాంతీయ పార్టీలు ఎలక్టోరల్ బాండ్ల ద్వారా మొత్తం రూ.9,188.35 కోట్ల విరాళాన్ని అందుకున్నాయి. ఇందులో కమలం పార్టీకి రూ.5,272 కోట్లు, కాంగ్రెస్‌కు కేవలం రూ.952 కోట్లు రాగా, మిగిలినవి ఇతర పార్టీలకు చేరాయి.

జాతీయ పార్టీలు ఎలక్టోరల్ బాండ్ల విరాళాలలో గణనీయమైన పెరుగుదల ఉంది. 2017-18 నుంచి 2021-22 మధ్య 743 శాతం పెరుగుదల ఉంది. దీనికి విరుద్ధంగా, అదే సమయంలో జాతీయ పార్టీలకు కార్పొరేట్ విరాళాలు 48 శాతం మాత్రమే పెరిగాయని ఏడీఆర్ పేర్కొంది. రాష్ట్ర పార్టీలు కూడా ఎలక్టోరల్ బాండ్ల ద్వారా తమ విరాళాలలో గణనీయమైన భాగాన్ని పొందాయి.

2016-17 నుంచి 2021-22 మధ్య రాజకీయ పార్టీలు అందుకున్న మొత్తం విరాళాలలో సగానికి పైగా ఎలక్టోరల్ బాండ్ల ద్వారా వచ్చినవేనని, ఇతర జాతీయ పార్టీలన్నింటి కంటే బిజెపికి ఎక్కువ నిధులు వచ్చాయని



ఏడీఆర్ తెలిపింది. 2016-17 నుంచి 2021-22 మధ్య కాలంలో ఏడు జాతీయ పార్టీలు, 24 రాష్ట్ర పార్టీల ద్వారా దాదాపు రూ.16,437 కోట్ల విలువైన విరాళాలు అందాయని పేర్కొంది. ఇందులో రూ.9,188.35 కోట్లు (దాదాపు 56 శాతం) ఎలక్టోరల్ బాండ్ల ద్వారా స్వీకరించబడ్డాయి.

పార్టీలకు రాజకీయ నిధుల కోసం ఎలక్టోరల్ బాండ్ స్కీమ్ చెల్లుబాటును సవాలు చేస్తూ దాఖలైన పిటిషన్లపై సుప్రీంకోర్టులోని ఐదుగురు న్యాయమూర్తుల రాజ్యాంగ ధర్మాసనం విచారణ బుధవారం కూడా కొనసాగింది.

అక్టోబర్‌లో రూ.1,148 కోట్ల ఎలక్టోరల్ బాండ్లు హైదరాబాద్‌లోనే అత్యధిక బాండ్లు

దేశంలో ఐదు రాష్ట్రాల ఎన్నికలకు ముందు రూ.1,148 కోట్ల ఎలక్టోరల్ బాండ్ల విక్రయం జరిగింది. వీటివల్ల వివిధ పార్టీలకు చేరిన కోట్ల రూపాయలు నిధులు సమకూరాయి. 28వ విడత ఎలక్టోరల్ బాండ్లను అక్టోబర్ 4 నుంచి 14 వరకు విక్రయించగా, అక్టోబర్ 9న ఐదు అసెంబ్లీ ఎన్నికలకు ఎన్నికల షెడ్యూల్‌ను కేంద్ర ఎన్నికల సంఘం ప్రకటించింది. నవంబర్‌లో ఐదు రాష్ట్రాల అసెంబ్లీ ఎన్నికలకు ముందు, స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఎస్‌బిఐ) అక్టోబర్‌లో మొత్తం రూ.1,148.38 కోట్ల ఎలక్టోరల్ బాండ్‌లను విక్రయించింది. అత్యధిక హైదరాబాద్ శాఖలో (33 శాతం) అమ్మకాలు జరిగాయి.

ఈమేరకు సమాచార హక్కు అర్జీకి ఇచ్చిన సమాచారం ప్రకారం ఎస్‌బిఐ హైదరాబాద్ శాఖ రూ. 377.63 కోట్ల ఎలక్టోరల్ బాండ్లను విక్రయించింది. ఇది మొత్తంలో దాదాపు 33 శాతం, కానీ ఎన్‌క్యాష్ చేయడానికి సమయం వచ్చినప్పుడు, తెలంగాణ రాజధానిలో రాజకీయ పార్టీలు రూ. 83.63 కోట్లు (7 శాతం) మాత్రమే రీడీమ్ చేశాయి. పారదర్శకత ప్రచారకర్త కమోడోర్ లోకేష్ కె బాత్రా (రిటైర్డ్) ఆర్‌టిఐ ప్రశ్నకు ఎస్‌బిఐ ఇచ్చిన సమాధానంలో 25 రాజకీయ పార్టీలు ఎలక్టోరల్ బాండ్లను రీడీమ్ చేయడానికి ఖాతాలు తెరిచాయని తెలిపింది.

ఎలక్టోరల్ బాండ్ల అమ్మకాలలో, హైదరాబాద్ తరువాత టాప్ బ్రాంచ్‌లుగా కలకత్తా (రూ.255.28 కోట్లు), ముంబాయి (రూ.177.90 కోట్లు), న్యూఢిల్లీ (రూ.130.68 కోట్లు), చెన్నై (రూ.95.50 కోట్లు) ఉన్నాయి. జాతీయ పార్టీలు తమ ఖాతాలను కలిగి ఉంటాయని భావిస్తున్న ఎస్‌బిఐ న్యూఢిల్లీ శాఖలో అత్యధిక మెజారిటీ ఎలక్టోరల్ బాండ్లు ఎన్‌క్యాష్ చేయబడ్డాయి. న్యూఢిల్లీలో రూ. 800 కోట్లు (70 శాతం), కలకత్తా రూ.171.28 కోట్లు, హైదరాబాద్, ముంబాయిల్లో రూ. 39 కోట్లు చొప్పున, పాట్నాలో 25 కోట్లు ఎన్‌క్యాష్ చేయడంలో మొదటి ఐదు స్థానాల్లో ఉన్నాయి. ఎలక్టోరల్ బాండ్లు రూ. 1,000, రూ. 10,000, రూ. 1 లక్ష, రూ. 10 లక్షలు, రూ. 1 కోటి డినామినేషన్లలో అందుబాటులో ఉన్నప్పటికీ, అతిపెద్ద డినామినేషన్ అత్యంత ప్రజాదరణ పొందింది. ప్రస్తుతం, ఎస్‌బిఐ 2,012 వ్యక్తిగత ఎలక్టోరల్ బాండ్లను విక్రయించింది. వీటిలో సగానికి పైగా (1,095) రూ. 1 కోటి విలువ కలిగి ఉన్నాయి.

రైలు, విద్యుత్ ప్రాజెక్టులు ప్రారంభించిన భారత్-బంగ్లాదేశ్

న్యూఢిల్లీ : భారత్ సహకారంతో బంగ్లాదేశ్‌లో చేపట్టిన పలు ప్రాజెక్టులను ప్రధానమంత్రి నరేంద్ర మోడీ బుధవారం బంగ్లాదేశ్ ప్రధాని షేక్ హసీనాతో కలిసి వర్చువల్‌గా ప్రారంభించారు. ఈ సందర్భంగా మోడీ మాట్లాడుతూ "భారత్ - బంగ్లాదేశ్‌ల మధ్య సహకారం విజయవంతమైంది. ఎన్నో అభివృద్ధి కార్యక్రమాలను గత 9 ఏళ్లలో ఇరు దేశాలు కలిసి చేశాయి. ఇది ఎంతో సంతోషించదగిన విషయం" అని అన్నారు. భారత్ సహకారంతో బంగ్లాదేశ్ పూర్తి చేసి ప్రాజెక్టుల్లో అఖౌరా - అగర్తలా క్రాస్ బోర్డర్ రైలు లింక్, ఖుల్నా - మొంగ్లా పోర్ట్ రైలు లైన్, మైత్రి సూపర్ థర్మల్ పవర్ ప్రాజెక్టులు ఉన్నాయి. అఖౌరా - అగర్తలా క్రాస్ బోర్డర్ రైలు లింక్ ప్రాజెక్ట్ పొడవు 12.24 కి.మీ. భారత్‌లో 6.78 కి.మీ, బంగ్లాదేశ్‌లో 5.46 కి.మీ మేర దీని నిర్మాణం జరిగింది. భారత ప్రభుత్వం ఈ ప్రాజెక్ట్ కోసం రూ. 392.52 కోట్లు ఖర్చు చేసింది. ఖుల్నా - మొంగ్లా పోర్ట్ రైలు లైన్ ప్రాజెక్ట్ వ్యయం 388.92 మిలియన్ డాలర్లు . ఈ ప్రాజెక్ట్ ద్వారా ఖుల్నా రైల్వే నెట్‌వర్క్‌ను బంగ్లాదేశ్‌లో రెండో అతిపెద్ద ఓడరేవు మొంగ్లా వరకు పొడిగించారు. దీని పొడవు 65 కి.మీ. ఇక మైత్రి సూపర్ థర్మల్ పవర్ ప్రాజెక్ట్ ద్వారా బంగ్లాదేశ్‌లోని ఖుల్నా డివిజన్‌లో ఉన్న రామ్‌పాల్ వద్ద 1320 మెగావాట్ల సామర్థ్యం కలిగిన పవర్‌ప్లాంట్‌ను నిర్మించారు.

మరాఠా రిజర్వేషన్లకు ఓకే : ఏక్‌నాథ్ షిండే

ముంబయి: మరాఠా సామాజిక వర్గానికి రిజర్వేషన్లు ఇచ్చేందుకు మహారాష్ట్ర ప్రభుత్వం అనుకూలమేనని ఆ రాష్ట్ర ముఖ్యమంత్రి ఏక్‌నాథ్ షిండే బుధవారం వెల్లడించారు. విద్య, ఉద్యోగాల్లో రిజర్వేషన్లు కల్పించాలని మరాఠాలు గత కొన్ని రోజులుగా ఆందోళనలు చేపడుతున్నారు. ఈ నేపథ్యంలో ప్రభుత్వం బుధవారం అఖిలపక్ష సమావేశాన్ని ఏర్పాటు చేసింది. కోటా కోసం నిరవధిక నిరాహార దీక్ష చేస్తున్న కార్యకర్త మనోజ్ జరంగే పాటిల్ తన దీక్షను విరమించాలని ఈ సందర్భంగా నేతలు ఓ తీర్మానం చేశారు. దానిపై ఏక్‌నాథ్ షిండే , ఉప ముఖ్యమంత్రి దేవేంద్ర ఫడ్నవీస్, ఎన్‌సిపి అధ్యక్షులు శరద్ పవార్, శివసేన యూబీటీ నేత ఉద్ధవ్ ఠాక్రే తరపున హాజరైన అనిల్ పరాబ్‌లు సంతకాలు పెట్టారు. చట్టపరంగా రిజర్వేషన్లను అమలు చేయడానికి ప్రభుత్వానికి కొంచెం సమయం కావాలని షిండే విజ్ఞప్తి చేశారు.

అప్రకటిత ఎమర్జెన్సీలో భాగమే

- ప్రతిపక్ష నేతలు, మీడియాపై నిఘా
- ఎస్‌కెఎం ఖండన

ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో

దేశంలో అప్రకటిత ఎమర్జెన్సీలో భాగమే ప్రతిపక్ష నేతలు, మీడియాపై ప్రభుత్వం నిఘా పెట్టిందని సంయుక్త కిసాన్ మోర్చా (ఎస్‌కెఎం) విమర్శించింది. మోడీ ప్రభుత్వం అప్రజాస్వామిక చర్యలు చేపట్టిందని దుయ్యబట్టింది. ఈ మేరకు బుధవారం ఎస్‌కెఎం ఒక ప్రకటన విడుదల చేసింది. ప్రతిపక్ష నాయకులు, మీడియా ప్రతినిధులపై నిఘా గురించి ఆపిల్ ఐ ఫోన్ జారీ చేసిన హెచ్చరిక నరేంద్ర మోడీ నేతృత్వంలోని కేంద్ర ప్రభుత్వం నిరంకుశ, రాజ్యాంగ వ్యతిరేక వైఖరిని బహిర్గతం చేసిందని పేర్కొంది. ఇది రాజ్యాంగంలోని ఆర్టికల్ 21, పార్ట్ 3 కింద పౌరులందరి గోప్యత, ప్రాథమిక హక్కుల ఉల్లంఘనను వెల్లడిస్తుందని తెలిపింది. ఏ పౌరుడి మొబైల్ ఫోన్‌లు, ల్యాప్‌టాప్ వంటి ఇతర పరికరాలను రిమోట్‌గా యాక్సెస్ చేసే నిఘా ప్రజాస్వామ్య సమాజంలో అంగీకరించబడదని పేర్కొంది. ఆపిల్ ఐఫోన్ తన వినియోగదారులకు ప్రభుత్వ ప్రేరేపిత దాడి గురించి హెచ్చరించి ఇలాంటి నోటిఫికేషన్‌లను పంపడం ఇది రెండోసారని తెలిపింది. 2021లో ఆపిల్, గూగుల్ రెండూ ఇజ్రాయెలీ కంపెనీ ఎన్ఎస్ఓచే తయారు చేయబడిన స్పైవేర్ అయిన పెగాసస్ చేసిన దాడికి వ్యతిరేకంగా హెచ్చరికను పంపాయని గుర్తు చేసింది. ఈ అంశంపై విచారణకు సుప్రీంకోర్టు నియమించిన కమిటీకి ప్రభుత్వం సహకరించడానికి నిరాకరించిందని పేర్కొంది. ప్రధాని నరేంద్ర మోడీ, కేంద్ర హోం మంత్రి అమిత్ షా పాలనలో ఇలాంటి చర్యలు కొత్తేమీ కాదని, ధ్వజమెత్తింది. ఈ ప్రభుత్వం చేసే చర్యల్లో న్యూస్‌క్లిక్‌లో తప్పుడు ఎఫ్ఐఆర్ తో మీడియా స్వేచ్ఛాపై దాడి, అమాయక జర్నలిస్టులను జైల్లో పెట్టేందుకు యూఏపీఏను దుర్వినియోగం చేయడం, రైతుల ఉద్యమానికి వ్యతిరేకంగా దేశ వ్యతిరేకమని ప్రచారం చేయడం, విదేశీ, ఉగ్రవాద శక్తులు నిధులు సమకూర్చడమంటూ ప్రచారం, అసమ్మతిని అణిచివేసే నీచమైన మార్గాలకు తాజా ఉదాహరణ పేర్కొంది.

ఘనంగా రాష్ట్ర అవతరణ దినోత్సవ వేడుకలు

ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో

ఢిల్లీలోని ఆంధ్రప్రదేశ్ భవన్ లో ఆంధ్రప్రదేశ్ అవతరణ దినోత్సవ వేడుకలు బుధవారం ఘనంగా జరిగాయి. బుధవారం ఆదిలీలా ఫౌండేషన్ హెల్త్ క్యాంప్ ను నిర్వహించగా 178 మందికి పైగా తమ ఆరోగ్యానికి సంబందించి ఉచిత వైద్యపరీక్షలు చేసుకున్నారు. ఈ కార్యక్రమంలో ఢిల్లీలోని వివిధ హాస్పిటల్స్ నుంచి 23 మంది వైద్యులు పాల్గొని విజయవంతంగా నిర్వహించారు. పీఆర్సీ ఆదిత్య నాథ్ దాస్, ఆర్సీ లవ్ అగర్వాల్, ఏఆర్సీ హిమానుషు కౌశిక్, యన్ వి. రమణారెడ్డి, స్పెషల్ కమీషనర్ జెండా వందనం చేశారు. అనంతరం అమరజీవి పొట్టి శ్రీరాములు చిత్రపటానికి జ్యోతిని వెలిగించి, పుష్పాంజలి ఘటించారు.

జెట్ ఎయిర్‌వేస్ రూ.538 కోట్ల ఆస్తులు జప్తు

- మనీలాండరింగ్ కేసులో ఇడి నిర్ణయం
- ఐదుగురిపై చార్జ్‌షీట్

న్యూఢిల్లీ : మనీలాండరింగ్ కేసులో జెట్ ఎయిర్‌వేస్‌కు చెందిన రూ.538 కోట్లకు పైగా విలువ చేసే ఆస్తులను ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఇడి) జప్తు చేసింది. జెట్ ఎయిర్‌వేస్ సంస్థ వ్యవస్థాపకుడు నరేష్ గోయల్, ఆయన భార్య, కుమారుడికి చెందిన లండన్, దుబాయ్ సహా భారత్‌లో వివిధ ప్రదేశాల్లో ఉన్న 17 వాణిజ్య ఫ్లాట్‌లు, ఇతర ఆస్తులను స్వాధీనం చేసుకున్నట్లు ఇడి వర్గాలు వెల్లడించాయి. ఆర్థిక సంక్షోభంతో 2019లో మూత పడిన జెట్ ఎయిర్‌వేస్.. కెనరా బ్యాంకులో రూ.538 కోట్ల మోసానికి సంబంధించిన కేసులో సెప్టెంబర్ ప్రారంభంలో నరేష్ గోయల్‌ను ఇడి అరెస్టు చేసింది. ప్రస్తుతం ఆయన జ్యుడీషియల్ కస్టడీలో ఉన్నారు. జెట్ ఎయిర్‌వేస్‌కు రూ.848.86 కోట్ల రుణాన్ని మంజూరు చేస్తే.. అందులో రూ.538.62 కోట్లు బకాయిలు ఉన్నాయని కెనరా బ్యాంకు ఫిర్యాదు ఆధారంగా సిబిఐ కేసు నమోదు చేసింది. బ్యాంకు నుంచి రుణంగా పొందిన ఆదాయంతో విదేశాలలో ఆస్తులు కొనుగోలు చేశారని ప్రధాన అరోపణ. జెట్ ఎయిర్‌వేస్‌కు ఇచ్చిన రుణాలను వ్యక్తిగత అవసరాలకు, ప్రయివేటు రుణాలు తీర్చేందుకు వినియోగించారని ప్రాథమిక విచారణలో తేలింది. ఈ కేసులో నరేష్ గోయల్‌తో పాటు మరో ఐదుగురిపై ఛార్జిషీట్ దాఖలు చేసింది. దాదాపు 26 ఏళ్ల పాటు జెట్ ఎయిర్‌వేస్ పౌర విమానయాన సేవల రంగంలో ఉంది. నిధుల మళ్లింపు, ఆర్థిక సంక్షోభంతో ఏప్రిల్ 2019లో కార్యకలాపాలను నిలిపివేస్తూ.. దివాలా పిటిషన్‌ను దాఖలు చేసింది.

'ధరణి'తో 20 లక్షల మంది రైతులకు నష్టం

- బిజెపి, టిఆర్ఎస్, ఎంఐఎం ఒకటయ్యాయి : రాహుల్ గాంధీ

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

రాష్ట్రంలో ధరణి వల్ల దాదాపు 20 లక్షల మంది రైతులు నష్టపోయారని, ధరణీ వల్ల కెసిఆర్ కుటుంబానికి తప్ప మరెవ్వరికీ లాభం జరగలేదని కాంగ్రెస్ పార్టీ జాతీయ నాయకులు రాహుల్ గాంధీ అన్నారు. రాష్ట్రంలో బిఆర్ఎస్, బిజెపి, ఎంఐఎం పార్టీలు ఒక్కటై ప్రజలను మభ్య పెట్టేందుకు ప్రయత్నిస్తున్నాయని విమర్శించారు. రాష్ట్ర ఎన్నికల్లో బిఆర్ఎస్ పార్టీని ఓడించి, 2024లో ఢిల్లీలో బిజెపి ప్రభుత్వాన్ని ఓడించేందుకు ప్రజలందరూ ముందుకు రావాలని పిలుపునిచ్చారు. పాలమూరు ప్రజా పోరులో భాగంగా బుధవారం కల్వకుర్తి, జడ్చర్ల, మహబూబ్‌నగర్ నియోజకవర్గాల్లో జరిగిన సభల్లో రాహుల్‌గాంధీ పాల్గొని మాట్లాడారు. రాష్ట్రంలో ముఖ్యమంత్రి కెసిఆర్ కుటుంబం అవినీతి అక్రమాలకు పాల్పడుతోందని ఆరోపించారు. తెలంగాణ ఏర్పడితే మేలు జరుగుతుందని ప్రజలందరూ ఎంతో కలలుగన్నారని వారి కలలను కెసిఆర్ కుటుంబం నిర్వీర్యం చేసిందని ఆగ్రహం వ్యక్తం చేశారు. కాళేశ్వరం ప్రాజెక్టు అంచనాలను పెంచుకుంటూ పోయి చివరకు రూ.లక్ష కోట్లు ఖర్చు చేశారని, ఇప్పుడు ఆ ప్రాజెక్టు పిల్లర్లు కుంగిపోవడం, నీరు ఉబికి రావడం లాంటి సమస్యలు బయటపడుతున్నాయని పేర్కొన్నారు. కాంగ్రెస్ పార్టీ ప్రకటించిన ఆరు గ్యారెంటీ పథకాలను తప్పనిసరిగా అమలు చేసి తీరుతామని హామీ ఇచ్చారు. మహిళలు పడుతున్న ఇబ్బందులను గమనించి 'మహాలక్ష్మి పథకం ద్వారా ప్రతి నెలా రూ.2500, వృద్ధులు, వితంతులకు రూ.నాలుగు వేల పింఛను, ఇంటి నిర్మాణానికి రూ.ఐదు లక్షలు, రైతుబంధు పేరుతో రూ.15 లక్షలు ఇస్తామని, మహిళలందరికీ ఆర్‌టిసి బస్సుల్లో ఉచిత ప్రయాణం కల్పిస్తామని తెలిపారు. సభల్లో పార్టీ వ్యవహారాల ఇన్‌చార్జి మాణిక్‌రావు ఠాక్రే, టిపిసిసి అధ్యక్షులు రేవంత్ రెడ్డి, సిఎల్‌పి నాయకులు భట్టి విక్రమార్క, ఎంపి ఉత్తమ్ కుమార్ రెడ్డి, సిడబ్ల్యుసి సభ్యులు వంశీచంద్ రెడ్డి, మల్లు రవి, పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, కల్వకుర్తి కాంగ్రెస్ అభ్యర్థి కసిరెడ్డి నారాయణరెడ్డి, జడ్‌పి వైస్ చైర్మన్ బాలాజీ సింగ్, కాంగ్రెస్ నియోజకవర్గ నాయకులు పాల్గొన్నారు.

ప్రభుత్వ ఉద్యోగాలకు పరీక్ష ఫీజు మాఫీ

- మధ్యప్రదేశ్ ఎన్నికల్లో కాంగ్రెస్ హామీ

భోపాల్: మధ్యప్రదేశ్‌లో కాంగ్రెస్‌ను గెలిపిస్తే ప్రభుత్వ ఉద్యోగాలకు పరీక్ష ఫీజు మాఫీ చేస్తామని హామీ ఇచ్చింది. ఇక్కడ కోటి మందికిపైగా యువత నిరుద్యోగులుగా ఉన్నారని కాంగ్రెస్ సీనియర్ నేత, కేంద్ర మాజీ మంత్రి ప్రదీప్ జైన్ ఆదిత్య మంగళవారం విలేకరుల సమావేశంలో తెలిపారు. రాష్ట్రంలో కోటి మందికిపైగా నిరుద్యోగులుండగా వీరిలో 40 లక్షల మంది ప్రభుత్వం వద్ద నమోదై ఉన్నారన్నారు. రాష్ట్రంలోని బీజేపీ ప్రభుత్వం కేవలం ఉద్యోగాల కోసం పరీక్ష ఫీజుగా ఈ యువత నుంచి రూ.100 కోట్లకు పైగా వసూలు చేసిందని తెలిపారు.

'ఇది గత 10 ఏండ్లలో పేద అభ్యర్థులకు అనేక సమస్యలను సృష్టించింది. గత 18 ఏండ్లలో 17,298 మంది నిరుద్యోగ యువత బలవన్మరణాలకు పాల్పడ్డారంటే పరిస్థితిని అంచనా వేయవచ్చు' అని అన్నారు.

యువకుల సమస్యలను దృష్టిలో ఉంచుకుని రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడితే ప్రభుత్వ ఉద్యోగాలకు దరఖాస్తు చేసుకునే యువతకు పరీక్ష ఫీజులు మాఫీ చేస్తామని, కేంద్ర మాజీ మంత్రి ప్రదీప్ జైన్ ఆదిత్య అక్టోబర్ 31న ఈ హామీ ఇచ్చారు. ఇదొక్కటే కాదు, ఫలితాలను నిలిపివేసిన పరీక్షలపై దర్యాప్తు చేయడానికి ఒక కమిషన్‌ను ఏర్పాటు చేస్తుంది. కాంగ్రెస్ ప్రభుత్వం ఆన్‌లైన్ పరీక్షలకు బదులుగా ఆఫ్‌లైన్ పరీక్షలను నిర్వహిస్తుందని ఆయన అన్నారు

ఉద్యోగ నియామకాల్లో మోసాలు, ఫలితాల ప్రకటనలో జాప్యం, పేపర్ లీకేజీల వల్ల యువత చాలా నష్టపోతున్నారని తెలిపారు. రాష్ట్రంలో నిరుద్యోగం పెరగడానికి ఇదే ప్రధాన కారణం. వ్యాపం, పట్వారీ రిక్రూట్‌మెంట్ స్కామ్‌ల వంటి అనేక కుంభకోణాలు రాష్ట్రంలో జరిగాయి. ఇది యువత నైతికతపై ప్రత్యక్ష ప్రభావం చూపిందన్నారు. రాష్ట్రంలో నవంబర్ 17న పోలింగ్ జరగనుంది. రాష్ట్రంలో మొత్తం 230 అసెంబ్లీ స్థానాలు ఉన్నాయి. ఈసారి పోటీ కాంగ్రెస్, బీజేపీల మధ్యే ఉంది. 2018 అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ ఎక్కువ సీట్లు సాధించి ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసింది. కానీ, ఈ ప్రభుత్వం కేవలం 15 నెలలు మాత్రమే ఉంటుంది. జ్యోతిరాదిత్య సింధియా కాంగ్రెస్‌ను వీడి బీజేపీలో చేరడంతో కమల్‌నాథ్ ప్రభుత్వం పడిపోయింది. ఆ తర్వాత శివరాజ్ సింగ్ నేతృత్వంలో బీజేపీ ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసింది.

మతతత్వం, మత మార్పిడి

బిజెపి ఈ రెండే తెలుసు : ఛత్తీస్‌గఢ్ సిఎం

రాయ్‌పూర్ : బిజెపికి మతతత్వం , మత మార్పిడి అనే రెండు అంశాలే ఉన్నాయి. ప్రజల మధ్య చిచ్చు పెట్టి రాజకీయం చేయటం బిజెపికి అలవాటుగా మారిందని ఛత్తీస్‌గఢ్ ముఖ్యమంత్రి భూపేష్ బఘేల్ విమర్శించారు. కాషాయ నేతలు ఏ పనీ చేయరు, ప్రజలతో పోరాడి ఓట్లు సేకరించరు. వారి మనసులో ద్వేషం, హింస ఉన్నాయి" అని బస్తర్‌లో జరిగిన సభలో సీఎం బఘేల్ అన్నారు. రాష్ట్ర మాజీ సీఎం రమణ్‌సింగ్‌పై విరుచుకుపడుతూ, "రమణ్‌సింగ్ హయాంలో బస్తర్‌లోని ఈ పచ్చని నేల ఎర్రగా మారింది...అన్న వ్యాఖ్యలపై సీఎం కౌంటర్ ఎటాక్ ఇచ్చారు. ఛత్తీస్‌గఢ్‌లో నవంబర్ 7, 17 తేదీల్లో రెండు దశల్లో ఎన్నికలు జరగనున్నాయి. మొత్తం ఐదు రాష్ట్రాలలో ఓట్ల లెక్కింపు డిసెంబర్ 3న జరుగుతుంది.

ఎన్నికల తేదీల ప్రకటనతో మోడల్ కోడ్ ఆఫ్ కండక్ట్ అమల్లోకి వచ్చింది.

అంతకుముందు 2018 అసెంబ్లీ ఎన్నికలలో, 15 సీట్లు కైవసం చేసుకున్న అప్పటి అధికార బీజేపీకి వ్యతిరేకంగా 90 సీట్లలో 68 సీట్లు గెలుచుకున్న కాంగ్రెస్ భారీ విజయాన్ని సాధించింది.

ప్రతిపక్ష నాయకుల అరెస్టుకు కేంద్రం కుట్ర

కోల్‌కతా: 2024 సార్వత్రిక ఎన్నికల కంటే ముందే దేశంలోని ప్రతిపక్ష నాయకులందర్నీ అరెస్టు చేయాలని కేంద్రంలోని బిజెపి కుట్ర పన్నుతోందని పశ్చిమబెంగాల్ ముఖ్యమంత్రి మమతా బెనర్జీ ఆరోపించారు. ఆ తర్వాత 'ఖాళీ దేశంలో' వాళ్లకు వాళ్లే ఓట్లు వేసుకోవాలని చూస్తున్నారన్నారు. ఢిల్లీ మద్యం విధానానికి సంబంధించి మనీలాండరింగ్ కేసులో ఢిల్లీ ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్‌తోపాటు అనేక మందికి ఇప్పటికే ఇడి నోటీసులు ఇచ్చిందని.. ప్రతిపక్ష పార్టీల ఎంపీల ఫోన్లు కూడా హ్యాకింగ్‌కు గురవుతున్నాయని మమత ఆరోపించారు. 'వచ్చే ఏడాది జరిగే సార్వత్రిక ఎన్నికల కంటే ముందే... విపక్ష పార్టీల గళాన్ని అణచివేయాలని వారు (బిజెపి) ప్రయత్నిస్తున్నారు. అంతకంటే ముందు ప్రతిపక్ష నేతలందర్నీ అరెస్టు చేయాలని ప్రయత్నిస్తున్నారు. తద్వారా వాళ్లకు వాళ్లే ఓట్లు వేసుకోవాలని చూస్తున్నారు. ఇందుకోసం వారు కుట్ర పన్నుతున్నారు' అని కోల్‌కతాలో జరిగిన విలేకరుల సమావేశంలో మమతా బెనర్జీ ఆరోపించారు. అలాగే ఉపాధి హామీ పథకం కింద పశ్చిమ బెంగాల్ రాష్ట్రానికి వచ్చే పెండింగు నిధులను ఈ నెల 16లోగా విడుదల చేయకుంటే తదుపరి కార్యాచరణను ప్రకటిస్తామన్నారు. తొలుత నవంబర్ 1 వరకే డెడ్‌లైన్ విధించినప్పటికీ.. గవర్నర్ హామీ మేరకు కొన్ని రోజులు వేచి చూస్తామన్నారు.

జబాలియా శరణార్థి శిబిరంపై మళ్లీ దాడి

- 50 మందికిపైగా మృతి
- ఇజ్రాయిల్ దాష్టీకంపై అరబ్ ప్రపంచం ఆగ్రహం
- క్షతగాత్రుల కోసం తాత్కాలికంగా రఫా సరిహద్దును తెరిచిన ఈజిప్టు
- ఇజ్రాయిల్‌తో దౌత్య సంబంధాలు కట్: బొలీవియా
- టెల్ అవీవ్ నుంచి తమ రాయబారిని వెనక్కి రప్పించిన జోర్డాన్

గాజా స్ట్రిప్: ఉత్తర గాజాలోని జబాలియా శరణార్థి శిబిరంపై యూదు దురహంకార ఇజ్రాయిల్ వరుసగా రెండవ సారి వైమానిక దాడి జరిపి అనేక మందిని పొట్టనపెట్టుకుంది. మంగళవారం జరిపిన దాడిలో శరణార్థి శిబిరంలో తలదాచుకున్న పాలస్తీనీయుల్లో 50 మంది చనిపోయారు. మరో 150 మంది గాయపడ్డారు. దీంతో గత 24 రోజుల్లో ఇజ్రాయిల్ దాడుల్లో మరణించిన పాలస్తీనీయుల సంఖ్య 8,538 కి చేరుకుంది. వీరిలో 3,542 మంది పిల్లలే. అయినా యుద్ధోన్మాది నెతన్యాహు రక్తదాహం తీరలేదు. బుధవారం కూడా మళ్లీ అదే శిబిరంపై వైమానిక దాడులు కొనసాగించాడు. గాజా సిటీ దిశగా భూతల దాడులను ఇజ్రాయిల్ సైన్యం విస్తరించింది. జబాలియా శరణార్థి శిబిరంపై అమానుష దాడిపై అరబ్ ప్రపంచం తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసింది. అంతర్జాతీయ మానవ హక్కుల సంస్థలు ఇజ్రాయిల్ దాష్టీకాన్ని ఖండించాయి. ప్రపంచ నేతలకు ఇప్పటికైనా కనువిప్పుకావాలని హెచ్చరించాయి. గాజాపై ఇజ్రాయిల్ నిరంతరాయంగా సాగిస్తున్న హంతక దాడులను ఆపేందుకు తక్షణమే కాల్పుల విరమణ పాటించేలా నెతన్యాహు మెడలు వంచాలని కోరాయి. ఇజ్రాయిల్ అనాగరిక దాడికి నిరసనగా జోర్డాన్ టెల్‌అవీవ్ నుంచి తన రాయబారిని వెనక్కి రప్పించింది. బొలీవియా ఇజ్రాయిల్‌తో దౌత్య సంబంధాలను తెగదెంపులు చేసుకున్నట్లు ప్రకటించింది. ఐక్యరాజ్యసమితి ఆధ్వర్యంలో నడుస్తున్న స్కూళ్లనే జబాలియా శరణార్థి శిబిరంగా మార్చారు. ఉత్తర గాజా నుండి బలవంతంగా తరిమివేయబడిన కుటుంబాలు ఇక్కడ తలదాచుకుంటున్నాయి. ఈ శిబిరాన్ని కూడా నాశనం చేయడం ఇజ్రాయిల్ రాక్షసత్వానికి పరాకాష్ట. ఈ దాడిలో గాయపడిన వారి కోసం రఫా సరిహద్దును ఈజిప్టు తొలిసారి తాత్కాలికంగా తెరచి ఉంచింది. గాజాకు ఇంధనం అందకుండా ఇజ్రాయిల్ అడ్డుకోవడం వల్ల గాజాలోని రెండు ప్రధాన ఆసుపత్రుల్లోని మెయిన్ జనరేటర్లు పూర్తిగా షట్‌డౌన్ అయ్యే పరిస్థితి ఏర్పడింది.

కృష్ణా జలాల పునఃపంపిణీపై ఇచ్చిన గెజిట్‌ను ఉపసంహరించాలి

- కెఆర్ఎంబి కార్యాలయాన్ని కర్నూలులో ఏర్పాటు చేయాలి
- 14, 15 తేదీల్లో విజయవాడలో దీక్షలు
- రౌండ్ టేబుల్ సమావేశంలో కె రామకృష్ణ, పి మధు

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

రాష్ట్రానికి అన్యాయం జరిగేలా కృష్ణా జలాలను పునఃపంపిణీ చేసేందుకు కేంద్రంలోని మోడీ ప్రభుత్వం గెజిట్‌ను విడుదల చేయడం సరైంది కాదని, తక్షణమే ఆ గెజిట్‌ను ఉపసంహరించాలని రౌండ్ టేబుల్ సమావేశం డిమాండ్ చేసింది. అలాగే కృష్ణా నదీ పరివాహకంతో ఏమాత్రం సంబంధం లేని విశాఖపట్నంలో కెఆర్ఎంబి కార్యాలయాన్ని ఏర్పాటు చేయాలని రాష్ట్ర ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాన్ని ఉపసంహరించుకుని కెఆర్ఎంబి కార్యాలయాన్ని కర్నూలులో ఏర్పాటు చేయాలని పేర్కొంది. అలాగే రబీ సీజన్‌కు ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయడంతోపాటు ఖరీఫ్‌లో నీరందక ఎండిపోయిన పంటలన్నింటికీ నష్టపరిహారం ఇవ్వాలని డిమాండ్ చేసింది. ఈ సమస్యలపై ఈ నెల 14, 15 తేదీల్లో విజయవాడలో నిరాహార దీక్షలు చేపట్టాలని రౌండ్‌టేబుల్ సమావేశం తీర్మానం చేసింది. బుధవారం విజయవాడలోని దాసరిభవన్‌లో జరిగిన ఈ రౌండ్ టేబుల్ సమావేశంలో సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కె రామకృష్ణ, సిపిఎం సీనియర్ నాయకులు పి మధు, కాంగ్రెస్ వర్కింగ్ ప్రెసిడెంటు సుంకర పద్మశ్రీ, జనచైతన్య వేదిక రాష్ట్ర అధ్యక్షులు లక్ష్మణ్‌రెడ్డి, రాయలసీమ సాగునీటి ప్రాజెక్టుల సాధన సమితి అధ్యక్షులు బొజ్జా దశరథరామిరెడ్డి, జనసేన నాయకులు వెంకటేశ్వరరావు తదితరులు మాట్లాడారు. కేంద్రంలోని నరేంద్ర మోడీ ప్రభుత్వం తెలంగాణలో రాజకీయ లబ్ధిపొందేందుకు కృష్ణా జలాల పునఃపంపిణీకి పూనుకుందని విమర్శించారు. కృష్ణా జలాల విషయంలో తీవ్ర అన్యాయం జరుగుతుందని తెలిసినా జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం కేంద్రాన్ని ఎందుకు నిలదీయలేక పోతోందని ప్రశ్నించారు. కేంద్రం తీసుకున్న ఈ నిర్ణయంతో రాయలసీమ జిల్లాలతో పాటు ఉమ్మడి నెల్లూరు, ప్రకాశం, కృష్ణా, గుంటూరు జిల్లాలకు తీవ్ర అన్యాయం జరుగుతుందన్నారు. కేంద్రంలోని నరేంద్ర మోడీ ప్రభుత్వంపై రాష్ట్ర ప్రభుత్వం ఒత్తిడి పెంచేలా ఉద్యమాలను ఉధృతం చేయాలని కోరారు.

సాలూరులో ఆటోనగర్‌ను అభివృద్ధి చేయాలి

- సిఎంకు సిపిఎం రాష్ట్ర కార్యదర్శి శ్రీనివాసరావు లేఖ

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

పార్వతీపురం మన్యం జిల్లాలోని సాలూరులో ఆటోనగర్‌ను అభివృద్ధి చేయాలని, పాచిపెంట మండలంలో కల్తీ విత్తనాల వల్ల నష్టపోయిన రైతులను ఆదుకోవాలని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి శ్రీనివాసరావు కోరారు. ఈ మేరకు బుధవారం సిఎంకు లేఖ రాశారు. పార్వతీపురం మన్యం జిల్లాలో ప్రజారక్షణ భేరి సందర్భంగా గ్రామాలు, పట్టణాలు సందర్శించామని, అందులో సాలూరు, పాచిపెంట మండలాల్లో స్థానిక ప్రజలు వారు ఎదుర్కొంటున్న ఇబ్బందులను వివరించారని, వాటిని లేఖలో ప్రస్తావిస్తున్నానని తెలిపారు. రాష్ట్రంలో సాలూరు పట్టణం రవాణాకు పెద్ద కేంద్రాలలో ఒకటని, ఇక్కడ్నుంచి 1000 లారీలకుపైగా నడుస్తున్నాయని, రవాణాకు ట్రాన్సిట్ కేంద్రంగా ఉందని తెలిపారు. దీనిపై ఆధారపడి వేలాది మంది జీవిస్తున్నారని వివరించారు. వర్క్‌షాప్‌లు, రిపేర్‌షాపులు ఉన్నాయని, వాటిల్లో పనిచేసే వారికి ఉపాధి భద్రత కల్పించడానికి చర్యలు తీసుకోవాలని కోరారు. దీనిలో భాగంగానే ఆటోనగర్ అభివృద్ధి చేయాల్సిన అవసరం ఉందని, కొంతకాలం క్రితం భూమి కేటాయించినా ఇంతవరకు ప్రారంభించలేదని వివరించారు. తక్షణం ఆటోనగర్ ప్రారంభించి ఉపాధికి భద్రత కల్పించాలని విజ్ఞప్తి చేశారు. అలాగే సాలూరు, పాచిపెంట తదితర మండలాల్లో ఖరీఫ్‌లో బేయర్స్ కావేరి కంపెనీలు సరఫరా చేసిన కల్తీ మొక్కజొన్న విత్తనాలతో పదివేల ఎకరాల్లో పూర్తిగా పంట దెబ్బతిన్నదని, కంకులు రాక రైతులు నష్టపోయారని వివరించారు. నష్టపరిహారం చెల్లిస్తామని హామీ ఇచ్చిన కంపెనీలు అడ్రస్ లేకుండా పోయాయని తెలిపారు. తక్షణం ప్రభుత్వం జోక్యం చేసుకుని వ్యవసాయ శాఖ ద్వారా ఎన్యుమరేషన్ చేసి ప్రైవేట్ కంపెనీపై చర్య తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. రైతులకు నష్టపరిహారం ఇప్పించాలని, కల్తీ విత్తనాలు అంటగట్టి మోసం చేసిన ప్రైవేట్ కంపెనీలపై చర్య తీసుకోవాలని కోరారు.

మీ కోసం

చలికాలంలో చర్మం పాడిబారకుండా ఉండడానికి గ్లిజరిన్ సబ్బులు వాడితే మంచిది.

జీవన సారథ్యం

ప్రతి అవకాశంలోనూ కొన్ని అడ్డంకులు, ప్రతి అడ్డంకి వెనుకా కొన్ని అవకాశాలు ఉంటాయి.

తూనీగ

తూనీగ.. తూనీగ
మాతో స్నేహం చేస్తావా
చక్కని కబుర్లు చెపుతావా

తూనీగ.. తూనీగ
మాతో సావాసం చేస్తావా
కమ్మని కథలు చెపుతావా

తూనీగ.. తూనీగ
మాతో చెలిమి చేస్తావా
తీయని రాగం తీస్తావా

తూనీగ.. తూనీగ
మాతో మైత్రి కడతావా

చక్కిలిగింతలు పెడతావా

తూనీగ.. తూనీగ
మాతో సఖ్యం గుంటావా
మాతో ఉండిపోతావా

- కయ్యూరు బాలసుబ్రమణ్యం,
77802 77240.

లెక్క చేయండి

పిల్లలూ, ఇక్కడ పండ్ల ముక్కలను అంకెలుగా గణించి లెక్క చేశాం. క్లూ ఆధారంగా కివి పండు అంకెను మీరు కనిపెట్టండి.

నేను గీసిన బొమ్మ

ఆర్. రేష్మాచారు,
4వ తరగతి,
దిగువ సాంబయ్యపాలెం,
తొట్టంబేడు మండలం.

పిల్లలూ, మీ కథలు, బొమ్మలూ పంపండి. ఇదిగో మెయిల్ ఐడీ: chinnaarips@gmail.com

ఆందోళనలో కశ్మీరీలు

పిల్లల చదువు, ఉద్యోగం, కుటుంబ బాధ్యతలతో ఎందరో నిత్యం ఒత్తిడికి గురవుతుంటారు. అలసట, గుండెదడ, ఒత్తిడి, పోస్ట్ ట్రామ్టిక్ స్ట్రెస్ డిజార్డర్, ఆత్మహత్య చేసుకోవాలన్న ఆలోచనలు, ఇలా రకరకాల ఇబ్బందులు అనేకమందిని వేధిస్తుంటాయి. అయితే నిత్యం సంఘర్షణలతో జీవిస్తున్న కశ్మీరీ ప్రజల పరిస్థితి సాధారణ ప్రదేశాల్లో నివసిస్తున్న వారికంటే అత్యంత దారుణంగా ఉంటోంది. ఎప్పుడు ఏం జరుగుతుందో తెలియని అయోమయంలో అక్కడి ప్రజలు నలిగిపోతుంటారు. విద్య, ఉపాధి వంటి ఉజ్వల భవిష్యత్తుకు దూరమైన పిల్లలు, వీధుల్లో తుపాకీ మోతలు, పెల్లెట్ల దాడులు, గ్రామంలో మోహరించిన ఆర్మీ బలగాలు, ఆపదలో ఉన్నవారు, అత్యవసర చికిత్స అందించాల్సిన వారు గ్రామం దాటాలంటే కఠిన ఆంక్షలు, తనిఖీల పేరుతో బారులు తీరిన వాహనాల మధ్య గర్భిణీలు, పిల్లల అవస్థలు.. ఇలా భిన్న వాతావరణాన్ని ఏళ్ల తరబడి అనుభవిస్తున్న ఆ పౌరుల మానసిక స్థితి రోజురోజుకూ కుంగిపోతోంది. తాజా సర్వేలో వారి మానసిక ఆరోగ్యంపై వెలుగుచూసిన విషయాలు అక్కడి భయానక పరిస్థితికి అద్దం పడుతున్నాయి.

కాశ్మీర్ లోయలో ఇన్స్టిట్యూట్ ఆఫ్ మెంటల్ హెల్త్ అండ్ న్యూరోసైన్సెస్ ఇన్ శ్రీనగర్(ఐఎంహెచ్ఎఎన్ఎస్)లో మానసిక ఒత్తిడితో ఇబ్బందిపడుతున్న ప్రజల నుండి ఫోన్‌కాల్స్ తీసుకునే టెలీ కేంద్రానికి వచ్చిన ఫోన్‌కాల్స్ వివరాలు ఇలా వున్నాయి. ఆ కేంద్రం ప్రారంభించిన 2022 నవంబరు నుండి ఇప్పటివరకు 26, 477 ఫోను కాల్స్ వచ్చినట్లు జమ్ము-కాశ్మీర్ ఆరోగ్య కార్యదర్శి డాక్టర్ భూపేందర్ కుమార్ ఓ సెమినార్‌లో చెప్పారు. అందులో అత్యధికంగా ఒత్తిడితో బాధపడుతున్నామని 2854 మంది, విచారంగా ఉంటోందని 2,790 మంది, గుండె దడగా ఉందని 2,428 మంది, ఏ విషయంపై శ్రద్ధ పెట్టలేకపోతున్నామని, ఆసక్తి తగ్గిపోతోందని 1,931 మంది, అలసటగా ఉంటోందని 1,869 మంది, నిద్రలేమితో బాధపడుతున్నామని 1,601 మంది, ఆత్మహత్య ఆలోచనలు వస్తున్నాయని 799 మంది ఫోను చేసినట్లు ఆయన వివరించారు.

న్యూఢిల్లీలో గత నెల మొదటివారంలో నిర్వహించిన మెంటల్‌హెల్త్ డేలో భాగంగా వివిధ రాష్ట్రాల నుండి హాజరైన టెలీ మెంటల్ హెల్త్ ప్రోగ్రామ్ కేంద్రాలు అందించిన వివరాలలో జమ్మూ నుండి వచ్చిన ఐఎంహెచ్ఎఎన్ఎస్ అందించిన ఈ వివరాలే అగ్రభాగంలో నిలిచాయి. మానసిక ఆరోగ్య రక్షణలో విశేష కృషి చేసినందుకు ఆ కార్యక్రమంలో ఈ కేంద్రానికి అవార్డు కూడా ఇచ్చారు.

సెమినార్‌లో టెలీ సెంటర్ వెలువరించిన వివరాల ప్రకారం అక్టోబరు మొదటివారంలో కేంద్రానికి వచ్చిన వారిలో యువత, వృద్ధులు, మహిళలు, పిల్లలు విచారవదనాలతో తమ వంతు కోసం వేచివున్నారని తెలిపింది. కాశ్మీర్‌లో సంఘర్షణ మొదలైన నాలుగుదశాబ్దాల్లో ప్రతి తరం ఒత్తిడికి గురవుతుందనడానికి ఇదే ఉదాహరణ అని వివరించింది.

'40 ఏళ్ల మహిళ తన టీనేజ్ కొడుకుని తీసుకుని మానసిక ఆరోగ్యకేంద్రానికి వచ్చినప్పుడు, లోపలికి వెళ్లడానికి అతడు నిరాకరిస్తున్నాడు. 'కేంద్రానికి వచ్చినట్లు తన స్నేహితులకు తెలిస్తే గేలి చేస్తారని అతను భయపడుతున్నట్లు' ఆమె చెప్పింది. 'చికిత్స తరువాత అలా ఉండదు అని మేము అతనితో చాలా సమయం మాట్లాడినట్లు' వాళ్లకు ఎదురైన ఓ అనుభవం గురించి కూడా సెమినార్‌లో చెప్పారు.

మెంటల్ హెల్త్ ఇన్ కాశ్మీర్ : కోవిడ్ సంక్షోభం పేరుతో 2020లో కాశ్మీర్ లోయలో చేసిన ఓ సర్వేలో దశాబ్దాల తరబడి కాశ్మీర్‌లో నెలకొన్న పరిస్థితులకు నాలుగు తరాల ప్రజలు తీవ్ర మానసిక ఒత్తిడితో సతమతమౌతున్నట్లు తేలింది. ఒత్తిడితో41 శాతం, అలసటతో 26 శాతం, పోస్ట్ ట్రామ్టిక్ స్ట్రెస్ డిజార్డర్‌తో 19 శాతం, అర్థంకాని ఏదో వెలితితో 47 శాతం మంది ప్రజలు ఇబ్బందులు పడుతున్నట్లు సర్వేలో తేలింది. మానసిక ఆరోగ్యంపై అవగాహన కార్యక్రమాలు, మానసిక ఆరోగ్య పునరావాస కేంద్రాలను వీలైనంత వెంటనే ఏర్పాటు చేసేలా ఈ ఫలితాలు ఉన్నాయని కూడా ఆ నివేదిక తేల్చింది.

ప్రస్తుతం దేశవ్యాప్తంగా ప్రతి రాష్ట్రంలోనూ, కేంద్రపాలిత ప్రాంతాల్లోనూ టెలీ మెంటల్ హెల్త్ ప్రోగ్రామ్ ద్వారా 24 గంటలు సేవలు అందించేలా మెంటల్ హెల్త్ కౌన్సిలింగ్ సెంటర్లు నడుస్తున్నాయి. అలా కాశ్మీర్‌లో ఏర్పాటు చేసిన సెంటర్‌కి ఏడాది వ్యవధిలోనే ఇన్ని ఫోన్ కాల్స్ వచ్చాయి. అంతకు ముందు నుండే అంటే 1990 నుండి ఐఎంహెచ్ఎఎన్ఎస్‌కి అనుసంధానంగా మానసిక ఆరోగ్యకేంద్రం అక్కడ నిర్వహించబడుతోంది. అప్పట్లో వెయ్యిమంది బాధితులు కేంద్రాన్ని సందర్శించినట్లు నివేదికలు ఉన్నాయి. కేంద్రం ప్రారంభించిన ఏడాదికే 1764 మందికి ఆ సంఖ్య పెరిగినట్లు కూడా నమోదైంది.

వేగంగా మారిపోతున్న రాజకీయ పరిణామాలు, తుపాకీ మోతలు, దాడులు, భద్రత లేని బతుకులు రోజురోజుకూ పెరిగిపోయి, 2004 నాటికి ఆ సంఖ్య 62 వేలకు చేరింది. 2017 నాటికి 1,06,743 మంది పౌరులు కేంద్రాన్ని సందర్శించడం ఆందోళన కలిగిస్తున్నా, ఒత్తిడిని దూరం చేసుకునేందుకు వైద్యున్ని సంప్రదించడం ఆహ్వానించే పరిణామమని అప్పట్లో నిపుణులు అభిప్రాయపడ్డారు. కానీ తాజా గణాంకాలు ఆందోళన కలిగిస్తున్నాయని, పరిస్థితి ఇలాగే ఉంటే అక్కడి ప్రజలు తీవ్ర పరిణామాలకు గురౌతారని ఆవేదన చెందుతున్నారు.

చలి నుంచి కాపాడే స్వెట్టర్లు

శీతాకాలం...చలి గాలులు బాగా విజృంభించే కాలం. ఈ కాలంలో చలి నుంచి కాపాడే దుస్తులు, స్వెట్టర్లు మార్కెట్లో విరివిగానే లభిస్తున్నాయి. చలి నుంచి వెచ్చదనం కోసం ఇవి దోహదపడతాయి. అందులోనూ మహిళలు చలికాలంలో బాగా ఇబ్బందులు పడుతుంటారు. నాణ్యమైన స్వెట్టర్లు వినియోగించటం ద్వారా చలి నుంచి ఎంతోకొంత ఉపశమనం పొందొచ్చు. ఈ స్వెటర్లు ప్రస్తుతం రాష్ట్రంలోని అన్ని పట్టణాలు, నగరాల్లోని మార్కెట్లలో విరివిగా విక్రయిస్తున్నారు. అనేక రంగులు, వివిధ డిజైన్లలో అందుబాటులో ఉన్నాయి.

టినీ డిజైన్ స్వెటర్ ఫర్ వింటర్ వేర్ : ఈ రకం స్వెట్టర్లు చూడటానికి చాలా ఆకర్షణీయంగా ఉంటాయి. వీటిని ధరిస్తే వెచ్చని అనుభూతిని పొందొచ్చు. ధరించటం కూడా చాలా సులువే. శరీరానికి పూర్తి సౌకర్యంగా ఉంటుంది.

ఉలెన్ వి నెక్ కార్డియన్ స్వెటర్ ఫర్ వింటర్ : చూడటానికి కూడా చాలా చక్కగా ఉంటుంది. చాలా తేలికైన, సౌకర్యవంతమైన స్వెటర్. ఎలాస్టిక్ స్వభావం కలిగి ఉంది. అదనపు సౌకర్యాన్ని అందిస్తుంది. స్వెటర్‌ను దేనితోనైనా జత చేయొచ్చు. ధరిస్తే చాలా హుందాగా ఉంటుంది. నెక్, బటన్ క్లోజర్‌తో అందుబాటులో ఉంది.

ఉలెన్ స్వెట్టర్స్ : ఈ స్వెటర్‌ను ధరిస్తే మహిళలు మంచి స్టైలిష్ రూపాన్ని పొందొచ్చు. నెక్‌తో వస్తున్న లాంగ్ స్లీవ్ ఇవ్వబడింది. దీని మెటీరియల్ చాలా మృదువైంది. ధరిస్తే పూర్తి సౌకర్యవంతంగా ఉంటుంది. రోజువారీ ఉపయోగం కోసం సరైంది. జీన్స్, స్కర్ట్, లెగ్గింగ్స్ మొదలైన వాటితో జత చేయొచ్చు.

ఉమెన్ ఉలెన్ డిజైనర్ : దీనిని ధరిస్తే సౌకర్యంతోపాటు చూడటానికి అందంగా ఉంటుంది. ఇది చాలా మృధువైనది. వెచ్చని అనుభూతిని అందిస్తుంది. చలిలో చాలా ఉపశమనం పొందొచ్చు. స్వెట్టర్లను జీన్స్, ప్యాంట్, జెగ్గింగ్స్ లేదా లెగ్గింగ్‌లతో రెగ్యులర్ ఫిట్‌తో జత చేయొచ్చు. ప్రతిరోజూ ఆఫీసుకు కూడా ధరించొచ్చు.

ఉలెన్ బటన్ సాలిడ్ స్వెట్టర్ : దీని ఖరీదు కాస్త ఎక్కువగా ఉంటుంది. అల్లిక చాలా బాగుంది. దీని మెటీరియల్ చాలా మృధువుగా ఉంది. అదనపు సౌకర్యాన్ని పొందుతారు. అద్భుతమైన పూల డిజైన్‌తో వస్తుంది. ఇది మీ రూపాన్ని మరింత మెరుగుపరుస్తుంది. దీనిని ఉతకటం కూడా చాలా సులువు.

ఇజ్రాయిల్ యుద్ధ నేరాలు



'నరకాసుర' సూపర్ హిట్ అవుతుంది : రక్షిత్ అట్లూరి

అద్భుతమైన కథతో సాగిన 'నరకాసుర' సినిమా సూపర్ హిట్ అవుతుందనే నమ్మకం తనకుందని హీరో రక్షిత్ అట్లూరి చెప్పారు. ఈ సినిమాలో అపర్ణ జనార్ధన్, సంకీర్తన విపిన్ హీరోయిన్లు. సుముఖ క్రియేషన్స్, ఐడియల్ ఫిలిం మేకర్స్ బ్యానర్స్‌లో డాక్టర్ అజ్జ శ్రీనివాస్ నిర్మించారు. సెబాస్టియన్ నోవా అకోస్టా జూనియర్ దర్శకత్వం వహించారు. ఈ నెల 3న తెలుగుతో పాటు హిందీ, తమిళ్, మళయాల, కన్నడ భాషల్లో విడుదల కానుంది. ఈ సందర్భంగా రక్షిత్ అట్లూరి మీడియాతో మాట్లాడారు. 'నరకాసుర" మూవీ ఏపీ, తమిళనాడు సరిహద్దుల్లోని ఓ కాఫీ ఎస్టేట్ నేపథ్యంలో సాగుతుంది. ఈ సినిమాలో నేను లారీ డ్రైవర్ శివ అనే క్యారెక్టర్‌లో నటించాను. నాజర్ కాఫీ ఎస్టేట్ సూపర్ వైజర్ క్యారెక్టర్ చేస్తున్నారు. నేను ఆయన దగ్గర పనిచేసే డ్రైవర్ కమ్ పెప్పర్ హార్వెస్టర్‌గా కనిపిస్తాను. నా గత సినిమా పలాసలో దళితులకు సంబంధించిన సమస్యలు చూపించినట్లే 'నరకాసుర" సినిమాలో హిజ్రాలకు సంబంధించిన పాయింట్ ఒకటి తీసుకున్నాం. కథలో ఇదొక అంశం మాత్రమే. సినిమా అంతా కమర్షియల్ ఎలిమెంట్స్‌తో ఉంటుంది. ఈ ట్రాన్స్ జెండర్స్ అంశం కథలో ఒక సంఘర్షణకు కారణంగా నిలుస్తుంది' అని వివరించారు.

కొత్త రిలీజ్ డేట్‌తో 'ఆదికేశవ'

వైష్ణవ తేజ్, శ్రీలీల జంటగా నటించిన 'ఆదికేశవ' సినిమా విడుదల మరోసారి వాయిదా పడింది. ఈ నెల 10న విడుదల కావాల్సిన ఈ సినిమాని నవంబర్ 24కి వాయిదా వేస్తున్నట్లు నిర్మాత సూర్యదేవర నాగవంశీ ప్రకటించారు. సితార ఎంటర్‌టైనమెంట్స్ బ్యానర్‌పై నిర్మిస్తున్న ఈ సినిమా ప్రచార కార్యక్రమాలు ఇటీవలె ప్రారంభించారు. 'ప్రపంచ క్రికెట్ కప్ మ్యాచ్ జరుగుతున్న దృష్ట్యా ఇండియా మ్యాచ్ ఆడే రోజు సినిమా థియేటర్స్‌లో కలెక్షన్స్ బాగా పడిపోతున్నాయి. 'మాడ్', 'లియో' సినిమాలప్పుడు ఈ విషయం అర్థమైంది. అందుకనే ఈ 'ఆదికేశవ' సినిమా విడుదలని కూడా నవంబర్ 24కి వాయిదా వేస్తున్న'ట్లు నాగ వంశి వివరణ ఇచ్చారు. అలాగే 'దీపావళికి సల్మాన్ ఖాన్ 'టైగర్ 3' కూడా వస్తోంది. రెవిన్యూ షేర్ చేసుకోవటం ఇష్టం లేద'న్నది కూడా ఒక కారణం అని ప్రకటించారు.

నా సొంత సినిమా లాంటిది

మా ఊరి పొలిమేర-2 ప్రీరిలీజ్ వేడుకలో హీరో అడవి శేష్

'నా ఫస్ట్ సక్సెస్ క్షణంకు వర్క్ చేసిన టీమ్ అంతా ఈ టీమ్‌లో ఉన్నారు. ముఖ్యంగా ఈ చిత్ర దర్శకుడు అనిల్ నాకు మంచి స్నేహితుడు. అతని ప్రతిభ నాకు తెలుసు. ఈ రోజు అతను ఓ బ్లాక్‌బస్టర్ సినిమా తీసి దానికి సీక్వెల్ తీయడం ఆనందంగా వుంది. ఇది నా సొంత సినిమా లాంటిది.ఈ చిత్రానికి ఎంతో మంది టాలెంటెడ్ పీపుల్ వర్క్ చేశారు. తప్పకుండా ఈ చిత్ర మంచి విజయం సాధిస్తుందనే నమ్మకం వుంది' అని హీరో అడవి శేష అన్నారు. 'మాఊరి పొలిమేర' చిత్రానికి సీక్వెల్‌గా రూపొందుతున్న చిత్రం 'మా ఊరి పొలిమేర 2' డాక్టర్ అనిల్ విశ్వనాథ్. దర్శకుడు. సత్యం రాజేష్, కామాక్షి భాస్కర్ల, బాలాదిత్య, రాకేందు మౌళి ముఖ్యపాత్రల్లో నటించారు. గౌరికృష్ణ నిర్మాత. ఈనెల మూడో తేదీన చిత్రం ప్రేక్షకుల ముందుకు రానుంది. వంశీ నందిపాటి విడుదల చేస్తున్నారు. ఈ చిత్రం ప్రీరిలీజ్ వేడుక హైదరాబాద్‌లో ఘనంగా జరిగింది. అడవి శేష్‌తో పాటు నిర్మాత ఎస్‌కేఎన్ ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. దర్శకుడు కరుణకుమార్‌తో, ప్రముఖ గాయకుడు పెంచలదాస్‌తో పాటు చిత్రంలో నటించిన నటీనటులు చిత్ర సాంకేతిక నిపుణులు పాల్గొన్నారు. ఈ వేదికపై చిత్ర బిగ్ టికెట్‌ను అతిథులు అడవి శేష్, ఎస్‌కేఎన్ ఆవిష్కరించారు.

సెమీస్‌కు దక్షిణాఫ్రికా

- డికాక్, డుస్సెన్ సెంచరీలు
- మహరాజ్‌కు నాలుగు వికెట్లు
- న్యూజిలాండ్‌పై 190పరుగుల తేడాతో గెలుపు

పుణె: ఐసిసి వన్డే ప్రపంచకప్‌లో దక్షిణాఫ్రికా జట్టు మరో భారీ విజయాన్ని సొంతం చేసుకుంది. మహారాష్ట్ర క్రికెట్ అసోసియేషన్ స్టేడియంలో బుధవారం న్యూజిలాండ్‌తో జరిగిన మ్యాచ్‌లో దక్షిణాఫ్రికా జట్టు ఏకంగా 190పరుగుల తేడాతో ఘన విజయం సాధించింది. తొలిగా బ్యాటింగ్‌కు దిగిన దక్షిణాఫ్రికా జట్టు నిర్ణీత 50 ఓవర్లలో 4వికెట్ల నష్టానికి 357పరుగుల భారీస్కోర్‌ను నమోదు చేసింది. ఛేదనలో న్యూజిలాండ్ జట్టు 35.3ఓవర్ల లో 167పరుగులకు కుప్పకూలింది. ఈ గెలుపుతో దక్షిణాఫ్రికా జట్టు 7మ్యాచుల్లో 12పాయింట్లతో సెమీఫైనల్లోకి ప్రవేశించింది. దక్షిణాఫ్రికా ఓపెనర్ క్వింటన్ డికాక్(114; 116 బంతుల్లో 10ఫోర్లు, 3సిక్సర్లు) ఈ ప్రపంచకప్‌లో నాల్గో శతకానికి తోడు, వాండర్ డుస్సెన్(133; 118బంతుల్లో 9ఫోర్లు, 5సిక్సర్లు) రెండో శతకాన్ని కొట్టాడు. చివర్లో డేవిడ్ మిల్లర్ (53; 30బంతుల్లో 2ఫోర్లు, 4సిక్సర్లు) మెరుపు ఇన్నింగ్స్ ఆడి అర్ధ శతకం సాధించాడు. దీంతో దక్షిణాఫ్రికా జట్టు నిర్ణీత 50 ఓవర్లలో 4వికెట్ల నష్టానికి 357పరుగుల భారీస్కోర్ నమోదు చేసింది. భారీ లక్ష్యాన్ని ఛేదించే క్రమంలో న్యూజిలాండ్ ఓపెనర్ కాన్వే(2) త్వరగా ఔటైనా.. యంగ్(33), మిఛెల్(24) ఫర్వాలేదనిపిం చారు. మిడిలార్డర్‌లో ఫిలిప్(60) అర్ధసెంచరీ మిన హా మరో బ్యాటర్ రెండంకెల స్కోర్ చేయలేక పోయారు. దీంతో న్యూజిలాండ్ జట్టు ఈ టోర్నమెం ట్‌లో తొలిసారి స్వల్ప స్కోర్‌కే ఆలౌటైంది. మహరా జ్‌కు నాలుగు, జెన్సన్‌కు మూడు, కొర్జేకు రెండు, రబడాకు ఒక వికెట్ దక్కాయి. ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్ డుస్సెన్‌కు లభించింది.

స్కోర్‌బోర్డు..

దక్షిణాఫ్రికా ఇన్నింగ్స్: క్వింటన్ డికాక్ (సి)ఫిలిప్స్ (బి)సోధీ 114, బవుమా (సి)మిఛెల్ (బి)బౌల్ట్ 24, డుస్సెన్ (బి)సోధీ 133, మిల్లర్ (సి)మిఛెల్ (బి)నీషమ్ 53, క్లాసెన్ (నాటౌట్) 15, మార్‌క్రమ్ (నాటౌట్) 6, అదనం 12. (50 ఓవర్లలో 4వికెట్ల నష్టానికి) 357పరుగులు. **వికెట్ల పతనం:** 1/38, 2/238, 3/316, 4/351 **వికెట్ల పతనం:** బౌల్ట్ 10-1-49-1, హెన్రీ 5.3-0-31-0, సోధీ 10-0-77-2, సాంట్నర్ 10-0-58-0, ఫిలిప్స్ 7-0-52-0, రవీంద్ర 2-0-17-0, నీషమ్ 5.3-0-69-1.

న్యూజిలాండ్ ఇన్నింగ్స్: కాన్వే (సి)మార్క్‌క్రమ్ (బి)జెన్సన్ 2, యంగ్ (సి)డికాక్ (బి)కొర్జె 33, రవీంద్ర (సి)కొర్జే (బి)జెన్సన్ 9, మిఛెల్ (సి)మిల్లర్ (బి)మహరాజ్ 24, లాథమ్ (సి)మహరాజ్ (బి)రబడా 4, ఫిలిప్స్ (సి)రబడా (బి)కొర్జే 60, సాంట్నర్ (బి)మహరాజ్ 7, టిమ్ సోధీ (ఎల్‌బి)జెన్సన్ 7, నీషమ్ (బి)మహరాజ్ 0, బౌల్ట్ (సి)మిల్లర్ (బి)మహరాజ్ 9, హెన్రీ (నాటౌట్) 0, అదనం 12. (35.3ఓవర్లలో ఆలౌట్) 167పరుగులు. **వికెట్ల పతనం:** 1/8, 2/45, 3/56, 4/67, 5/90, 6/100, 7/109, 8/110, 9/133, 10/167 **బౌలింగ్:** జెన్సన్ 8-1-31-3, ఎన్గిడి 6-1-28-0, రబడా 6-2-16-1, కొర్జే 6.3-0-41-2, మహరాజ్ 9-0-46-4.

వన్డే ప్రపంచకప్‌లో నేడు..
భారత్ × శ్రీలంక
(వేదిక: ముంబయి; మ.2.00గం॥లకు)

పాకిస్తాన్, ఆఫ్ఘనిస్తాన్‌లకు సెమీస్ ఛాన్స్..

వన్డే ప్రపంచకప్‌లో సెమీస్‌కు చేరే జట్ల సమీకరణలు మారుతున్నాయి. న్యూజిలాండ్ జట్టు తొలుత వరుసగా నాలుగు మ్యాచుల్లో గెలిచి దాదాపు సెమీస్‌కు చేరువైంది. ఆ తర్వాత వరుసగా మూడు ఓటములతో సెమీస్‌కు చేరడం క్లిష్టం చేసుకుంది. కివీస్ జట్టు చివరి రెండు మ్యాచ్‌లను పాకిస్తాన్, శ్రీలంకతో తలపడాల్సి ఉంది. సెమీస్‌కు చేరాలంటే ఈ రెండు మ్యాచుల్లో కివీస్‌కు గెలుపు తప్పనిసరి. మరోవైపు ఆస్ట్రేలియా జట్టు ప్రారంభంలో రెండు మ్యాచుల్లో ఓడినా.. ఆ తర్వాత వరుసగా నాలుగు మ్యాచుల్లో నెగ్గి 4వ స్థానానికి ఎగబాకింది. ఆసీస్ జట్టు ఇంగ్లండ్, ఆఫ్ఘన్, బంగ్లాదేశ్‌లతో మ్యాచ్‌లు ఆడాల్సి ఉంది. ఈ మూడు మ్యాచుల్లో రెండు నెగ్గినా సెమీస్‌కు చేరడం ఖాయం. ఇక పాకిస్తాన్ జట్టు విషయానికొస్తే.. ఆ జట్టు ఆడిన 7మ్యాచుల్లో 4 మ్యాచుల్లో ఓడి సెమీస్‌కు చేరడమే కష్టమనుకున్న దశలో మూడు మ్యాచుల్లో గెలిచి మళ్లీ రేసులోకి వచ్చింది. దక్షిణాఫ్రికా చేతిలో న్యూజిలాండ్ 190పరుగుల తేడాతో ఓటమితో పాక్‌కు అదృష్టం కలిసొచ్చింది. 4న బెంగళూరులోని చిదంబరం స్టేడియంలో న్యూజిలాండ్-పాకిస్తాన్ జట్లమధ్య మ్యాచ్ విజేత ఎవరో తేలితే సమీకరణలు మారనున్నాయి. మరోవైపు పసికూన ఆఫ్ఘనిస్తాన్ జట్టూ గట్టుమీద పిల్లిలా సెమీస్ బెర్త్‌వైపు చూస్తోంది. తన చివరి మూడు లీగ్ మ్యాచ్‌లైన నెదర్లాండ్స్, ఆస్ట్రేలియా, దక్షిణాఫ్రికాపై ఏ రెండు మ్యాచుల్లో గెలిచినా ఆ జట్టూ సెమీస్ బెర్త్ దక్కనుంది. దీంతో రాబోయే మ్యాచ్‌లు హోరాహోరీగా సాగడం ఖాయంగా కనబడుతోంది.

అమ్మాయిలకు మరో గెలుపు

- ఆసియా ఛాంపియన్స్‌ట్రోఫీ హాకీ

బెంగళూరు: ఆసియా ఛాంపియన్స్ ట్రోఫీ హాకీలో భారత మహిళల జట్టు మరో విజయాన్ని సొంతం చేసుకుంది. జపాన్‌తో జరిగిన మ్యాచ్‌లో భారత్ 2-1గోల్స్ తేడాతో విజయం సాధించింది. నవ్‌నీత్ కౌర్, దీపిక ఒక్కో గోల్ కొట్టాగా.. జపాన్ తరఫున ఏకైక గోల్‌ను కనాఉటారా చేసింది. మరో మ్యాచ్‌లో కొరియా జట్టు 3-0తో థాయ్‌లాండ్‌ను, చైనా జట్టు 4-0తో మలేషియాను చిత్తుచేశాయి.

పోల్‌వాల్ట్‌లో దేవ్ మీనాకు స్వర్ణం

- జాతీయ క్రీడలు

న్యూఢిల్లీ: జాతీయ క్రీడల్లో మధ్యప్రదేశ్‌కు చెందిన 18ఏళ్ల దేశ్‌కుమార్ మీనా పోల్‌వాల్ట్‌లో సంచలనం సృష్టించాడు. బుధవారం జరిగిన పోల్‌వాల్ట్ పోటీల్లో దేవ్ కుమార్ 5.16మీ. ఎగిరి స్వర్ణ పతకం సాధించాడు. అలాగే వచ్చే ఏడాది జరిగే ప్రపంచ అండర్-20 అథ్లెటిక్స్ ఛాంపియన్స్ పోటీలకు అర్హత సాధించాడు. 18ఏళ్ల దేవ్ కుమార్ వ్యవసాయ రైతు బిడ్డ. వ్యక్తిగత బెస్ట్ 5.20మీ. కాగా.. ఆ రికార్డును సమం చేయలేకపోయాడు.

పాయింట్ల పట్టిక

వ.స.	దేశం	ఆ	గె	ఓ	పా	నె.ర.
1.	దక్షిణాఫ్రికా	7	6	1	12	+2.29
2.	భారత్	6	6	0	12	+1.40
3.	ఆస్ట్రేలియా	6	4	2	8	+0.97
4.	న్యూజిలాండ్	7	4	3	8	+0.48
5.	పాకిస్తాన్	7	3	4	6	-0.02
7.	ఆఫ్ఘనిస్తాన్	6	3	3	6	-0.71
6.	శ్రీలంక	6	2	4	4	-0.27
8.	నెదర్లాండ్స్	6	2	4	4	-1.27
9.	బంగ్లాదేశ్	7	1	6	2	-1.44
10.	ఇంగ్లండ్	6	1	5	2	-1.65

ఆ:ఆడినవి; గె:గెలుపు; ఓ:ఓటమి; పా:పాయింట్లు; నె.ర:నెట్‌రన్‌రేట్

Published and Printed by Mallajosyula Venkata Subrahmanya Sarma on behalf of Prajasakti Printers & Publishers Private Limited from D.No.27-30-4,Akulavari Street,Governorpet, Vijayawada, Krishna Dt., and Printed at Prajasakti Printers & Publishers Private Limited, D.No.14-12-19, Krishna Nagar, Tadepalli (M), Guntur Dt., Editor : Bendi Tulasi Das, Ph : 9490099275, email:editorprajasakthi@gmail.com, RNI Regd.No. 15795/68